మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

NAMASTE TELANGANA

మంగళవారం TUESDAY 7.5.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4

సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 333 ‖ వెల (Price) రూ.6.50

మంగళవారం, సూర్యోదయం: 5-47, సూర్యాస్తమయం: 6-38. శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు చైత్ర మాసం కృష్ణ పక్షం తిథి: చతుర్దశి పగలు 11-41 వరకు, తదుపరి అమావాస్య. నక్షత్రం: అశ్విని పగలు 3-32 వరకు. వర్జ్యం: పగలు 11-55 నుంచి పగలు 1-22 వరకు, పునర్ వర్జ్యం రాత్రి 12-21 నుంచి రాత్రి 1-49 వరకు. రాహుకాలం: పగలు 3-23 నుంచి సాయంత్రం 5-00 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-20 నుంచి ఉదయం 9-12 వరకు. అమృతకాలం: రాత్రి 11-04 నుంచి రాత్రి 11-49 వరకు.





కేసీఆర్ గర్జన.. రైతుబంధు జమ

దెబ్బకు దయ్యం వదిలింది..

కేసీఆర్ రోడ్డెక్కంగనే ముఖ్యమంత్రికి వణుకుడు మొదలైంది
అందుకే ఆగమేఘాల మీద రైతుబంధు డబ్బులు వేస్తున్నడు
ఐదెకరాలు దాటితే ఇయ్యనన్నోడు.. రైతులందరికీ ఇస్తున్నడు
రైతుబంధు లెక్క పథకాలన్నీ రావాలంటే బీఆర్ఎస్ గెలవాలె
బతికున్నోళ్లను కాల్చిచంపుడేనా వాళ్లు చెప్పే గుజరాత్ మాడల్?
మోదీకి నేను లొంగలేదనే నా బిడ్డ కవితను జైల్లో పెట్టింండ్రు
దేశంలో బీడీ కార్మికులకు పింఛన్ ఇచ్చింది తెలంగాణలోనే
బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపిస్తే కేంద్రంలో కీలకపాత్ర పోషిస్తాం
ఈ రాష్ట్రం ఎవరి చేతుల్లో భద్రంగా ఉంటదో ఆలోచించాలె
నిజామాబాద్ రోడ్‌షోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు › 2

సర్కారు మెడలు వంచినం

ఇయ్యాల రైతుబంధు ఎందుకు పడింది? కేసీఆర్ పిడికిలి బిగించి, కాలు విరిగినా బస్సెక్కి గర్జన చేసిండు కాబట్టే రైతుబంధు పడింది. కేసీఆర్ దెబ్బకు ముఖ్యమంత్రి వెన్నులో వణుకు మొదలై ఇయ్యాల రైతుబంధు వేస్తున్నడు. ఈ ప్రభుత్వం మెడలు వంచి.. గ్యారెంటీలన్నీ అమలు చేయించాలంటే కచ్చితంగా బీఆర్ఎస్ గెలవాలె.

కవితను జైల్లోవేస్తే భయపడ్తనా?

మోదీని అన్నివిషయాల్లో నేను వ్యతిరేకించాను కాబట్టే నా బిడ్డ కవితను జైల్లో పెట్టింండ్రు. భయపడను. కాంప్రమైజ్ కాను. పోరాటం చేస్తడే తప్ప కేసీఆర్ ఏనాడూ లొంగిపోలేదు. ఇప్పుడు కూడా లొంగే ప్రసక్తే లేదు. –కేసీఆర్

నేను హిందువును.. అన్ని మతాల ఆత్మబంధువును

నేను కూడా హిందువునే. కానీ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి యావత్తు ప్రజల ఆత్మబంధువును. ఏ ఒక్క వర్గానికో కాదు. తెలంగాణలో ఉన్న ప్రజలందరూ బాగుపడాలె. అన్నివర్గాలు మంచిగుండాలె. హిందూ, ముస్లిం భాయ్.. భాయ్ అన్నట్టు ఉండాలె. కలిసి బతకాలె. దానిలోనే గొప్పతనం ఉంటది. బలముంటది. ప్రజలను విడదీసి, చీల్చి మతవిద్వేషాలను రెచ్చగొడితే వచ్చేదేమీ ఉండదు. ఎప్పటికీ బీఆర్ఎస్ పార్టీ సెక్యులర్‌గానే ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినందుకు బాధేమీ లేదు. తెలంగాణ కోసం, అన్ని వర్గాల ప్రజల కోసం కొట్లాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్సే. మరో పార్టీ కొట్లాడబోదు.

- నిజామాబాద్ రోడ్‌షోలో కేసీఆర్

ప్రాంతీయ శక్తులదే కేంద్రంలో అధికారం

రెండు కూటములకు పరాభవం తప్పదు
దేశవ్యాప్తంగా బీజేపీకి 200 సీట్లు రావు
రెండువిడతల్లోనే 200 గోబెల్స్ ప్రచారమే
బీఆర్ఎస్‌కు డజనుకుపైగా సీట్లు ఖాయం
కాంగ్రెస్, బీజేపీ పాలనలో దేశం అధోగతి
దేశం నుంచి పారిశ్రామికవేత్తలు పరార్
ఐదునెలలకే కాంగ్రెస్ సర్కార్ వైఫల్యం
ఢిల్లీ మద్యం కేసు మోదీ సృష్టించిందే
రేవంత్ భాషపై ఈసీ స్పందించదేం?
పీటీఐతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ › 3

ఐదెకరాలతో ఆగేది.. అందరికీ పడ్డది

నాడు అడ్డుపడ్డ కాంగ్రెస్.. నేడు వేయించిన బీఆర్ఎస్
ఐదెకరాలకే రైతుబంధు ఇవ్వాలని రేవంత్ సర్కార్ యోచన
డిసెంబర్‌లో జమ చేయాల్సిన నిధుల విడుదలలో జాప్యం
ఎన్నికల ప్రచారంలో సర్కారు తీరును ఎండగట్టిన కేసీఆర్
ప్రజాక్షేత్రంలో నిలదీయడంతో దిగొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
తాజాగా 2,423 కోట్లు విడుదల.. చెల్లింపులు ప్రారంభం

ఇదీ కేసీఆర్ ఎఫెక్ట్

హైదరాబాద్, మే 6(నమస్తే తెలంగాణ): 'ప్రభుత్వం మెడలు వంచైనా సరే రైతులకు రైతుబంధు ఇప్పిస్తా' అంటూ బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు చెప్పిన మాటలు వాస్తవమయ్యాయి. ఎప్పుడో డిసెంబర్, జనవరి నెలల్లో రైతుల ఖాతాల్లో జమ కావాల్సిన రైతుబంధు నిధులు, యాసంగి సీజన్ ముగుస్తున్నా › 5వ పేజీలో

పంజాబ్‌లో బీజేపీకి రైతుల సెగ

ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకుంటున్న అన్నదాతలు
డిమాండ్లపై ఎక్కడికక్కడ అభ్యర్థుల నిలదీత
జోక్యం చేసుకోవాలని ఈసీకి బీజేపీ ఫిర్యాదు › 7



గాంధీభవన్‌లో తన్నుకున్నరు

హైదరాబాద్ కాంగ్రెస్ సమావేశంలో రసాభాస › 6

• **కాంగ్రెస్ మంత్రి.. కరెన్సీ గుట్టలు!**



లోక్‌సభ ఎన్నికల వేళ జార్ఖండ్‌లో పెద్దమొత్తంలో నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. రాష్ట్ర మంత్రి, కాంగ్రెస్ నేత ఆలంగీర్ వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్‌లాల్ దగ్గర పనిచేస్తున్న వ్యక్తి నివాసంలో ఈడీ జరిపిన సోదాల్లో ఏకంగా 35 కోట్ల నగదు బయటపడింది. డబ్బుల కట్టలు గుట్టలుగా పడి ఉన్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. › 7

రేవంత్ సర్కార్ కరెంటు కాపలా!

- కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా విచిత్ర పరిస్థితులు
- సభలు, రోడ్‌షోల దగ్గర విద్యుత్తు సిబ్బంది మోహరింపు
- ఎన్నికల ర్యాలీల్లో పోలీసుశాఖకు దీటుగా విద్యుత్తు శాఖ గస్తీ
- ఇప్పటికే పలు సభల్లో పవర్‌కట్‌తో సర్కారుకు తలవంపులు
- ఎన్నికల వేళ రాజకీయంగా నష్టం జరుగుతుందని దడ
- రాష్ట్రంలో కోతలు లేవంటూనే విద్యుత్తుశాఖకు తాఖీదులు
- కరెంటు పోతే కొలువుకు ఎసరొస్తుందని సిబ్బంది ఆందోళన › 6



బడంగ్‌పేట్‌లో కేటీఆర్ రోడ్‌షో సందర్భంగా విధులు నిర్వర్తిస్తున్న విద్యుత్తు సిబ్బంది

సీఎం కేజ్రీవాల్‌పై ఎన్ఐఏ కేసు!

- కేంద్రానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సిఫారసు
- 'ఆప్‌కు ఖలిస్థానీ నిధుల' ఆరోపణలపై విచారణ జరిపించాలని హోం శాఖకు లేఖ
- కేజ్రీకి మధ్యంతర బెయిల్‌ను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకొన్న వేళ పరిణామం
- ఇది మోదీ ప్రభుత్వ మరో కుట్ర.. ఆప్ ధ్వజం




న్యూఢిల్లీ, మే 6: మద్యం పాలసీ కేసులో ఇప్పటికే జైలులో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను మరిన్ని కష్టాలు చుట్టుముట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిషేధిత ఉగ్రవాద సంస్థ 'సిక్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే)' నుంచి నిధులు అందుకొన్నారన్న ఆరోపణలపై ఆయనపై నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ)తో దర్యాప్తు జరిపించాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా కేంద్ర హోంశాఖకు సిఫారసు చేశారు. ఈ మేరకు గవర్నర్ ప్రధాన కార్యదర్శి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కార్యదర్శికి లేఖ రాసినట్టు రాజ్‌భవన్ వర్గాలు › 7వ పేజీలో

కాళేశ్వరాన్ని విస్మరిస్తే కరువు కాటేసే!

రాజకీయ క్రీడలో బలి పశువుగా తెలంగాణ రైతు
40 టీఎంసీలకు పైగా కడలి పాలు చేసిన సర్కారు
20 టీఎంసీలతోనే ఎస్సారెస్పీ కింద ధాన్య సిరులు
పది టీఎంసీలతో నిండుకుండల్లా వేల చెరువులు
మూణ్నెళ్ల ముందే హెచ్చరించిన 'నమస్తే తెలంగాణ'
కేసీఆర్‌ను బదనాం చేయాలని కాంగ్రెస్ కుయుక్తి
20 లక్షల ఎకరాలకుపైగా ఎండిపోయిన పంటలు

మేడిగడ్డకు నేడు జస్టిస్ చంద్రఘోష్

'కాళేశ్వరం'పై విచారణ ప్రారంభం › 10



బడికి డుమ్మా కుదరదిక

టీచర్లకు ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్
కొత్త విద్యాసంవత్సరం నుంచి అమలు!
యాప్‌లో టీచర్ల రిజిస్ట్రేషన్ ప్రారంభం

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): బడులకు గైర్హాజరవుతున్న టీచర్లను గాడినపెట్టేందుకు పాఠశాల విద్యాశాఖ సరికొత్త అస్త్రాన్ని సంధిస్తున్నది. టీచర్లకు ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఎస్)ను అమలు చేయనున్నది. కొత్త విద్యాసంవత్సరం నుంచి ఈ హాజరువిధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇందులోభాగంగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో టీచర్ రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఇచ్చారు. జూన్ 12న రాష్ట్రంలోని బడులు పునఃప్రారంభంకానున్నాయి. ఈ లోపు యాప్ ద్వారా రిజిస్ట్రేషన్‌ను ముగించి మొదటి › 8వ పేజీలో

51% ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇవ్వాలి

సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలి
పీఆర్సీ కమిటీకి టీఎన్జీవో నేతల వినతి › 8



జనమా.. గులాబీ వనమా? | *నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నెహ్రూచౌక్ ప్రాంతంలో సోమవారం నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్*

కేసీఆర్ గర్జన.. రైతుబంధు జమ

> నరేంద్రమోదీ బడే భాయ్.. రేవంత్ చోటాభాయ్. రాష్ట్రంలో గుజరాత్ మాడల్ తీసుకొస్తానని సీఎం చెప్తున్నాడు. గుజరాత్ మాడల్ అంటే ఏంది? అందులో ఏమున్నది? జీవితాలను తగలబెట్టే మాడల్ తీసుకొస్తవా?
> - కేసీఆర్

దెబ్బకు దయ్యం వదిలింది • కేసీఆర్ రోడ్డెక్కంగనే ముఖ్యమంత్రికి వణుకుడు మొదలైంది

అందుకే ఆగమేఘాల మీద రైతుబంధు డబ్బులు వేస్తున్నడు • రైతుబంధు లెక్క పథకాలన్నీ రావాలంటే బీఆర్ఎస్ గెలవాలె


బతికునోళ్లను కాల్చిచంపుడేనా గుజరాత్ మాడల్? • మోదీకి నేను లొంగలేదనే కవితను జైల్లో పెట్టిండ్రు.. భయపడ్తనా?

దేశంలో బీడీకార్మికులకు పింఛన్ ఇచ్చింది తెలంగాణలోనే • నిజామాబాద్ రోడ్‌షోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): తాను రోడ్డెక్కి పిడికిలి బిగిస్తే తప్ప రైతుబంధు స్టార్ట్ కాలేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ దెబ్బకు దెయ్యం వదిలిందని, ముఖ్యమంత్రికి వణుకు మొదలై ఇయ్యాల రైతుబంధు వేస్తున్నారని, పోరాడకుంటే ఏదీ జరగదని పేర్కొన్నారు. 'కేసీఆర్ బస్సు ఎక్కిండు. కాలువిరిగినా బస్సెక్కి గర్జన చేసిండు కాబట్టే రైతుబంధు పడుతున్నది' అని వివరించారు. ఇప్పుడు ఇచ్చినా ముందటికి దెబ్బ పెడతరని హెచ్చరించారు. ఐదెకరాల కంటే ఎక్కువ ఉన్నోళ్లకు రైతుబంధు వెయ్యబోమని అంటున్నారని, ఆరేడు ఎకరాల వాళ్లు ఏం తప్పు చేశారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం మెడలు వంచి ఇచ్చిన గ్యారెంటీలన్నీ అమలు చేయించాలంటే కచ్చితంగా బీఆర్ఎస్ గెలవాల్సిందేనని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్‌లో సోమవారం నిర్వహించిన రోడ్‌షోలో కేసీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాలుగు నెలలుగా తియ్యటి మాటలు చెప్తున్నది తప్పితే ఇచ్చిందేమీ లేదని నిప్పులు చెరిగారు. దేవుళ్లపై ఒట్లు.. కేసీఆర్‌పై తిట్లు అన్న చందంగా సీఎం తీరు ఉన్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని, నిజామాబాద్ జిల్లాలో పులిబిడ్డ బాజిరెడ్డి గోవర్ధన్ గెలిపించాలని కోరారు.

అచ్చేదిన్ కాదు.. సచ్చేదిన్

నిజామాబాద్‌లో గత ఎన్నికల్లో బీజేపీ ఎంపీని గెలిపించారని, ఏమన్నా లాభం జరిగిందా అంటూ కేసీఆర్ సభకు హాజరైన ప్రజలను ప్రశ్నించారు. ఏక్ అణా పని కూడా కాలేదని పేర్కొన్నారు. ప్రధానమంత్రిగా మోదీ, ముఖ్యమంత్రిగా తాను ఒకేసారి ఎన్నికయ్యామని, ప్రధాని అయ్యేముందు, ఆ తర్వాత మోదీ 150 దాకా నినాదాలు చెప్పారని, వాటిలో ఒక్కటైనా నిజమైందా? అని ప్రశ్నించారు. 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' లేదు కానీ 'దేశ్ కా సత్యనాశ్' అయిందని ఆవేదన వ్యక్తంచేశారు. 'మేకిన్ ఇండియా', 'డిజిటల్ ఇండియా', 'భేటీ పడావో.. భేటీ బచావో' ఎక్కడన్నా కనబడుతున్నవా? అని ప్రశ్నించారు. దేశంలో రోజూ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని, నరేంద్రమోదీ రాజ్యంలో భేటీకి రక్షణ ఉందా? అని ఆవేదన వ్యక్తం చేశారు. 'అచ్చే దిన్' తెస్తానన్న మోదీ సచ్చేదిన్ తెచ్చారని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరలు, జీఎస్టీలు పెరిగాయని పేర్కొన్నారు. మోదీ చేస్తానన్న రైతుల ఆదాయం రెట్టింపు అయిందా? వికసిత్ భారత్ అయిందా? జన్ ధన్ వల్ల ఏమన్నా లాభం జరిగిందా? అని ప్రశ్నించారు.



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్‌షోలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ఎంపీ సురేశ్‌రెడ్డి, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గణేశ్ గుప్తా, జీవన్‌రెడ్డి తదితరులు

నిజామాబాద్‌లో మోదీ రూ. 30 లక్షలు ఇచ్చిండట కదా!

తాను ప్రధానిని అయితే ప్రతి ఇంటికీ రూ.15 లక్షలు ఇస్తానని మోదీ చెప్పారని, నిజామాబాద్‌లో బీజేపీ ఎంపీ ఉన్నాడు కాబట్టి ఇక్కడి వాళ్లకు రూ. 30 లక్షలు వచ్చాయట కదా.. అని కేసీఆర్ ఎద్దేవా చేశారు. '15 లక్షలు లేదు.. పాసు లేదు.. అంతా ఉట్టిదే గ్యాస్' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.'నరేంద్రమోదీ నిటారుగా మనకున్న గోదావరిని ఎత్తుకపోయి తమిళనాడుకు ఇస్తానంటున్నాడు. అట్లనే చూద్దామా? కొట్లాడుదామా? యుద్ధం చేద్దామా?' అని ప్రశ్నించారు. మన గోదావరి మనకు ఉండాలంటే, మన నది మీద మనకు నీళ్ల హక్కు ఉండాలంటే నిజామాబాద్‌లో నిజామాబాద్ పులిబిడ్డ బాజిరెడ్డి గోవర్ధన్ గెలవాలని, ఈ గ్యాస్‌గాళ్లు గెలిస్తే తాకులాటలు పెట్టుడు తప్ప ఏమీ రాదని పేర్కొన్నారు.

> ## బీడీ కార్మికులు అండగా నిలవాలి
>
> ప్రాణాలకు తెగించి తీసుకొచ్చిన రాష్ట్రాన్ని పొదరిల్లులా తీర్చుదిద్దుకున్నామని, అన్ని వర్గాలను ఆదుకున్నామని కేసీఆర్ పేర్కొన్నారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో కానీ, తెలుగుదేశం పాలనలో కానీ బీడీ కార్మికులకు అణా కూడా ఇవ్వలేదని, దేశంలో ఎక్కడా లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షలమంది బీడీ కార్మికులతోపాటు టేకేదార్లకు రూ. 2 వేల పింఛన్ ఇచ్చి కాపాడిందని గుర్తుచేశారు. వారికి పింఛన్ ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని, బీజేపీ పాలిత ప్రాంతాల్లోనూ ఎక్కడా లేదని తెలిపారు. బీడీ కార్మికులందరూ నిజాయతీ చూపి బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని కోరారు.

వీళ్ల నోరు తెరుస్తరా?

నిజామాబాద్ గడ్డపై తాను గులాబీజెండా ఎత్తిన నాడు తనవెంట నిలబడి, నిజామాబాద్ జిల్లా పరిషత్‌ను గెలిపించినది ఈ జిల్లాయేనని, కేసీఆర్ సచ్చిపోయే వరకు గుండెల్లో ఉంటుందని కేసీఆర్ వివరించారు. ఉద్యమాన్ని ఆకాశానికి ఎత్తిన జిల్లా అని తెలిపారు. 'మోదీ.. గోదావరి నదిని తీసుకుపోతా అంటున్నడు. బీజేపీ ఎంపీలు గెలిస్తే మోదీ దగ్గర చేతులు కట్టుకొని నిలబడతరు తప్ప నోరు తెరుస్తరా? మన హక్కుల గురించి ఎన్నడైనా నోరు తెరిచారా?' అని ప్రశ్నించారు. ప్రతి జిల్లాకు ఒక నవోదయ పాఠశాల ఇవ్వాలని మోదీకి 150 ఉత్తరాలు రాశానని, ఒక్కటి కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వని మోదీకి, బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలని నిలదీశారు. యువత ఈ విషయాన్ని ఆలోచించాలని కోరారు. దేశంలో మోదీ 157 మెడికల్ కాలేజీలు పెడితే తెలంగాణ ఒక్కటి కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఇవ్వని మోదీకి ఓటెందుకు వెయ్యాలని ప్రశ్నించారు.

బంగారు జిల్లాను ఎండబెట్టారు

ఒకప్పుడు బంగారు జిల్లా అయిన నిజామాబాద్‌ను కాంగ్రెస్, టీడీపీ హయాంలో పూర్తిగా ఎండబెట్టారని కేసీఆర్ విమర్శించారు. నిజాంసాగర్‌ను మునగ్గొట్టారని.. గుత్ప, అలీసాగర్ అని చెప్పి అదికూడా సరిగా చేయలేదని తెలిపారు. తెలంగాణ వచ్చిన తరువాత నిజాంసాగర్‌ను మల్లన్నసాగర్‌కు లింక్ చేసుకున్నామని, కాళేశ్వరం నీళ్లు వచ్చేటట్టు చేసుకున్నామని వివరించారు. శ్రీరాంసాగర్‌ను పునరుజ్జీవం చేసుకున్నామని, వరద కాల్వను రిజర్వాయర్‌గా మార్చుకున్నామని పేర్కొన్నారు.

ఆ నీళ్లు ఇప్పుడు ఎక్కడికి పోయినయ్?

ఈ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వాళ్లు కరెంటును బ్రహ్మాండంగా ఇస్తున్నామని మాట్లాడుతున్నారని, కరెంటు కోతలు ఉన్నాయా? గతంలో ఉండేవా? అని రోడ్‌షోకు హాజరైన వారిని ప్రశ్నించారు. పట్టణంలో పేదలకు ఒక్క రూపాయికే నల్లా కనెక్షన్ ఇచ్చామని, గ్రామాల్లో అది కూడా తీసుకోకుండా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చామని పేర్కొన్న కేసీఆర్.. ఇప్పుడా నీళ్లన్నీ ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు.

ప్రభుత్వ అసమర్థత వల్లే

కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలలుగా అరచేతిలో వైకుంఠం చూపిస్తూ ఆరు గ్యారెంటీలని మోసం చేసిందని కేసీఆర్ మండిపడ్డారు. ఒక్క గ్యారెంటీ కూడా అమలు కాలేదని మండిపడ్డారు. కల్యాణలక్ష్మి కింద ఇస్తామన్న తులం బంగారం తుస్సు, వడ్లకు ఇస్తామన్న రూ. 500 బోనస్ బోగస్ అని పేర్కొన్నారు. ధాన్యానికి పాతధర కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థులకు ఐదు నెలలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని, ఓవర్సీస్ స్కీంను ఆపేశారని, కేసీఆర్ కిట్ ఇవ్వడం లేదని, సీఎంఆర్ఎఫ్‌ను బంద్ పెట్టారని తెలిపారు. చేనేత కార్మికులకు ఆర్డర్లు ఇవ్వకపోవడంతో మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యాయని చెప్పారు. పరిశ్రమలు తరలిపోయే పరిస్థితి వచ్చిందని, ఐదు నెలల్లో ఇంతలా మారిపోవడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కాదా? అని నిలదీశారు.

బీఆర్ఎస్ తెలంగాణ శక్తి

'తెలంగాణ శక్తి బీఆర్ఎస్, తెలంగాణ బలం బీఆర్ఎస్, తెలంగాణ గళం బీఆర్ఎస్, తెలంగాణ దళం బీఆర్ఎస్' అని కేసీఆర్ వివరించారు. బీఆర్ఎస్‌కు శక్తి ఉంటేనే తెలంగాణకు శక్తి ఉంటుందని చెప్పారు. మహిళలకు రూ. 2500 వచ్చాయా? అని ప్రశ్నించిన బీఆర్ఎస్ అధినేత.. పథకాలు అమలు కావాలంటే పిడికిలి బిగించాలని, పోరాటం చేసి ప్రభుత్వం మెడలు వంచాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు భయపడి రైతుబంధు ఎట్ల వేస్తున్నరో, అలాగే అన్నీ రావాలంటే బీఆర్ఎస్ గెలవాల్సిందేనని స్పష్టం చేశారు. డిసెంబర్ 9న 10.30 గంటలకు రుణమాఫీ అన్న రేవంత్‌రెడ్డి మాటలు 'రేపు మా ఇంట లడ్డూల భోజనం' అన్న బోర్డులాగానే ఉన్నదని కేసీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నడు చూసినా ఆ బోర్డుపై రేపు అనే ఉంటదని తెలిపారు. బాసరకు పోయి సరస్వతి అమ్మవారి మీద, యాదగిరిగుట్టకు పోయి అక్కడ.. ఇలా ఎక్కడిపోతే అక్కడ దేవుళ్ల మీద ఒట్లు పెడుతున్నాడని, దేవుళ్ల మీద ఒట్లు.. కేసీఆర్ మీద తిట్లు అన్నట్టుగా ఈ సీఎం తీరు ఉన్నదని ఎద్దేవా చేశారు. ఈ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ మెడలు వంచి రుణమాఫీ చేసే వరకు కొట్లాడాలంటే నిజామాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట

బీజేపీ చాలా ఖతర్నాక్ పార్టీ అని, గతంలో బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే ఎన్ని మోసాలు చేశాడో అందరికీ తెలుసని కేసీఆర్ విమర్శించారు. బీజేపీని ఓడించేందుకు ఇప్పుడు సమయం వచ్చిందని పేర్కొన్నారు. గతంలో బీజేపీతో కలిసి బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ ఓడించిందని ఆరోపించారు. ముస్లింల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.12వేల కోట్లు ఖర్చుచేసిందని గుర్తుచేశారు. ముస్లిం విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేశామని, ఎంతోమంది అందులో చదివి డాక్టర్లు, ఇంజినీర్లు అవుతున్నారని, అవన్నీ కండ్లముందే ఉన్నాయని, అందరికీ తెలుసని వివరించారు. విద్యతోనే ముస్లింల జీవితాలు మారుతాయనే గురుకులాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎలాంటి ఇబ్బందులు వస్తున్నాయో గమనించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిందుకు బాధేమీ లేదని, తెలంగాణ కోసం, అన్ని వర్గాల ప్రజల కోసం కొట్లాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్సేనని, మరో పార్టీ కొట్లాడబోదని పేర్కొన్నారు.

గుజరాత్ మాడల్‌లో ఏమున్నది?

నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ 20శాతం వెనకబడి ఉన్నదని, బీఆర్ఎస్ 6 శాతం ఓట్ల ఆధిక్యంతో ముందుకు పోతున్నదని కేసీఆర్ తెలిపారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేసినా ప్రయోజనం ఉండబోదని, ఓట్లు చీలిపోతే మరోసారి అనవసరంగా బీజేపీ గెలిచే ప్రమాదముందని హెచ్చరించారు. 'నరేంద్రమోదీ బడే భాయ్. నేను చోటా భాయ్. గుజరాత్ మోడల్ తీసుకొస్తా' అని సీఎం అంటున్నాడని కేసీఆర్ విమర్శించారు. 'ఏ మాడల్ తీసుకొస్తావ్. జీవితాలను తగలబెట్టే మాడల్‌ను తీసుకొస్తావా' అంటూ నిప్పులు చెరిగారు. గుజరాత్ మాడల్‌లో ఏమీలేదని, చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని సూచించారు. 'బీజేపీ, కాంగ్రెస్ చెప్పేదంతా వట్టిదే. మన నీళ్లు కాపాడుకోవాలె. బతుకులు నిలబెట్టుకోవాలె. తెచ్చుకున్న రాష్ట్రాన్ని మరింత తెలివికి తెచ్చుకోవాలె. మళ్లా ఈ కరెంటు కోతలు బంద్‌కావాలె. చదువుకునే పిల్లలకు న్యాయం జరగాలంటే కచ్చితంగా బీఆర్ఎస్ గెలవాలి' అని కేసీఆర్ స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంలో చెప్పినట్టుగానే యువత ఆవేశంలో ఓటు వేయకుండా, ప్రజాస్వామ్య పరిణితితో, విజ్ఞతతో ఆలోచించి ఎవరు గెలిస్తే మంచిది? ఎవరి చేతిల్లో ఉంటే రాష్ట్ర భవిష్యత్‌కు మంచిది అనే విషయాలను కూలంకషంగా చర్చించి, బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

> ### తెలంగాణ ఆత్మబంధువు కేసీఆర్
>
> 'నేను కూడా హిందువునే. కానీ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి యావత్ ప్రజల ఆత్మబంధువు కేసీఆర్. ఏ ఒక్క వర్గానికో కాదు. తెలంగాణలో ఉన్న ప్రజలందరూ బాగుపడాలె. అన్నివర్గాలు మంచిగుండాలె. హిందూ, ముస్లిం భాయ్.. భాయ్ అని ఉండాలె. కలిసి బతకాలె. దాని లోనే గొప్పతనం ఉంటది. బలముంటది కానీ ప్రజలను విడదీసి, మతవిద్వేషాలు రెచ్చగొడితే వచ్చేదేమీ ఉండదు. మీ ఎంపీ నోరెతెరిస్తే ఎటువంటి మాటలు ఉంటయో తెలుసు. ఎంతటి గందరగోళముంటదో తెలుసు' అని పేర్కొన్నారు.
>
> ### ప్రాంతీయ శక్తులదే అధికారం
>
> 'నరేంద్రమోదీకి 400 సీట్లు వస్తాయని అంటున్నరు కానీ అంతా వట్టిదే. 200 సీట్లు వస్తేనే ఎక్కువని వార్తలు వస్తున్నాయి. బీజేపీ గవర్నమెంట్, కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చేదే లేదు. ప్రాంతీయ శక్తులు ఏర్పాటు చేసే గవర్నమెంటే రాబోతున్నది. కాబట్టి మనం 14 ఎంపీలను గెలుచుకుంటే తెలంగాణ కేంద్ర రాజకీయాల్లో కీలకంగా మారుతుంది. రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థులందరినీ ఓడించింది బీఆర్ఎస్ పార్టీనే. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కవుతాయి. రాత్రికి రాత్రి ఒక్కటవుతాయి. ఆ మోసం కూడా చేశాయి. ప్రభుత్వం దిగివచ్చి ఇవాళ రైతులకు రైతుబంధును ఎట్లయితే వేస్తున్నదో? అదేవిధంగా అన్ని హామీలు అమలు కావాలంటే? కరెంటు సక్కగ రావాలంటే? విద్యార్థులకు న్యాయం జరగాలంటే, కృష్ణా గోదావరి నీళ్లు మనయ్ మనకు దక్కాలంటే బీఆర్ఎస్ గెలవాలి. బీఆర్ఎస్ అయితే పేగులు తెగేవరకూ కొట్లాడుతది. ఏమరుపాటున ఉండకుండా బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలి' అని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు.

> **దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో బీడీ కార్మికులు, టేకేదార్లకు రూ. 2 వేల పింఛన్ ఇచ్చినం. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో కానీ, తెలుగుదేశం పాలనలో కానీ ఎవరూ ఇయ్యలే. బీజేపీ పాలిత ప్రాంతాల్లోనూ లేదు. బీడీ కార్మికులకు పింఛన్ ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ.**
> **-కేసీఆర్**



కేసీఆర్ బస్సులో తనిఖీలు

జగిత్యాల రూరల్, మే 6: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సును సోమవారం పోలీసులు తనిఖీ చేశారు. జగిత్యాల నుంచి నిజామాబాద్ రోడ్‌షోకు వెళ్తుండగా ఆయన బస్సును తనిఖీ చేశారు. జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి గ్రామం వద్ద బస్సును ఆపిన ఎఫ్ఎస్టీ జగిత్యాల ఇన్‌చార్జి విజయేందర్‌రావు పరిశీలించారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ రాజమౌళి, కానిస్టేబుల్ సుమన్ పాల్గొన్నారు.



నిజామాబాద్ నెహ్రూచౌక్‌లో రోడ్‌షోకు హాజరైన ప్రజానీకానికి విజయసంకేతం చూపుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



గులాబీ పరిమళం..
కేసీఆర్ ప్రభంజనం..
రాష్ట్రమంతా తిరుగుతున్న బీఆర్ఎస్ దళపతికి నీరాజనం

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): 'ఎర్రటి ఎండల్లో గులాబీ పరిమళం.. తెలంగాణ అంతటా కేసీఆర్ ప్రభంజనం' అన్నట్టుగా సాగుతున్నది రాష్ట్రంలో కేసీఆర్ బస్సుయాత్ర. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గతనెల 24 చేపట్టిన బస్సుయాత్ర ప్రభావం రాష్ట్రమంతా కనిపిస్తున్నది. ఈ బస్సుయాత్ర ఇంకా నాలుగు రోజులే కొనసాగనున్నది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, ఇక తమకు ఎదురేలేదని కాంగ్రెస్ భ్రమపడింది. దేశమంతా తమ ఛత్రం తీసుకున్నాం.. ఇన్నాళ్లు బీఆర్ఎస్ గొడుగు కింద ఉన్న తెలంగాణను అతి సులువుగా తమ ఆధీనంలోకి తీసుకోవచ్చని బీజేపీ తలచింది. కానీ, రాష్ట్రంలో కేసీఆర్ రోడ్‌షోలకు హాజరవుతున్న ప్రభం'జనం'తో ఆ రెండు పార్టీలు బెంబేలెత్తిపోతున్నాయి. తెలంగాణ ప్రజల నుంచి కేసీఆర్‌ను వేరు చేయలేమని రెండు పార్టీలు అర్థం చేసుకున్నాయి. అందుకు కేసీఆర్ రోడ్‌షోలకు పోటెత్తుతున్న జనసునామీయే నిదర్శనమని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ జాతీయ నేతలు, ఆ పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర నాయకులు చెప్పే మాటలకన్నా కేసీఆర్ చెప్పే విషయాలకే జనామోదం ఎక్కువగా ఉంటుందని ఇప్పుడే కాదు గతంలో అనేక పరిణామాలు స్పష్టం చేశాయని, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు మరోసారి అటువంటి వాతావరణాన్ని సృష్టించబోతున్నాయని తెలంగాణ మేధావులు తేల్చిచెప్తున్నారు.

కేసీఆర్ బస్సుయాత్రకు ముందూ తరువాత

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రకు ముందు రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ, సామాజిక వాతావరణానికి, ప్రస్తుత పరిస్థితికి మధ్య అసలు పోలికేలేదని సాక్షాత్తు కాంగ్రెస్ పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. 'బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ను మా వాళ్లు తక్కువగా అంచనావేశారు. వారికి ఉన్న రాజకీయ అనుభవం, పరిణతి కేసీఆర్‌ను మదింపు చేయలేవు' అని కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. గతనెల 24న మిర్యాలగూడ రోడ్‌షోలో కేసీఆర్ చేసిన ప్రసంగం నుంచి మొదలుకుంటే సోమవారంలో నిజామాబాద్ కేసీఆర్ రోడ్‌షో దాకా ఉత్తర, దక్షిణ తెలంగాణను కేసీఆర్ చుట్టివచ్చారు. ఈ 13 రోజుల్లో మధ్యలో 48 గంటలు మినహా (స్థూలంగా జమ్మికుంట రోడ్‌షో మినహా) కేసీఆర్ చేసిన ప్రసంగాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఏకీభవిస్తున్నారని క్షేత్రస్థాయిలో నెలకొన్న వాతావరణం చెప్తున్నది. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ పార్టీల అగ్రనేతలు కేసీఆర్ ప్రభావాన్ని తగ్గించాలని కాంగ్రెస్ అగ్రనేత నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున్ ఖర్గే.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, జేపీ నడ్డాసహా అనేక మందిని తెలంగాణకు రప్పించి ప్రయోజనం పొందాలని చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించేలా కనిపించటంలేదని క్షేత్రస్థాయి వాతావరణం చెప్తున్నది. బస్సుయాత్ర పొడవునా కేసీఆర్‌కు యువత నీరాజనం పలుకున్నది. చిన్నచిన్న గ్రామాల మొదలు మండల కేంద్రాల్లో, పట్టణ కేంద్రాల్లో కేసీఆర్‌ను జనం కండ్లకు అద్దుకుంటున్నారు. ఆడబిడ్డలు బస్సు ముందు మంగళహారతులు పడుతున్నారు. గ్రామపెద్దలు గుమ్మడికాయలతో కేసీఆర్‌కు దిష్టితీసే దృశ్యాలు ఊరూరా దర్శనమిస్తున్నాయి. కేసీఆర్ రోడ్‌షో నిర్దేశిత ప్రాంతానికి చేరుకునే రెండు గంటల ముందు నుంచే యువత హంగామా చేస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలకు అంతగా ఆసక్తిచూపని యువతలో మార్పు వచ్చిందని పార్లమెంట్ ఎన్నికల్లో ఆ మేరకు ప్రభావం చూపుతుందని పేరు చెప్పటానికి నిరాకరించిన ఒక సామాజికవేత్త విశ్లేషించారు.



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నెహ్రూచౌక్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షోకు హాజరైన జనసందోహం

ఇందూరు.. జనసంద్రం

తండోపతండాలుగా తరలివచ్చిన జనం

నిజామాబాద్‌లో కేసీఆర్‌కు ఘనస్వాగతం • నెహ్రూచౌక్‌లో జననేత రోడ్‌షో సక్సెస్

అడుగడుగునా హోరెత్తిన నినాదాలు

నిజామాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేసీఆర్ రాకతో ఉద్యమాల గడ్డ ఇందూరు పరవశించింది. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు నిజామాబాద్ జిల్లా బ్రహ్మరథం పట్టింది. అడుగడుగునా పూలవర్షంతో ఘనస్వాగతం పలికింది. హోరెత్తిన జన నినాదాలతో, గులాబీ గుబాళింపు మధ్య కేసీఆర్ బస్సుయాత్ర ఆద్యంతం సందడిగా సాగింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్‌షో విజయవంతమైంది. గులాబీ జెండాలు చేతబూనిన జనంతో దారులన్నీ కిక్కిరిసిపోవడంతో గులాబీ వనమా, జన సంద్రమా.. అన్న ఆశ్చర్యం కలిగింది. గులాబీ దళపతిని చూసేందుకు, కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు వచ్చిన వారితో రోడ్లన్నీ నిండిపోయాయి. నిజామాబాద్ నెహ్రూ చౌక్ వద్ద అశేష జనవాహినిని ఉద్దేశించి కేసీఆర్ చేసిన ప్రసంగం ఆద్యంతం కట్టి పడేసింది. తనదైన శైలిలో కేసీఆర్ సంధించిన వాగ్బాణాలకు చప్పట్ల వర్షం కురిసింది. కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న ద్వంద్వ రాజకీయాలను కేసీఆర్ తన ప్రసంగంలో ఎండగట్టారు. కాంగ్రెస్ హామీల అమలులో జాప్యాన్ని, మోసాన్ని కండ్లకు కట్టినట్టుగా ప్రజలకు వివరించారు. ఐదు నెలల రేవంత్ రెడ్డి పాలనలో దగా పడుతున్న రైతులు, ఇతర వర్గాల ప్రజల సాధక బాధకాలను గులాబీ అధినేత విడమరిచి చెప్పారు. దాదాపుగా అరగంటపాటు సాగిన కేసీఆర్ ప్రసంగాన్ని ప్రజలంతా ఆసక్తిగా విన్నారు. సందర్భోచితంగా కేసీఆర్‌కు జై కొడుతూ ఉత్సాహాన్ని ప్రదర్శించారు. నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్న కేసీఆర్ పిలుపునకు జనం చేతులెత్తి మద్దతు ప్రకటించారు.

కాంగ్రెస్, బీజేపీ మోసాలను ఎండగట్టిన కేసీఆర్

రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ మోసాలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ప్రసంగంలో ఎండగట్టారు.

బీజేపీ చెప్పినట్టు తాను వినలేదని తన బిడ్డ కవితను అరెస్ట్ చేసి జైల్లో వేశారని, తాను ఎన్నటికీ, ఎవ్వరికీ లొంగనని, పోరాటాన్ని ఉధృతం చేస్తానన్న కేసీఆర్ మాటకు జనమంతా చప్పట్లతో జేజేలు పలికారు. నేను హిందువును.. తెలంగాణ ప్రజలకు ఆత్మబంధువును.. అనగానే జై కేసీఆర్ అన్న నినాదాలు మిన్నంటాయి. కాంగ్రెస్ ఐదు నెలల పాలన వైఫల్యాలను ఎండగడుతూ, కేంద్రంలోని బీజేపీతో ఎదురైనా, ఎదురుకాబోతున్న నష్టాలను వివరించారు. కేసీఆర్ మాట్లాడుతున్నంత సేపు జనం ఉత్సాహం చూపారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను కేసీఆర్ తనదైన శైలిలో ప్రశ్నించినప్పుడు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఒక్కో అంశాన్ని ప్రస్తావిస్తూ కేసీఆర్ అడిగిన ప్రశ్నలకు జనమంతా ముక్తకంఠంతో రాలేదు.. అంటూ చేతులెత్తి తెలిపారు.

రూ.2 లక్షల రుణమాఫీ అయ్యిందా, నెలకు రూ.2500 చొప్పున ప్రతి మహిళకు ఆర్థిక సాయం అందినదా?, రైతుబంధు అందరికీ వచ్చిందా, పంటకు రూ.500 బోనస్ వస్తున్నదా? కల్యాణలక్ష్మి తులం బంగారం వస్తుందా? అని కేసీఆర్ ప్రశ్నలకు రాలేదు రాలేదు.. అంటూ జనం ఏకకంఠంతో బదులిచ్చారు. ప్రధాని మోదీ ఇస్తానన్న రూ.15 లక్షలు మీ అకౌంట్లో జమ అయినయా? బేటీ పడావో.. బేటీ బచావో ఏమైనా జరిగిందా? సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ వచ్చిందా? అంటూ బీజేపీ పరిపాలన తీరును కేసీఆర్ వాగ్బాణాలు సంధించారు.



డాక్టర్ రమణయ్యకు పాదాభివందనం చేస్తున్న కేసీఆర్

గురువును కలిసిన కేసీఆర్

- డాక్టర్ రమణయ్య ఇంటికి కేసీఆర్
- పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్న బీఆర్ఎస్ అధినేత
- రమణయ్య సార్ భావోద్వేగం
- యూఆర్ ఫాదర్ ఆఫ్ తెలంగాణ అంటూ గులాబీ బాస్‌కు ప్రశంసలు

జగిత్యాల, మే 6, (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సోమవారం తన గురువు జైశెట్టి రమణయ్య సార్‌ను కలిశారు. జగిత్యాలలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కేసీఆర్ స్వయంగా తన ఇంటికి రావడంతో రమణయ్య భావోద్వేగానికి గురయ్యారు. ఆదివారం జగిత్యాలలో రోడ్‌షో నిర్వహించిన కేసీఆర్ ఈ సందర్భంగా తన గురువు, కవి అయిన రమణయ్య సార్‌ను గుర్తుచేసుకున్నారు. రోడ్‌షో అనంతరం రాత్రి జగిత్యాలలోని ఎమ్మెల్సీ ఎల్ రమణ నివాసంలో బసచేసిన కేసీఆర్ సోమవారం సాయంత్రం నిజామాబాద్‌లో రోడ్‌షోకు వెళ్లడానికి ముందు రమణయ్య ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుతం అనారోగ్యంతో మంచం నుంచి కదలలేని స్థితిలో ఉన్న రమణయ్యకు పాదాభివందనం చేశారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సిద్దిపేట కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా ఉన్నప్పటి రోజులను గుర్తుచేసుకున్నారు.

చరిత్ర బోధనలో అఖండుడు మా గురువు

గురుశిష్యులు ఇరువురు కలుసుకున్న సమయంలో కేసీఆర్ తమ గురువైన రమణయ్య సార్ చరిత్ర బోధనలో ఎంతటి అఖండుడో గుర్తుచేసుకున్నారు. 1970 నుంచి 1974 వరకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో డాక్టర్ రమణయ్య చరిత్ర ఉపన్యాసకుడిగా పీయూసీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ తరగతులకు బోధించిన అంశాలను జ్ఞాపకం చేసుకున్నారు. సంక్లిష్టమైన పాఠ్యాంశాన్ని అయినా రమణయ్య సార్ అనర్గళంగా, సులభంగా బోధించేవారని చెప్పారు. చరిత్ర బోధనతో పాటు చరిత్ర పరిశోధన, సౌత్ ఇండియన్ టెంపుల్స్‌పై ఆయన రాసిన పుస్తకాలు, కరీంనగర్ సమగ్ర చరిత్ర పుస్తక రచనను కేసీఆర్ ప్రస్తావించారు.

ఫాదర్ ఆఫ్ తెలంగాణ.. క్రియేటర్ ఆఫ్ తెలంగాణ

డాక్టర్ రమణయ్య సార్ కూడా కేసీఆర్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకొన్నారు. 1972లో సిద్దిపేటకు వచ్చిన కేంద్ర మంత్రికి డిగ్రీ కాలేజీలో విద్యార్థిగా ఉన్న కేసీఆర్ నేతృత్వంలో సిద్దిపేటను జిల్లా చేయాలని కోరుతూ వినతిపత్రం అందించిన విషయాన్ని గుర్తుచేసి, కేసీఆర్‌ను అభినందించారు. 2015లో తెలంగాణ తొలి ఆవిర్భావ వేడుకల సమయంలో తాను ఉత్తమ పరిశోధకుడిగా రాష్ట్రస్థాయి పురస్కారం పొందిన సమయంలో చెప్పానని, ఇప్పుడు మళ్లీ చెబుతున్నానని.. 'కేసీఆర్ యూ ఆర్ ఏ ఫాదర్ ఆఫ్ తెలంగాణ, క్రియేటర్ ఆఫ్ తెలంగాణ, మేకర్ ఆఫ్ బంగారు తెలంగాణ' అని కొనియాడారు. కేసీఆర్ వినమ్రపూర్వక నమస్కారం చేశారు. ఎందరో తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి విఫలమయ్యారని, తెలంగాణ ఉద్యమాన్ని తిరిగి ప్రారంభించి, విజయం సాధించి, రాష్ట్రాన్ని సాకారం చేయడం కేసీఆర్‌కే చెల్లిందని, అలాంటి కేసీఆర్ తనకు శిష్యుడు కావడం ఆనందంగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను రమణయ్య సార్ శాలువతో సత్కరించడంతో పాటు తాను సంకలనం చేసిన పుస్తకాలను అందజేశారు. రమణయ్య సార్ ఆరోగ్య పరిస్థితులను, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ రమణయ్యను పరామర్శించిన సమయంలో కేసీఆర్ వెంట జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జగిత్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తదితరులున్నారు.

• అధినేతకు కొబ్బరి మాల..



నిజామాబాద్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మహారాష్ట్ర సంప్రదాయం ప్రకారం ఎండుకొబ్బరి కుడకలతో కూడిన దండతో బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు ఆధ్వర్యంలో సత్కరిస్తున్న ఆ రాష్ట్ర సీనియర్ నేతలు శంకరన్న దోండ్గే, సుధీర్ బిందు, గణేశ్ కదమ్ తదితరులు. చిత్రంలో ఎంపీ సురేశ్‌రెడ్డి కూడా ఉన్నారు.

• కేసీఆర్‌కు బిగాల గణేశ్ గుప్తా ఆతిథ్యం..



నిజామాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా నివాసంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన నిజామాబాద్ మేయర్ నీతూకిరణ్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, బీఆర్ఎస్ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కూడా ఉన్నారు.

• రాకేశ్‌రెడ్డికి బీఫాం అందజేస్తూ..



నిజామాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా నివాసంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి బీఫాం అందజేస్తున్న అధినేత కేసీఆర్. చిత్రంలో వేముల ప్రశాంత్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, గణేశ్ గుప్తా, జీవన్‌రెడ్డి, రాజారాం యాదవ్ తదితరులు

కేంద్రంలో ప్రాంతీయ శక్తులకే అధికారం

ఎన్డీయే, ఇండియా కూటములకు పరాభవం తప్పదు

- కాంగ్రెస్, బీజేపీ పాలనలో దేశం ఎంతో నష్టపోయింది
- రాష్ట్రంలో ఘోరంగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రజలకు కాంగ్రెస్ నిజ స్వరూపం తెలిసిపోయింది
- ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డజనుకుపైగా సీట్లు ఖాయం
- బీజేపీకి 200 దాటుతాయని చెప్పడం గోబెల్స్ ప్రచారం
- పీటీఐతో బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల తర్వాత కేంద్రంలో ప్రాంతీయ పార్టీల కూటమే అధికారంలోకి వస్తుందని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు స్పష్టం చేశారు. ఎన్డీయే, ఇండియా కూటములకు పరాభవం తప్పదని అన్నారు. జాతీయ వార్తా సంస్థ పీటీఐ సోమవారం కేసీఆర్‌ను ఇంటర్వ్యూ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని చెప్పారు. అబద్ధపు హామీలను నమ్మి మోసపోయామని ప్రజలకు అర్థమైందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ డజనుకుపైగా స్థానాలను కైవసం చేసుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సముద్రమంత పార్టీ అని, నలుగురైదురు నేతలు వెళ్లిపోయినంత మాత్రాన నష్టం లేదని అన్నారు. వీటితోపాటు ఇంటర్వ్యూలో పంచుకున్న పలు అంశాలు యథాతథంగా..

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఎలా ఉన్నది? ఈ ఎన్నికలపై వంద రోజుల పాలన ప్రభావం కనిపిస్తుందా?

రాష్ట్రాన్ని పాలించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఇది నా మాట కాదు. స్వయంగా ప్రజలు చెప్తున్న మాట. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైంది. ఇది ప్రారంభం మాత్రమే. ఇంకా అధ్వానమైన పాలన చూడబోతున్నాం.

ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తక్కువ స్థానాలు వస్తాయని కాంగ్రెస్, బీజేపీ ప్రచారం చేస్తున్నది కదా?

ఇది వారి భ్రమ మాత్రమే. వాళ్లు అంధకారంలో మునిగిపోయి ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లతో పోల్చితే తెలంగాణ ప్రజలు ఎక్కువగా అభిమానించే పార్టీ బీఆర్ఎస్. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క సీటు కూడా రాకపోవచ్చు. పొరపాటున ఒక్కసీటు వస్తే రావొచ్చు. బీఆర్ఎస్ కచ్చితంగా డజనుకుపైగా స్థానాల్లో గెలుస్తుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన బీఆర్ఎస్.. మళ్లీ ఒక్కసారిగా పుంజుకొని, డజనుకుపైగా సీట్లలో గెలుస్తుందని ఎలా అనుకుంటున్నారు?

ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ గెలవాలో, ఏ పార్టీ ఓడిపోవాలో ప్రజలు నిర్ణయిస్తారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చింది. ఇందులో ఆరింటిని గ్యారంటీలుగా చెప్పింది. వాటిని అమలు చేయడానికి ప్రత్యేకంగా చట్టం చేస్తామని హామీ ఇచ్చింది. ప్రజలు అసత్యపు హామీలను నమ్మారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది. రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడ చూసినా పంటలు ఎండిపోతున్నాయి, తాగునీరు అందడం లేదు, భారీగా విద్యుత్తు లోటు కనిపిస్తున్నది. విద్యుత్తు సరఫరా సరిగా లేక రైతుల మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. గత తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్నడూ చూడని పరిస్థితులు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ప్రజలకు ఈ విషయం అర్థమైంది. అబద్ధపు హామీలకు మోసపోయామని తెలుసుకున్నారు.. కాబట్టి ఈ ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారు.



పలువురు నేతలు బీఆర్ఎస్‌ను వీడుతున్నారు కదా? ఏమైనా ప్రభావం ఉంటుందా?

ప్రస్తుత రాజకీయాల్లో 'పొద్దుతిరుగుడు పువ్వు' నేతలు ఎక్కువయ్యారు. సూర్యుడి చుట్టూ పొద్దు తిరుగుడు పువ్వు తిరిగినట్టు.. కొందరు నేతలు అధికారం చుట్టూ తిరుగుతున్నారు. బీఆర్ఎస్ నుంచి వేళ్లమీద లెక్కపెట్టగలిగేంత మంది మాత్రమే వెళ్లిపోయారు. బీఆర్ఎస్ పార్టీ సముద్రం లాంటిది. మాకు 60 లక్షల మంది సభ్యత్వం ఉన్నది. భారీ సంఖ్యలో కార్యకర్తలు ఉన్నారు. వీటితో పోల్చితే మా పార్టీ నుంచి వెళ్లిపోయింది అతి తక్కువ మంది. ఈ ఎన్నికల్లో వాళ్ల ప్రభావం ఏమీ ఉండదు. పార్టీ చాలా బలంగా ఉంది. ఆందోళన అవసరం లేదు.

మీరు గతంలో థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలని ప్రయత్నించారు. ఈ ఎన్నికల్లో ఎలాంటి ఫలితాలు రావాలని కోరుకుంటున్నారు?

నేను బీజేపీ, కాంగ్రెస్ కాకుండా ఒక ప్రత్యామ్నాయ వేదికను ఏర్పాటు చేయాలని భావించాను. ఎందుకంటే కాంగ్రెస్, బీజేపీ పాలనతో దేశం ఎంతో నష్టపోయింది. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలన ఒక వైఫల్యం అయితే.. మోదీ పాలన ఏకంగా ఒక విపత్తులా పరిణమించింది. బీజేపీ పాలనలో ఏ ఒక్క వర్గానికి కూడా ప్రయోజనం కలుగలేదు. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు రూపాయి విలువ పడిపోతుందంటూ మోదీ కేంద్రంపై విరుచుకుపడ్డారు. మరి ఇప్పుడు డాలర్‌కు రూ.84 స్థాయికి ఎందుకు పతనం అయ్యిందో సమాధానం ఇవ్వగలరా?. దేశం నుంచి పారిశ్రామికవేత్తలు వెళ్లిపోతున్నారు, దిగుమతులు పెరిగిపోయాయి. రైతులకు మోదీ క్షమాపణ చెప్పాలి. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని స్వయంగా కొందరు మంత్రులు చెప్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు దాటింది. అయినా ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగా ఎందుకు ఉండాలి? మనతో ప్రయాణం మొదలుపెట్టిన చైనా ఎలా మారిపోయిందో అందరికీ తెలుసు. రెండో ప్రపంచ యుద్ధంలో అణుబాంబు దాడికి గురైన జపాన్ ఇప్పుడు ఏ స్థాయిలో ఉన్నది? మనం ఎక్కడున్నామో ఆలోచించాలి. మన దేశంలో అద్భుతమైన సహజ వనరులు ఉన్నాయి. అపారమైన నీటి వనరులు ఉన్నాయి. కావాల్సినంత బొగ్గు ఉన్నది. అయినా దేశం ఇప్పటికీ కరంటు కోతలు ఎదుర్కొంటున్నది. డిమాండ్‌కు తగినంత సరఫరా లేక అంధకారంలో ఉంటున్నది. అందుకే పారిశ్రామికవేత్తలు దేశానికి వచ్చి పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇటీవలే టెస్లా వచ్చి పారిపోయింది. ఇవన్నీ ప్రజల అనుభవంలో ఉన్నాయి. ప్రజలకు కాంగ్రెస్, బీజేపీ ఎలాంటివో స్పష్టంగా అర్థమైంది. వాళ్ల వల్ల దేశానికి ఎలాంటి ప్రయోజనం లేదని తెలిసిపోయింది.

మాకు 400 సీట్లు ఖాయమని బీజేపీ చెప్తున్నది. రెండు దశల ఎన్నికల్లోనే 200 సీట్లు వస్తాయని అమిత్‌షా చెప్తున్నారు కదా?.

ఈ ఎన్నికల్లో బీజేపీకి 200 సీట్లు కూడా రావు. అలాంటిది రెండు దశల్లోనే 200 సీట్లు దాటామని చెప్పడం గోబెల్స్‌ను మించిన ప్రచారం. ప్రాంతీయ పార్టీలు బలమైన శక్తిగా మారబోతున్నాయి.

దేశంలో ఎన్డీయే, ఇండియా కూటముల మధ్య పోటీ కనిపిస్తున్నది. మీరు రెండింటిలోనూ లేరు. హంగ్ ఏర్పడితే ఎటువైపు ఉంటారు?

మీ ప్రశ్నే తప్పు. ఎన్డీయే కూటమి, ఇండియా కూటమి మధ్యే పోటీ అనే భావన సరికాదు. పైగా ఇప్పుడు ఇండియా కూటమి అనేదే లేదు. మమతా బెనర్జీతోపాటు చాలా మంది కూటమి నుంచి బయటికి వచ్చేశారు. ఇప్పుడు బీజేపీ లేదా ఎన్డీయేతో గట్టిగా పోరాడుతున్నది ప్రాంతీయ పార్టీలు మాత్రమే. ఎన్నికల తర్వాత ప్రాంతీయ పార్టీలే బలమైన శక్తిగా మారబోతున్నాయి. కాబట్టి ఇందులో తెలంగాణకు సంబంధించి బలమైన వాణి వినిపించేలా ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం ఉన్నది. హంగ్ ఏర్పడితే మేము కాంగ్రెస్, బీజేపీల్లో ఎవరికీ సపోర్ట్ చేయం. ప్రాంతీయ పార్టీలు ఏర్పాటు చేయబోయే కూటమికే బీజేపీ, లేదా కాంగ్రెస్ వచ్చి సపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

కొత్త కూటమిలో ప్రధాని ఎవరవుతారు?

అనుభవం, ప్రజాదరణ ఉన్న మంచి నేతను ప్రధానిగా ఎన్నుకోవాల్సి ఉంటుంది.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌పై మీ స్పందన?

ఇదంతా మోదీ సృష్టి. లేని కుంభకోణంలో నా బిడ్డ కవితను అరెస్ట్ చేయడం పెద్ద జోక్. ఇప్పుడు దేశంలో నేను, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్ వంటి నలుగురైదుగురు నేతలు మాత్రమే బీజేపీకి వ్యతిరేకంగా గళం వినిపిస్తున్నాం. ఇది ఆయన తట్టుకోలేకపోతున్నారు. అందుకే లిక్కర్ స్కామ్‌ను తెరమీదికి తెచ్చి ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. అసలు ఇది కుంభకోణమే కాదు. ఢిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానం. ప్రభుత్వం తెచ్చిన పాలసీని కుంభకోణం అని ఎవరైనా అంటారా? మోదీ సృష్టించిన కట్టుకథలు కాకపోతే.. ఒక్క రూపాయి కూడా ఎందుకు స్వాధీనం చేసుకోలేకపోయారు?.

మీరు ప్రచారం నిర్వహించకుండా ఎన్నికల సంఘం 48 గంటల నిషేధం విధించడంపై మీ స్పందన?

బస్సుయాత్రతో ప్రజల్లో బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణ చూసి కాంగ్రెస్, బీజేపీ భయపడ్డాయని ఈ ఘటన రుజువు చేస్తున్నది. అందుకే నా గొంతు నొక్కాలని ప్రయత్నించారు. మోదీ మతవిద్వేష వ్యాఖ్యలు చేసినా ఈసీ పట్టించుకోలేదు. సీఎం రేవంత్‌రెడ్డి నాపై అభ్యంతరకరమైన భాష వాడినా ఏమీ అనడం లేదు. మేం ఇచ్చిన ఫిర్యాదులను పక్కన పెట్టేస్తున్నారు. అయినా ఈ నిషేధం ఎలాంటి ప్రభావం చూపదు. వాళ్ల గురించి ప్రజలకు అర్థమైంది. ఎన్నికల్లో దానిని చూపిస్తారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

గాజా ప్రకంపనలు

అమెరికాలోని యూనివర్సిటీ క్యాంపస్‌లు విద్యార్థుల నిరసనలతో దద్దరిల్లుతున్నాయి. పాలస్తీనా అనుకూల నినాదాలు మార్మోగుతున్నాయి. గాజా యుద్ధం పేరిట పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్న ఇజ్రాయెల్‌పై ఆంక్షలు విధించాలని, ఇజ్రాయెల్‌తో అమెరికా కంపెనీలు వ్యాపారాలు మానుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. రెండు వారాల క్రితం ఏప్రిల్ 17న కొలంబియా యూనివర్సిటీలో మొదలైన ఆందోళన దావానలంలా 20కిపైగా యూనివర్సిటీలకు పాకింది. ఆ తర్వాత సరిహద్దులు దాటి ఐరోపా, పశ్చిమాసియా దేశాలకూ విస్తరించింది. విద్యార్థులు చేపట్టిన బైఠాయింపులతో క్యాంపస్‌లు ఉద్రిక్తంగా మారాయి. దీంతో పోలీసు, పారామిలిటరీ బలగాలు బలప్రయోగంతో బైఠాయింపు శిబిరాలను ఖాళీ చేయించారు. ఈ ఉదంతంపై అమెరికాలో పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. యూదు, ఇస్లామిక్ సమర్థకుల మధ్య గాజా ఓ పెద్ద సమస్యగా మారింది. రెండు శిబిరాలకూ తమతమ బలమైన వాదనలున్నాయి.

అమెరికా, ఐరోపా దేశాల్లో గాజా అనుకూల విద్యార్థి ఉద్యమాలు ఆయా సమాజాల్లో చిక్కు సమస్యలు తెచ్చి పెడుతున్నాయి. స్థానిక జనాభిప్రాయంలో ఇది నిట్టనిలువు చీలికలు తెస్తుండటం చర్చనీయాంశమవుతున్నది. ప్రస్తుత పరిస్థితికి నిన్నటిదాకా సంపన్న దేశాలు అనుసరించిన ఉదారవాద శరణార్థి విధానాలు కారణమనే విమర్శలు అంతకంతకూ పెరుగుతున్నాయి. శ్రామిక శక్తి అవసరం, మానవతావాద సహాయం పేరిట ఇబ్బడిముబ్బడిగా శరణార్థులను అనుమతించడం వల్ల సమాజ రూపురేఖలు మారుతున్నాయి. ఖండాంతరాలు దాటిన మతాభినివేశం రాజకీయాలపై ప్రభావం చూపుతున్నది. ఇది అంతిమంగా తీవ్ర జాతీయవాదానికి దారితీయడం మనం చూస్తున్నాం. డోనాల్డ్ ట్రంప్ వంటి మితవాద నాయకులు ఈ ప్రభంజనం ఆసరాగానే ప్రజాదరణ పొందుతుండటాన్ని మనం చూస్తున్నాం. అటు ఐరోపాలోని జర్మనీ సహా అనేక దేశాల్లో రాజకీయాలు శరణార్థుల సమస్య చుట్టే తిరుగుతున్నాయి.

గాజా సమస్య ఇలా సమాజాల్లో చీలిక అంశంగా మారడమే కాకుండా మహాయుద్ధానికి మలుపు తిప్పే ట్రిగ్గర్‌లా మారనుందా అనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. గాజా పాలస్తీనీయన్ల తరఫున ఇరాన్ పరోక్ష యుద్ధం జరుపుతున్నది. హెజ్బొల్లా, హౌతీల సాయంతో ఇజ్రాయెల్‌ను వేధించే పనులను బాహాటంగానే నిర్వహిస్తున్నది. ఇటీవలే ఇజ్రాయెల్‌తో ఇరాన్ ప్రత్యక్ష ఘర్షణకు దిగడం, ఇజ్రాయెల్ ప్రతిదాడికి పాల్పడటం పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను పెంచింది. అదృష్టవశాత్తూ ఆ ఘర్షణ నామమాత్రపు క్షిపణులు, డ్రోన్ల దాడులకు పరిమితం కావడంతో ప్రపంచం ఊపిరి పీల్చుకుంది. ఇజ్రాయెల్ తరఫున ఇరాన్‌పై అమెరికా దాడికి తెగిస్తే తాము చూస్తూ ఊరుకోబోమని రష్యా హెచ్చరించడం ఉద్రిక్తతలను మరింతగా పెంచింది. అటు ఉక్రెయిన్ యుద్ధంలో అణ్వాయుధాల మోహరింపునకు రష్యా సిద్ధమైంది. మరోవైపు ఉత్తరకొరియా సుదూర లక్ష్య క్షిపణులను ఎక్కుపెట్టేందుకు సమాయత్తమవుతున్నది. ఈ నేపథ్యంలో మందుపాతరపై వచ్చిపడే నిప్పురవ్వగా గాజా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అనేక దేశాల్లో అంతర్గత భద్రతా సమస్యగా పరిణమిస్తున్న గాజా సమస్య కట్టడికి ప్రపంచ దేశాలు కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

'పప్పూ' బిరుదు ఊరకే రాలేదు

కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీకి 'పప్పూ' బిరుదు ఊరకనే రాలేదు. ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి 2004లో ప్రవేశించిన తర్వాత, తన వ్యవహార సరళిని, సమర్థతను గమనించిన మీదట, 10 సంవత్సరాలు అయినా గడవకముందే ఆయనకు ఈ బిరుదు లభించింది. ఆ మాట మొదట ఎవరు అన్నారో గాని, త్వరలోనే కాంగ్రెస్‌తో సహా అన్ని రాజకీయ వర్గాలలో, మీడియాలో, బయటి సమాజంలో కూడా ఈ మాట వేగంగా ప్రచారమై ఆమోదం కూడా పొందింది. తర్వాత మరొక పదేండ్లు గడిచినా ఆయన ఆ బిరుదును ఇప్పటికీ పోగొట్టుకోలేకపోయారు. ఈ లక్షణాల వల్లనే ఒక దశలో కాంగ్రెస్ వర్గాలు పార్టీ నాయకత్వం నుంచి రాహుల్‌ను తప్పించి ప్రియాంకకు అప్పగించాలనే అసాధారణమైన ఆలోచనలు చేశాయి.



టంకశాల అశోక్



రాహుల్ ఈ నెల 5న నిర్మల్ సభలో మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్టు మహిళలకు నెలకు రూ.2,500 సహాయం ఇవ్వటం మొదలైపోయిందని, ఆ సొమ్ము వారి బ్యాంకు ఖాతాలలో జమ కూడా అవుతున్నదని ప్రకటించటాన్ని, అదేవిధంగా ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలు సైతం అమలవుతున్నాయని చెప్పటాన్ని చూసినప్పుడు, తనకు 'పప్పూ' బిరుదు ఊరకనే రాలేదని అర్థమవుతున్నది.

ఇందులో గమనించవలసిన విషయాలు రెండున్నాయి. ఒకటి, రాహుల్‌గాంధీ నిర్మల్ సభలో ప్రసంగించటానికి ముందు, హామీల అమలు పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనకు ఎటువంటి బ్రీఫింగ్ ఇచ్చిందనేది. రెండు, తాము పాలించే రాష్ట్రాలలో హామీల అమలుగురించి, పరిపాలన తీరు గురించి ఢిల్లీలోని కాంగ్రెస్ కార్యాలయం ఎటువంటి మానిటరింగ్ చేస్తున్నదనేది? ఆ ప్రకారం రాహుల్ తదితర నాయకులకు ఏమి సమాచారం ఇస్తున్నదనేది. మంచిర్యాలలో రాహుల్ ప్రసంగాన్ని చూసినప్పుడు, ఈ రెండు విధాలుగా కూడా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో పాటు కేంద్ర కాంగ్రెస్ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ముందుగా రాష్ట్ర ప్రభుత్వం మాట చూద్దాము. ఇవి సాధారణమైన రోజులు కావు. ఎన్నికల ప్రచారపు వేడి ఎండవేడితో పోటీ పడి పెరుగుతున్నది. ఏ పార్టీ, ఏ నాయకుడు ఏ చిన్న మాట అన్నా తక్కిన వారితో పాటు ప్రజలు సైతం వెంటనే గమనించి వ్యాఖ్యానిస్తున్నారు. అటువంటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉండాలి? ఇది ఒకటి కాగా, కాంగ్రెస్ హామీల విషయమై ప్రతిరోజూ హోరాహోరీ యుద్ధమే సాగుతున్నది. అటువంటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలనేది రెండవది. యుద్ధాలను వేర్వేరు పార్టీల ప్రత్యర్థులు స్థానికంగా సాగించటం వేరు. కాని, రాహుల్ వంటి జాతీయ నాయకుడు ఆ యుద్ధంలో పాల్గొనటం వల్ల విషయం మరొకస్థాయికి చేరుతుంది. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకోలేని విషయమా? అయినప్పటికీ రాహుల్‌కు ఇటువంటి శుద్ధ అబద్ధపు బ్రీఫింగ్ ఎందుకిచ్చినట్టు? అందువల్ల ప్రతిపక్షాల నుంచి వచ్చే విమర్శలు, అవహేళనలను రాజకీయమంటూ కొట్టి వేస్తారేమో తెలియదు. కాని యథాతథంగా ఆ మాటలు శుద్ధ అబద్ధాలు కావటం, అది సాధారణ ప్రజలకు కూడా అర్థం కావటం గురించి ఏమంటారు? హామీలు అమలు కాకపోవటంపై ఇప్పటికే నిరసనగా ఉన్న స్త్రీలు, రైతులు, ఇతర వర్గాలకు రాహుల్ మాటలు పుండుపై కారం చల్లినట్టుగా మారాయి. మరొకవైపు ఈ ఉదంతం ప్రతిపక్షాలకు సహజంగానే కలిసివచ్చింది.

రాహుల్ ప్రసంగం తర్వాత అదేరోజున కేసీఆర్ తదితరులు వేర్వేరు చోట్ల తమ సభలలో, మహిళల ఖాతాల్లో రూ.2500 పడటం నిజమా అని సూటిగా ప్రశ్నించారు. మహిళలు లేదు లేదంటూ హోరెత్తారు. మరి రాహుల్‌తో అబద్ధం చెప్పించి ఏమి సాధించినట్లు? దీనితో, తక్కిన హామీల విషయమై ప్రజలకు ఇప్పటికే మొదలైన అనుమానాలు మరింత పెరిగే ప్రమాదం లేదా?

ఇప్పుడు కేంద్ర నాయకత్వం, కేంద్ర కాంగ్రెస్ విషయం పరిశీలిద్దాం. ఆ పార్టీ పలు గ్యారెంటీలు ప్రజలకిచ్చి తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లలో అధికారానికి వచ్చింది. గ్యారెంటీలు స్వయంగా కేంద్ర నాయకత్వం ప్రమేయంతో తయారయ్యాయి. ఆ గ్యారెంటీ పత్రాలను సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలు ఆయా రాష్ట్రాల ప్రజల సమక్షంలో విడుదల చేశారు. గ్యారెంటీల అమలు స్వయంగా తమ బాధ్యత అని ప్రకటించారు. ఆ మేరకు సోనియా గాంధీ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. అటువంటి స్థితిలో చేయవలసిందేమిటి? అసలే తమ పార్టీ కేవలం మూడు రాష్ట్రాలలో అధికారంలో ఉంది. లోక్‌సభలో వరుసగా రెండవసారి కూడా ప్రతిపక్ష హోదా అయినా లభించలేదు. ప్రస్తుతం తిరిగి లోక్‌సభ ఎన్నికల సంగ్రామం భీకరంగా నడుస్తున్నది. అటువంటప్పుడు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా పొందాలి. అది జరగాలంటే హామీల గ్యారెంటీలు అమలుకావాలి. అమలయ్యేట్టు ఢిల్లీ నుంచి పర్యవేక్షణ జరగాలి. పైగా వాటి అమలు తమ బాధ్యత అంటూ గాంధీ కుటుంబం స్వయంగా ప్రకటించింది. కనుక పర్యవేక్షణ తప్పనిసరి. అందుకోసం చేయవలసిందేమిటి? మూడు రాష్ట్రాల పర్యవేక్షణ కోసం ఏఐసీసీలో మూడు డెస్క్‌లతో ఒక యంత్రాంగం ఏర్పాటుచేయాలి. ఆ యంత్రాంగం నుంచి గాంధీ కుటుంబానికి ఎప్పటికప్పుడు నివేదికలు వెళ్లాలి. వాటిలో ప్రజాభిప్రాయాన్ని కూడా చేర్చాలి. వారు వాటిని పరిశీలించి, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు, దిద్దుబాటు హెచ్చరికలు చేయాలి. కాని, పార్టీలో ఏ బాధ్యత లేకున్నా, సాంకేతికంగా ఒక అధ్యక్షుడంటూ ఉన్నా ఆయనను నామమాత్రుడిని చేసి అన్నీ తానై వ్యవహరిస్తున్న మకుటం లేని మహారాజు ఇటువంటి యంత్రాంగమేదీ సృష్టించలేదు. ఆ పని చేసి ఉంటే, హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వపు అబద్ధాలను గుడ్డిగా చదివి నవ్వుల పాలయ్యే స్థితి ఏర్పడేది కాదు.

రాహుల్‌గాంధీ ఒక గొప్ప కుటుంబం నుంచి వచ్చిన నాయకుడు. దేశ విదేశాల్లోని ఉన్నత విద్యా సంస్థలలో చదివినవాడు. వారసత్వ పరిజ్ఞానం, అనుభవం ఎంతో కలవాడు. పార్టీలో అనేక పదవులు నిర్వహించినవాడు. నాలుగుసార్లు లోక్‌సభకు ఎన్నికైనవాడు. పార్టీలో తన మాటే వేదవాక్కు. ఆ విధంగా 54 ఏండ్ల వయస్సు కూడా వచ్చినవాడు. కాని, ఇటువంటి పర్యవేక్షణగాని, అందుకొక యంత్రాంగం అవసరమని గాని ఆయనకు తట్టలేదు. ఆయనకు ఏదో ఒక విధంగా అధికారం సంపాదించాలనే బలమైన కోరిక తప్ప, ప్రజలకు ఇస్తున్న హామీలు అమలుకు సాధ్యమైనవా కాదా అని జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా ఆలోచించాలనే ఇంగితం లేకపోయింది. ఒకసారి ఆ వలయంలో చిక్కుకున్న నాయకునికి, పర్యవేక్షణలు అవసరమని గాని, అందుకు యంత్రాంగం ఏర్పాటుచేయాలని గాని స్ఫురించకపోవటంలో అసహజం, ఆశ్చర్యం ఏమీ లేవు.

ఈ రెండు విధాలైన పరిస్థితుల నుంచి, వైఫల్యాల నుంచి వచ్చిందే రాహుల్‌గాంధీ నిర్మల్ ప్రసంగం. ఇటువంటి ప్రసంగాల వల్ల కాంగ్రెస్ విజయావకాశాలపై ప్రభావం ఉంటుందా లేదా అన్నది కాదు ప్రశ్న. కాని పార్టీ పట్ల, రాష్ట్ర ప్రభుత్వం పట్ల, రాహుల్ గాంధీ పట్ల, గాంధీ కుటుంబం పట్ల విశ్వసనీయతపై ఎటువంటి ప్రభావం ఉంటుందనేది ఆలోచించవలసిన విషయం. అదేవిధంగా, రాహుల్‌ను 'పప్పూ' అని ఆప్యాయంగా పిలిచేవారు ఈ విషయం గురించి చెప్పుకొని మరొకమారు నవ్వకుండా ఉండగలరా అన్నది కూడా ఆలోచించవలసిందే.

ఇటువంటి రాహుల్ ఈ దేశానికి ప్రధానమంత్రి కాగోరుతున్నారు. లోపాలెన్ని ఉన్నా ఆయన బీజేపీపై పోరాడుతున్నారనేది నిజమే. ఆ పోరాటంలో నిజాయితీ లేకపోవటం కూడా అంతే నిజం. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ మొదలుకొని నేటి వరకు ఒకవైపు సెక్యులరిజం, మరొకవైపు సాఫ్ట్ హిందుత్వ అనే రెండు చక్రాలపై నడుస్తున్న బండి. దీనిని వ్యూహాత్మకంగా సెక్యులరిజం, ఎత్తుగడల రీత్యా కమ్యూనలిజం అనవచ్చు. కాంగ్రెస్ క్రమంగా క్షీణించటానికి ఈ ద్వంద్వనీతి ఒక ముఖ్యమైన కారణం. అదేవిధంగా, ఒకవైపు సంక్షేమాలు, సాధికారతలు, బడుగు బలహీన వర్గాలు అంటూ, మరోవైపు ధనిక వర్గాల అనుకూలత, విచక్షణారహితంగా ఆర్థిక సంస్కరణల అమలు, పేదలకు, కార్మికులకు నష్టం కలిగించే చట్టాలు చేయటం కాంగ్రెస్ ద్వంద్వ నీతికి మరొక కీలకమైన తార్కాణం. రాహుల్‌గాంధీ ఈ 20 సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఇటువంటి సీరియస్ విషయాలు, విధానాల గురించి ఎప్పుడూ చర్చించలేదు. వాటిగురించి ఆయనకు తెలుసునా అనేది కూడా అనుమానమే. తనకు కావలసింది అధికారం మాత్రమే. అందుకోసం అలవికాని హామీలిచ్చి, అవి అమలు కాకున్నా అయినట్లు అబద్ధాలు మాట్లాడటం మాత్రమే. ఆ విధంగా చూసినప్పుడు మాత్రం ఆయనను 'పప్పూ' అనలేము.

రైతు రుణమాఫీ ఆషామాషీ కాదు

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఆ పార్టీని ఇరకాటంలో పెట్టేది, రాష్ట్ర ఆర్థికవ్యవస్థపై అత్యంత భారమయ్యేది రైతు రుణమాఫీయే. ఆ పార్టీ చెప్పినట్టు ఏకమొత్తంగా రూ.2 లక్షల మేరకు బ్యాంకుల్లో ఉన్న రైతుల పంట అప్పును చెల్లించాలంటే సుమారుగా రూ.37 వేల కోట్లు అవసరం. అయితే మొత్తం ఆరు గ్యారెంటీల అమలు కోసం 2024-25 బడ్జెట్‌లో కేటాయించిన సొమ్ము రూ.53,196 కోట్లు మాత్రమే. ఈ లెక్కన ఒకేసారి రూ.2 లక్షలు మాఫీ చేస్తే మిగిలిన సొమ్ముతో మిగతా హామీలు ఏడాది పాటు నడిపించడం అసాధ్యం.



బి.నర్సన్
94401 28169

ఆగస్టు 15 లోగా రైతు రుణమాఫీ చేసితీరుతామని సీఎం రేవంత్ ఒట్టు మీద ఒట్టు పెట్టుకుంటున్నారు. అంతదాకా రైతులపై ఒత్తిడి తేవద్దని జాతీయ బ్యాంకులను కోరుతూ, వసూళ్లకు వెళ్లవద్దని సహకార బ్యాంకులను ఆదేశించారు. రైతులకు అందే వ్యవసాయ రుణాల్లో 85 శాతం జాతీయ బ్యాంకులే ఇస్తుంటాయి. ఈ బ్యాంకులు కేంద్ర ప్రభుత్వానికి చెందినవి కావడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అవి పట్టించుకోవు. రుణాల చెల్లింపు, బకాయి అప్పుల వసూళ్ల విషయంలో పై ఆదేశాల మేరకు ఆ సిబ్బంది వ్యవహరించక తప్పదు.

ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీల ప్రకటన కన్నా ఏడాది ముందు వరంగల్ డిక్లరేషన్ సభలోనే రేవంత్ రెడ్డి 'కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల అప్పు మాఫీ చేస్తుందని' గొంతెత్తి ప్రకటించారు. అది ప్రజల్లోకి బాగా చొచ్చుకుపోయింది. నిజానికి రాష్ట్రంలో రూ.లక్ష కన్నా మించి రుణం తీసుకున్న రైతులు వేలల్లోనే ఉంటారు. కానీ, ఒకేసారి లక్ష పెంపు మాత్రం వినడానికి ఇంపుగా ఉంది. మాఫీ సొమ్ము పెంచడం వల్ల పెద్ద రైతులు ఎక్కువగా లాభపడే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా 1990లో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రుణమాఫీ చేసేటప్పుడు ఒక్కో రైతు ఖాతాలో రూ.10 వేలు మాత్రమే జమ చేసింది. మరోసారి 2008లో ఆ లబ్ధిని 5 ఎకరాలు, ఆ లోపు భూమి గల రైతులకే పరిమితం చేసింది. ఈ లెక్కన లక్షను మించిన రుణ మాఫీ రాష్ట్ర ఖజానాపై అనవసర భారమే కాకుండా ఇతర ప్రయోజనాలపై దెబ్బ పడుతుంది.

2023 చివరలో దేశంలో జరిగిన నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రైతు రుణమాఫీ పరిధిని పెంచిన పార్టీలే గెలిచాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో బీజేపీ రైతు రుణ మాఫీ మొత్తాన్ని పెంచి గెలుపును కైవసం చేసుకుంది. నిజానికి రైతులందరికి సాగు భూమి ప్రకారం ఆర్థిక సహాయం అందడానికి రైతుబంధు పథకమే కరెక్టు. బ్యాంకు ప్రమేయం లేకుండా ప్రభుత్వానికి, రైతుకు మధ్యన జరిగే సాయం సజావుగా సాగుతుంది. కేవలం బ్యాంకు రుణం తీసుకున్నవాళ్లకే మేలు కలిగే రుణమాఫీ వల్ల రైతులందరికీ మేలు జరగదు. నిజానికి 2018 లోనే కాంగ్రెస్ లక్ష రూపాయల రుణమాఫీ అనే ఆశ రైతుల్లో కల్పించి ఆ పార్టీ గెలువకపోగా గెలిచిన పార్టీపై ఆర్థికభారాన్ని మోపింది. పాలక పార్టీని చిక్కుల్లో పెట్టేందుకు లక్ష సరిపోదన్నట్టు ఈసారి రూ.2 లక్షల హామీని ప్రకటించింది. రైతుబంధుతో పాటు రూ.లక్ష రుణమాఫీ రాష్ట్ర ఖజానాపై ఎంత భారమో తెలిసి కూడా అటు రైతుబంధు మొత్తాన్ని, ఇటు రుణమాఫీ పరిధిని పెంచి కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలపై ఊహించని మోతకోలును మోపింది.

ఆగస్టు 15 ఇప్పుడు కాంగ్రెస్ గుండెల్లో భయాన్ని పుట్టించే తేదీగా మారింది. మాజీ మంత్రి హరీశ్‌రావు



చాలెంజ్‌ను స్వీకరించిన రేవంత్‌రెడ్డికి తన మాట నిలుపుకోవడం అంత ఈజీ కాదు. రుణమాఫీ కోసం ఓ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి రాష్ట్రానికి నెల నెలా వచ్చే ఆదాయంలో 10 శాతం దానికి మళ్లించి బ్యాంకులకు రూ.37 వేల కోట్లను ఈఎంఐ మాదిరిగా చెల్లించాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి ఉన్నది. చూడటానికి ఇది తేలికగా కనబడ్డా కార్యాచరణలో అడ్డంకులెన్నో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వరంగ బ్యాంకులు రాష్ట్రాల మాట వినవు. ఇలాంటి నిర్ణయాలన్నీ ఆర్బీఐ స్థాయిలో జరుగుతాయి. ఆర్బీఐ కేంద్రం ఆదేశాల ప్రకారం పనిచేస్తుంది. కేంద్రం మద్దతు లేకుండా బ్యాంకుల నుంచి ఎలాంటి సదుపాయం పొందలేరు. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం కోరినట్లు బ్యాంకు రుణాలన్నీ కొత్తగా ఏర్పడే కార్పొరేషన్‌కు బదలాయింపు కావాలన్నా కేంద్రం ఒప్పుకోవలసిందే. అంటే, రూ.37 వేల కోట్ల రుణం రాష్ట్రానికి మంజూరు చేసి నెలసరి వాయిదాల్లో వసూలు చేసుకోవాలి. ఆ రుణానికి సరిపడా ష్యూరిటీ అవసరం. ముందుగా అందుకు అన్ని బ్యాంకులు అంగీకరించాలి. సరిపడా నిధులు వాటి దగ్గర ఉండాలి. ఇలా ప్రతిదీ కేంద్ర ప్రభుత్వం దయపై ఆధారపడి ఉంటుంది. 2014లో రెండు తెలుగు రాష్ట్రాలు రుణమాఫీ విషయంలో రైతుల అప్పులను రీ షెడ్యూల్ చేయమని ఆర్బీఐని కోరాయి. కొన్ని కరువు ప్రాంతాల అప్పులను మాత్రమే అది రీ షెడ్యూల్‌కు ఒప్పుకున్నది. దానివల్ల రాష్ట్రాలకు భారమేమి తగ్గలేదు. కేంద్రం పూర్తిగా సహకరిస్తేనే బ్యాంకుల ద్వారా ఏదైనా సాధ్యపడుతుంది. అది కాలు అడ్డం పెడితే రాష్ట్రాల స్థాయిలో వేల కోట్ల రుణాలు ఏకమొత్తంగా మాఫీ చేయడం గగనమే. ఈ చిక్కులు తెలిసే కేసీఆర్ రైతుబంధు పథకం ఆరంభించారు. దానికి తోడు రుణమాఫీ ఇయ్యాల్నంటే మొత్తంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేయడమే.

ఎన్నికల ముందు రైతు రుణమాఫీ హామీల కారణంగా బ్యాంకింగ్ వ్యవస్థ కూడా దెబ్బతింటున్నది. పాలించే ఐదేండ్లలో ఒకేసారి చేసే బ్యాంకు రుణమాఫీ తర్వాత రైతు బ్యాంకు రుణాన్ని చెల్లించేందుకు మరో ఎన్నికల కోసం, మరో మోసకారి హామీ కోసం ఎదురుచూస్తాడు. అంతవరకు బ్యాంకుల్లో వసూళ్లు నిలిచిపోయి వాటి వ్యాపారం కుంటుపడుతుంది. పంట రుణాలంటే ఐదేండ్లలో ఒకసారి తీసుకొంటే ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రభుత్వం తీర్చే అప్పుగా మారిపోయింది. బ్యాంకులో సంతకం పెట్టి అప్పు తీసుకున్న రైతు ఆ సొమ్ము తాను కట్టాలన్న ధ్యాసే కోల్పోయాడు. ఎలాగోలా గెలవాలనుకోవడం ఏ రాష్ట్రానికి శ్రేయస్కరం కాదు. రాష్ట్ర ఆర్థిక స్తోమతను అంచనా వేయలేని వారు ప్రజల మేలుకోరే వారు కాదు. లక్షయినా, రెండు లక్షలైనా రాష్ట్ర ఆదాయ వనరుల్లోంచే ఇవ్వాలి లేదా ప్రజలపై పన్ను భారం మోపాలి. ఒక వ్యక్తి తన పదవీ కాంక్ష తీర్చుకోవడానికి రాష్ట్రాన్ని బలి చేయడం ఎంతవరకు సబబో జనం ఆలోచించే సమయం ఇదే.

ఆరు దశాబ్దాల పాటు మన తెలంగాణ.. సమైక్య పాలనలో అరిగోస పడ్డది. నిండు శాసన సభలో తాము పుట్టిన గడ్డ పేరు కూడా చెప్పుకోలేని దుస్థితిని తెలంగాణ బిడ్డలు అనుభవించారు. ఆత్మగౌరవం అవమానానికి గురైంది. అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతున్నదని.. ఎదిరించిన ప్రజల్ని పాలకులు బెదిరించారు. నిలదీస్తే నిండు ప్రాణాలు తీశారు. పోరాడితే తుపాకులతో కాల్చి చంపారు, పొట్టనబెట్టుకున్నారు.

కొట్లాట కొత్త గాదు



ఇనుగుర్తి సత్యనారాయణ
97046 17343

దశాబ్దాల తెలంగాణ తల్లి బానిస సంకెళ్లు తెంచేందుకు.. ఈ గడ్డపై ఓ ధిక్కార స్వరం వినిపించింది. ఓ వేగుచుక్క ఆశాజ్యోతిని వెలిగించింది. ఆ ధిక్కార స్వరం, ఆశాజ్యోతి మరెవరో కాదు, తెలంగాణ కోసం బరిగీసి నిలిచి కొట్లాడిన ఉద్యమ వీరుడు కే చంద్రశేఖర్‌రావు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనేది ఓ స్వప్నంగా మిగిలిపోయిన దశలో ఇది ఆరని జ్వాల.. ఒడువని ముచ్చట అంటూ కేసీఆర్ ప్రజాచైతన్యం కలిగించారు. కేంద్రం మెడలు వంచి, చిరకాల స్వప్నాన్ని సాకారం చేశారు.

ప్రత్యేక రాష్ట్రం సాధించిన తర్వాత కూడా సమైక్యవాదుల కుట్రలు కొనసాగుతాయని కేసీఆర్ ముందే గ్రహించారు. తెలంగాణ రాష్ట్రం విఫల ప్రయోగం అని చాటేందుకు తెలంగాణ శత్రువు చంద్రబాబు చేసిన కుట్రలను రాజకీయ వ్యూహ చతురతతో తిప్పికొట్టారు. సాఫీగా సాగుతున్న దశలో తెలంగాణకు కాంగ్రెస్ రూపంలో పెను విపత్తు వచ్చింది. పదేండ్ల పాలన ముగించుకుని పరుగులు పెట్టాల్సిన తెలంగాణ.. ఈనగాచి నక్కల పాలైన చందంగా కాంగ్రెస్ పాలకుల చేతికి చిక్కింది. అలవిగాని హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్.. ప్రజల్ని మాయ చేసి అధికారాన్ని దక్కించుకుంది.

సమైక్య పాలనలో కుదేలైన రంగాలన్నీ ప్రత్యేక రాష్ట్రంలో శక్తిని కూడదీసుకుని, నడక మొదలు పెట్టాయి. అభివృద్ధి పరుగుల బాట పట్టే సమయంలో కాంగ్రెస్ నాయకుల కళ్లల్లో మంటపుట్టింది. కదులుతున్న తెలంగాణ కాళ్లల్లో కట్టెపెట్టినట్టు కాంగ్రెస్ అధికారం చేపట్టింది. తెలంగాణను మళ్లీ సంక్షోభ చెరలో బంధించింది. కాంగ్రెస్ నేతలు జనాన్ని నమ్మించి ముంచిన్రు.. ద్రోహం చేసిన్రు. తెలంగాణ జనం బతుకులతో చెలగాటమాడుతున్రు. ఆశపడ్డ జనం.. ఇప్పుడు గోస పడుతున్రు. కాంగ్రెస్ ప్రజాకంటక పాలనలో రైతు బంధు రాలేదు. రైతుల పంటలు చేతికందలేదు. కల్యాణలక్ష్మి ఇయ్యకపాయె. తులం బంగారం ఏడపాయె? రుణమాఫీ ఏమాయె? మహిళలకు నెలకు రూ.2500 ఊసే లేదు.

కాంగ్రెస్ ప్రజాపాలనలో రైతుబంధు అడిగితే చెప్పుతో కొడుతామని మంత్రులు అంటున్నారు. పథకాలు ఏమయ్యాయని విలేకర్లు, ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తుంటే.. 'పేగులు తెంపి మెడలేసుకుంటా.. కనుగుడ్లు పీకి గోటీలాడుకుంటా' అని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారు. మీడియా ప్రతినిధుల్ని 'గాడిద కొడుకులు' అని తిట్టి.. ప్రశ్నించే గొంతుకలను 'పండవెట్టి తొక్కుతా'నని బెదిరిస్తూ రేవంత్‌రెడ్డి తన అసలైన నైజాన్ని బయటపెట్టుకున్నారు. కాంగ్రెస్ పాలకులు తమను నమ్మించి ముంచిన్రని తెలుసుకున్న ప్రజలు ఇప్పుడు గుండెలు బాదుకుంటున్నారు. అందుకే గొంతెండిన తెలంగాణ రోడ్డెక్కి కాంగ్రెస్‌పై గొడవ చేస్తున్నది.

ప్రజల కోసమే పోరాటం.. తెలంగాణ కోసమే ఆరాటంగా మరో ఉద్యమానికి సిద్ధమయ్యారు కేసీఆర్. తెలంగాణ ఆగమవుతుంటే చూస్తూ ఊరుకోనంటూ నినదిస్తున్నారు. 'కొట్లాట కొత్త గాదు.. తెలంగాణ ఓడిపోదు' అంటూ ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే ప్రభుత్వాన్ని నిలదీసే ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు చైతన్యవంతమైన తెలంగాణ అండగా నిలవాలి.




హక్కుల కోసం గొంతెత్తుతున్న ప్రజల్ని పండవెట్టి తొక్కుతామంటున్న కాంగ్రెస్ నేతలు.. ప్రశ్నించే బలమైన గొంతుకలు లేకపోతే అన్నంతపని చేసినా చేస్తారు. ఇది కీలకమైన సమయం. మరోసారి మోసపోవద్దు. నవ్వేటోళ్ల ముందు జారిపడొద్దు. తెలంగాణను బాగు చేసుకునే మహా యజ్ఞం ఇంకా ముగిసిపోలేదు. రాష్ట్రాన్ని సుభిక్షం చేసుకోవడంలో ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. అందుకు సరైన నేత కేసీఆర్ నాయకత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలి. పేదల కోసం కొట్లాడుతున్న తెలంగాణ పెద్ద దిక్కుకు కొండంత అండగా నిలవాలి. ఇది ఎడ్డి తెలంగాణ కాదని చాటి చెప్పాలి. 'నమ్మిస్తే నమ్ముతాం కానీ.. నమ్మకద్రోహం చేస్తే ఊరుకోం' అని ఓటుతో దీటైన సమాధానం ఇవ్వాలి.

సమైక్య నిర్బంధాన్ని అధిగమించిన తెలంగాణ.. నిత్య చైతన్యశీలిగా మారింది. కష్టాల కడలి నుంచి బయటపడ్డ తెలంగాణ.. అభివృద్ధి బాటలో మరెన్నో మైలురాళ్లు దాటాల్సి ఉంది. మన కోసం మనం రాసుకునే అద్భుత చరిత్ర మిగిలే ఉంది. ఇది ఆరని జ్వాల.. ఒడువని ముచ్చట.

జై తెలంగాణ.. జాగో తెలంగాణ!

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)



ఆ దాడి ఎన్నికల స్టంటే!

ప్రజల ప్రాణాలతో ఎలా ఆడుకోవాలో బీజేపీకి బాగా తెలుసు. పూంచ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడి ఎన్నికల స్టంటే. ఎప్పుడైతే ఎన్నికలు జరుగుతాయో అప్పుడు బీజేపీని గెలిపించేందుకు ఇటువంటి ఎన్నికల స్టంట్‌లు జరుగుతాయి.



- చరణ్‌జీత్ సింగ్ చన్నీ
పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి

దూరదర్శన్‌లో బీఆర్ఎస్ 'వాణి'

ఆకాశవాణిలోనూ ఎమ్మెల్సీ వాణీదేవి ఎన్నికల ప్రచారం

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆకాశవాణి, దూరదర్శన్‌లో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్సీ వాణీదేవి తన వాణిని వినిపించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆమె వివరించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ ఆకాశావాణి, దూరదర్శన్‌లో ఉచితంగా స్లాట్లను కేటాయిస్తుంది. దీనిలో భాగంగా బీఆర్ఎస్ తరఫున ఆమెకు ప్రసంగించే అవకాశాన్ని కల్పించారు. పరిశ్రమలు, పల్లెప్రగతి, పట్టణ ప్రగతి, నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా విజయాలను ఆమె వివరించారు. రాష్ట్రానికి టీఎస్ఐపాస్ విధానం ప్రపంచంలో గుర్తింపు పొందిందని తెలిపారు. తెలంగాణ వాణిని పార్లమెంట్‌లో వినిపించాలంటే బీఆర్ఎస్ ప్రతినిధులు అధిక సంఖ్యలో ఉండాలని ఆమె కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకే ఓటు వేయాలని వాణీదేవి ఈ సందర్భంగా కోరారు.

ఏపీ కొత్త డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా



హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి శంఖబ్రత బాగ్చీ ప్రస్తుత డీజీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించిన కొన్ని గంటల్లోనే.. కేంద్ర ఎన్నికల సంఘం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ కొత్త డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తాను నియమించింది. ప్రస్తుతం హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న హరీశ్‌కుమార్‌గుప్తా 1992 క్యాడర్ ఐపీఎస్ అధికారి. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ విపక్షాల ఫిర్యాదులమేరకు.. ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని బదిలీ చేస్తూ ఎన్నికల సంఘం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. డీజీపీ పోస్టు కోసం ముగ్గురు డీజీ ర్యాంక్ అధికారుల జాబితాను పంపించాలని ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు సీఎస్ జాబితా పంపారు. సీనియార్టీ జాబితాలో ఉన్న ఐపీఎస్ అధికారులు ద్వారకా తిరుమలరావు (ఆర్టీసీ ఎండీ), మాదిరెడ్డి ప్రతాప్, హరీశ్‌కుమార్‌గుప్తా పేర్లను సిఫార్సు చేయగా హరీశ్ కుమార్‌గుప్తాను ఈసీ ఎంపిక చేసింది.

అదానీ, అంబానీలకు 14.50 లక్షల కోట్లు మాఫీ..

తప్పుని నిరూపిస్తే రాజీనామా

- కిషన్‌రెడ్డి, సంజయ్‌కు కేటీఆర్ సవాల్
- నమో అంటే నమ్మించి మోసం చేయటమే
- కాంగ్రెస్ పనైపోయింది..పోటీ బీజేపీతోనే



శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ ఆర్టీఏ ఆఫీస్ వద్ద కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు

సిరిసిల్ల టౌన్/రాజన్న సిరిసిల్ల/ హైదరాబాద్ సిటీబ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ): అదానీ, అంబానీలకు నరేంద్రమోదీ రూ.14.50 లక్షల కోట్లు రుణమాఫీ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇది తప్పని రుజువు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ బండిసంజయ్‌కు సవాల్ విసిరారు. సోమవారం కరీంనగర్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా సిరిసిల్ల నియోజకవర్గంలో,చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగుల్లో కేటీఆర్ ప్రసంగించారు. 'అదానీ, అంబానీలకు మోదీ రుణమాఫీ చేయలేదని నిరూపిస్తే సిరిసిల్ల తెలంగాణ విగ్రహం వద్ద నా రాజీనామా పత్రం పెట్టి, ఎమ్మెల్యే పదవి ముఖానకొట్టి బయటకు వెళ్లిపోతా' అని స్పష్టం చేశారు. ముడిచమురు ధరలు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించలేదని, జాతీయ రహదారులపై టోల్ ట్యాక్స్‌లు పెట్టి రూ.30 లక్షల కోట్ల పేదల రక్తం పీల్చారని విమర్శించారు. కాకులను కొట్టి గద్దలకు ఇచ్చినట్టు పెద్దలకిచ్చినోడు నరేంద్రమోదీ అని మండిపడ్డారు. గుజరాత్‌కు వరదలొస్తే రూ.వెయ్యి కోట్లు ఇచ్చిన మోదీ.. హైదరాబాద్‌కు పైసా కూడా ఇవ్వలేదని, మనపై సవతిప్రేమ చూపిస్తున్న మోదీ రాజధర్మం ఇదేనా? అని నిలదీశారు. నిరుద్యోగం, ధరలపై మాట్లాడే ముఖం లేక.. దేవుడి పేరుతో డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు.

రైతులు రగిలిపోతున్నరు

'ఈ ఎన్నికల్లో పోటీ కాంగ్రెస్‌తో లేదు. ఆ పార్టీ చేసిన మోసం అందరికీ అర్థమైంది. రైతులు కూడా రగిలిపోతున్నారు. ఇక బీజేపీ చేస్తున్న మోసాలను అర్థం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నది' అని కేటీఆర్ అన్నారు. నమో అంటే నరేంద్రమోదీ కాదని, నమ్మించి మోసం చేయడమేనని, రాముడి పేరుతో రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎంపీగా గెలిచి ఐదేండ్లవుతున్నా బండి సంజయ్‌ను చూశారా? అని అడిగితే లేదంటూ ప్రజలు సమాధానం చెప్పారు.

అన్నమో రామచంద్రా! అన్న పరిస్థితి

కేసీఆర్ ప్రభుత్వం పోయాక రాష్ట్రంలో అన్నమో రామచంద్రా! అన్న పరిస్థితి వచ్చిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'మోచేతికి బెల్లం పెట్టి మోసపూ

> **పదేండ్ల బీఆర్ఎస్.. నిజం, పదేండ్ల బీజేపీ.. విషం, 150 రోజుల కాంగ్రెస్.. మోసం.** – కేటీఆర్

రిత హామీలతో కాంగ్రెస్ గెలిచింది. ఆరు గ్యారెంటీల్లో ఒక్కటే అమలుచేసి రేవంత్‌రెడ్డి మొగోళ్లకు, ఆడోళ్లకు తాకులాటలు పెట్టిండు. వంద రోజుల్లో రైతు రుణమాఫీ, రూ.4 వేల పింఛన్లు వచ్చాయా? ఓటు వేసుకునేటపుడు ఒక లెక్క.. గెలిచినంక ఒకతీరులా ప్రభుత్వ పాలన ఉన్నది' అని కాంగ్రెస్ సర్కారుపై ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా 250 మంది రైతులు, 50 మంది ఆటోడ్రైవర్లు, నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని దుయ్యబట్టారు. ఉచితబస్సు ప్రయాణం తప్ప, తులం బంగారం, స్కూటీలు, రూ.2 లక్షల రుణమాఫీ ఇవ్వలేదని కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరిగారు. 420 హామీలిచ్చి 5 గ్యారెంటీలు కూడా అమలు చేయలేదని గుర్తుచేశారు. సిరిసిల్లకు వచ్చిన రేవంత్‌రెడ్డి నేతన్నలు, రైతులకు వరాలు ఇస్తారనుకుంటే.. తనను, కేసీఆర్‌ను తిట్టడానికే సమయం వెచ్చించారని మండిపడ్డారు. మోసపోయి గోసపడుతున్నామని, కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు. భవిష్యత్ మనదేనని కార్యకర్తలకు భరోసానిచ్చారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన కొంతమంది విమర్శలు చేస్తున్నారని, తమ ప్రభుత్వం వచ్చాక మిత్తితో సహా రుణం తీర్చుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్‌ను కేంద్రపాలితప్రాంతం చేస్తామని, సిరిసిల్ల జిల్లాను రద్దు చేస్తామంటున్న వారికి బుద్ధి చెప్పాలని కోరారు.

మోదీ లైన్‌లో రేవంత్

తెలంగాణను ఓ ఆర్ఎస్ఎస్ వ్యక్తి నడుపుతున్నారని సీఎం రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు సంధించారు. 'సీఎం రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీ లైన్‌లో లేడు. మోదీ లైన్‌లో ఉన్నాడు' అని కేటీఆర్ విమర్శించారు. కొత్త కంపెనీలను తీసుకొచ్చే ముఖం లేదని, కాంగ్రెస్ సర్కార్ అసమర్థత వల్ల గుజరాత్, చెన్నైకి కంపెనీలు తరలిపోతున్నాయని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 16 సీట్లు ఇచ్చిన హైదరాబాద్‌కు రుణపడి ఉంటానని, ఈ ఎన్నికల్లో 10-12 సీట్లను బీఆర్ఎస్‌కు అప్పగిస్తే ఆరు నెలల్లో రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ శాసిస్తారని అన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, సబితాఇంద్రారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కార్తీక్‌రెడ్డి, స్వామిగౌడ్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిషత్తు మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణాధ్యాక్షుడు జిందం చక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, గజభీంకార్ రాజన్న, బొంపెల్లి సురేందర్‌రావు, కల్వకుంట్ల గోపాల్‌రావు, జనగామ శరత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌గౌడ్‌కు కేటీఆర్ పరామర్శ

రామగిరి, మే 6: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్‌పై కాంగ్రెస్ నాయకుల దాడులు అవివేకమని, ఒక పిరికిపంద చర్య అని కేటీఆర్ మండిపడ్డారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేటలో కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయాలతో బయటపడ్డ మాజీ సర్పంచ్ బుర్ర శంకర్‌గౌడ్‌ను సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయానికి పిలిపించుకొని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. శంకర్‌గౌడ్‌ను రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక కాంగ్రెస్ నేతలు దాడులకు తెగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలో ఉండగా ప్రత్యర్థులపై ఇలా దాడులకు పాల్పడలేదని గుర్తుచేశారు. శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రచారంలో బిజీగా ఉన్నా, కేటీఆర్ తనను హైదరాబాద్‌కు పిలిపించి ధైర్యం చెప్పటం భరోసానిచ్చిందని వెల్లడించారు.

- ***నాలుగు వేలు ఇస్తలేరు పటేలా***



'చేతు గుర్తు అత్తే నాలుగు వేల పింఛిన్ ఇత్తమన్నారు.. నాల్గు నెల్లు అయినా పింఛన్ రాలేదు పటేలా?' అని వృద్ధులు మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డితో మొర పెట్టుకున్నారు. బీఆర్ఎస్ జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా కామారెడ్డి జిల్లా బాన్సువాడలో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. మరోసారి మోసం జరగొద్దంటే వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని మాజీ స్పీకర్ వృద్ధులకు సూచించగా, సరే పటేలా? అని బదులిచ్చారు. – బాన్సువాడ టౌన్, మే 6

- **పాడె మోసి..సానుభూతి తెలిపి**



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూరులో బీఆర్ఎస్ కార్యకర్త మృతి చెందగా, మంత్రి ఎర్రబెల్లి సోమవారం పాడె మోసి సానుభూతి తెలిపారు. గ్రామానికి చెందిన ఈదునూరి వీరయ్య కుమారుడు సందీప్ (26) రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందగా దయాకర్‌రావు నివాళులర్పించారు. అనంతరం పాడె మోసి కన్నీటి పర్యంతమైన మాజీ మంత్రి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. – తొర్రూరు, మే 6

ఐదెకరాలతో ఆగేది.. అందరికీ పడ్డది

› మొదటిపేజీ తరువాయి...

జమకాకపోవడంపై కేసీఆర్ పదే పదే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. యావత్ తెలంగాణ సమాజం కేసీఆర్‌కు మద్దతుగా స్పందించింది. తద్వారా రైతుబంధు ఇవ్వక తప్పని అనివార్య పరిస్థితిని కేసీఆర్ కల్పించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ సర్కారు రైతుబంధు నిధులను విడుదల చేసింది. ఇప్పటికే ఐదెకరాల వరకు రైతుబంధు విడుదల చేసిన ప్రభుత్వం, సోమవారం ఐదెకరాలకుపైగా భూమి గల రైతుల ఖాతాల్లో సైతం జమచేసింది. వాస్తవానికి, యాసంగి సీజన్‌కు మొత్తం 1.52 కోట్ల ఎకరాలకుగాను రూ.7,625 కోట్లు విడుదల చేయాల్సి ఉన్నది. ఇందులో ఐదెకరాల రైతులకు రూ.5,202 కోట్లు ఇప్పటికే అందజేసిన ప్రభుత్వం.. తాజాగా ఐదెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న మిగిలిన రైతులకు రూ.2,423 కోట్లను విడుదల చేసింది. ఈ విధంగా సుమారు ఐదు నెలలపాటు కొనసాగిన యాసంగి రైతుబంధు పంపిణీ ఎట్టకేలకు పూర్తయింది.

కేసీఆర్ ప్రశ్నల పరంపర.. భయంలో సర్కారు

ఈ యాసంగి సీజన్‌లో ఐదెకరాల వరకే రైతుబంధు వేసి ఆపేయాలని ప్రభుత్వం తొలుత భావించినట్టు తెలిసింది. అందుకే ఐదెకరాలు పైబడిన రైతులకు జమ చేయకుండా ఆలస్యం చేసిందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. కానీ, ప్రభుత్వం కుట్రలకు కేసీఆర్ చెక్ పెట్టారు. రైతులకు పెట్టుబడి కష్టాలు రావొద్దనే ఉద్దేశంతో తాను ప్రవేశపెట్టిన రైతుబంధు సాయం పంపిణీ ఆలస్యం కావడంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వం సాగుకు ముందే అందరికీ రైతుబంధు అందిస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు ఎందుకు ఇవ్వడం లేదని ప్రతి సభలోనూ ప్రశ్నించారు. రైతుబంధు ఇచ్చేవరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని హెచ్చరించారు. ఒకవైపు కేసీఆర్ ప్రశ్నల పరంపర, మరోవైపు ప్రజల నుంచి వస్తున్న స్పందనతో ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సిన వస్తుందన్న భయం అధికార కాంగ్రెస్ పార్టీలో మొదలైంది. కేసీఆర్ ప్రశ్నలతో తమకు నష్టం జరుగుతున్నదని గ్రహించిన సీఎం రేవంత్‌రెడ్డి నష్ట నివారణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఈ నెల 8లోగా ప్రతి రైతుకూ రైతుబంధు జమ చేస్తామని తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆగమేఘాలపై అప్పు చేసి మరీ రైతుబంధు అందించడం గమనార్హం. నిధులు విడుదల చేయకపోతే ప్రజా విశ్వాసం కోల్పోతామన్న ఆందోళనతోనే ఈ చర్యకు ఉపక్రమించినట్టు తెలిసింది.

నాడు అడ్డుపడ్డ కాంగ్రెస్.. నేడు అడ్డుచెప్పని బీఆర్ఎస్

రైతుల పట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వైఖరి ఏమిటనేది రైతుబంధుతో తేటతెల్లమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ రైతుల సంక్షేమాన్ని కూడా రాజకీయం చేస్తే, బీఆర్ఎస్ మాత్రం రాజకీయం కన్నా రైతుల సంక్షేమమే ముఖ్యమని ఆచరణలో రుజువు చేసుకున్నది. ఈ రెండు పార్టీల వైఖరికి ఈ యాసంగి సీజన్ రైతుబంధు పంపిణీనే ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. రైతులకు యాసంగి సీజన్ రైతుబంధు సకాలంలో అందాలన్న ఉద్దేశంతో అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే రైతుబంధు పంపిణీకి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకొని, నిధులు సిద్ధం చేయగా, నాడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల ముందు ఏ విధంగా రైతుబంధు ఇస్తారంటూ ఆనాడు ప్రశ్నించిన కాంగ్రెస్.. రైతులకు నోటికాడి ముద్దను దూరం చేసింది. తాము అధికారంలోకి రాగానే కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చే రూ.ఐదు వేలకు, రైతు భరోసా కింద మరో రూ.ఐదు వేలు జోడించి ఇస్తామంటూ నమ్మబలికింది. తీరా అధికారంలోకి వచ్చాక మాట తప్పింది. ఈ సారికి గత ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధునే ఇస్తామని ప్రకటించింది. వాస్తవానికి, డిసెంబర్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన మరుక్షణమే రైతుబంధును అందరి ఖాతాల్లో జమ చేసే అవకాశం ఉన్నప్పటికీ, జాప్యం చేస్తూ వచ్చింది. చివరకు పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు కొద్ది రోజుల ముందు నిధులు విడుదల చేసింది. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రవర్తించిన విధంగా నేడు బీఆర్ఎస్ వ్యవహరించలేదు. రైతుల సంక్షేమమే పరమావధిగా విశాల దృక్పథం ప్రదర్శించింది. రైతుబంధు పంపిణీపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయకుండా నిండు మనసు చాటుకున్నది. సమయం ఏదైనా సరే, రైతులకు పెట్టుబడి సాయం అందితే చాలని భావించిన బీఆర్ఎస్ పార్టీ రైతుబంధు పంపిణీకి పూర్తి మద్దతు ప్రకటించింది. ఇందుకు సంబంధించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు తాము రైతుబంధును అడ్డుకోబోమని స్పష్టంచేశారు. అందుకుతగ్గట్టుగానే సోమవారం రైతుబంధు పంపిణీకి బీఆర్ఎస్ పార్టీ ఏవిధమైన ఆటంకాలు సృష్టించలేదు. ఈ విధంగా రైతుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ రాజకీయం చేస్తే.. బీఆర్ఎస్ మాత్రం రాజకీయాలకు అతీతంగా మానవీయంగా వ్యవహరించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మోదీ క్యాబినెట్‌లో అందరూ 'యెస్' అంటూ తలూపేవాళ్లే!

- గడ్కరీ, రాజ్‌నాథ్ ఇద్దరే మినహాయింపు
- బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 6: లోక్‌సభ ఎన్నికలు కీలక దశకు చేరుకున్న వేళ మోదీ సర్కార్‌పై బీజేపీ నాయకుడు సుబ్రమణ్య స్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. మోదీ క్యాబినెట్‌లో ఇద్దరు (రాజ్‌నాథ్, గడ్కరీ) తప్ప.. మిగతా వారంతా 'యెస్' అంటూ తలూపే వారేనని విమర్శించారు. లఢక్‌లో నెలకొన్న పరిస్థితిపై కేంద్రం నిజాయితీగా లేదన్నారు. ఎన్నికల బాండ్ల పథకం అతిపెద్ద కుంభకోణమని, దీని నుంచి ప్రధాని మోదీ తప్పించుకోలేరని ఆయన అన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సుబ్రమణ్యా స్వామి పై వ్యాఖ్యలు చేశారు. మోదీ సర్కార్ క్యాబినెట్ మంత్రులపై మాట్లాడుతూ, 'వారికి మంత్రులు అయ్యే అర్హతల్లేవు. రాజ్‌నాథ్, గడ్కరీ తప్ప, క్యాబినెట్‌లో మిగతావారంతా వెన్నెముక లేనివారే. అలాంటి వారినే మోదీ ఎంచుకున్నారు' అని స్వామి అన్నారు.

సుప్రీంకోర్టుకు హేమంత్ సొరేన్

న్యూఢిల్లీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. భూ కుంభకోణం కేసులో మనీలాండరింగ్ జరిగినట్లు ఆరోపిస్తూ ఆయనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జనవరి 31న అరెస్ట్ చేసింది. ఈ అరెస్టును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను జార్ఖండ్ హైకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. దీనిపై ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో అప్పీలు చేశారు. హేమంత్ ప్రస్తుతం రాంచీలోని బిర్సా ముండా కేంద్ర కారాగారంలో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలి

- బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం
- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

హనుమకొండ, మే 6: మనువాద బీజేపీ, కపటప్రేమ కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇల్లందుల రాజేశ్‌ఖన్నా అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాణాలకు తెగించి కొట్లాడి తెలంగాణ సాధించిన బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు మాత్రమే తెలంగాణ అభివృద్ధి, పేద ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉన్నదని చెప్పారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, సచివాలయం, అమరవీరుల స్మారక చిహ్నంతోపాటు పాడిపంటలతో సుభిక్షంగా ఉన్న తెలంగాణ కేసీఆర్ అభివృద్ధి చిహ్నాలని గుర్తుచేశారు. అట్లాంటి తెలంగాణ 5 నెలల కాంగ్రెస్ పాలనలో ఆగమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క నిమిషం కూడా కరెంటు పోని రాష్ట్రాన్ని కరెంటు కోతల రాష్ట్రం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ అసెంబ్లీలో అఖిలపక్షాన్ని ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపడంతోపాటు బిల్లు పెట్టాలని ప్రధాన మంత్రి వద్దకు బృందాన్ని పంపినట్టు గుర్తుచేశారు. కేసీఆర్‌తోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని సంపూర్ణంగా విశ్వసిస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మారెపల్లి సుధీర్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఈదునూరి యాకన్న, యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొట్టపెంజర రమేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెడ స్వామి, రాష్ట్ర నాయకుడు బొచ్చు మురళి, ఎంఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా, కేయూ ఇన్‌చార్జి ధర్మారపు శ్రీకాంత్ పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం 15.8 కోట్లు

- పరిపాలనా అనుమతులు మంజూరు
- విపత్తు నిర్వహణ శాఖ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారాన్ని విడుదల చేసింది. 10 జిల్లాల్లోని 15,246 మంది రైతులకు రూ.15.8 కోట్లు కేటాయిస్తూ విపత్తు నిర్వహణ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి 16 నుంచి 21 తేదీల మధ్య ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురిశాయి. 15,814 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు ప్రభుత్వానికి నివేదిక అందగా..ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం అందించనున్నారు. ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి వచ్చిన నేపథ్యంలో నిధులను కేటాయిస్తూ తాజాగా విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. నిధులు విడుదలైన నుంచి 90 రోజుల్లోగా రైతుల ఖాతాలో జమ చేయనున్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ కమిషనర్‌కు సూచించారు.

లోకం పోకడ



ఫ్రీ బస్సులు రద్దు చేస్తే అవమానం.. ఇలా అరేంజ్ చేద్దాం సార్!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	46.5°c	23.3°c
మహబూబ్‌నగర్	45.7°c	32.1°c
మెదక్	45.5°c	24.2°c
రంగారెడ్డి	44.6°c	22.5°c
నిజామాబాద్	44.4°c	28.9°c
ఖమ్మం	44.0°c	26.0°c
వరంగల్	42.0°c	28.0°c
కరీంనగర్	42.0°c	29.0°c
హైదరాబాద్	41.9°c	28.1°c
నల్లగొండ	41.0°c	24.0°c

హైదరాబాద్‌లో అర్బన్ హీట్ ఐలాండ్స్

- ఏడు ప్రాంతాల్లో గుర్తించిన పరిశోధకులు
- చెట్ల నరికివేత, పొల్యూషన్ ప్రధాన కారణం

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో గత కొన్నిరోజులుగా భానుడు ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తుండటంతో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ నెల తొలి వారంలోనే 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లోనూ సూర్యుడు సుర్రుమంటుడటంతో వేడికి తాళలేక జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల తర్వాత ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. మధ్యాహ్నం 12 తర్వాత రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గతంలో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైన హైదరాబాద్‌లో క్రమంగా 'హీట్ ఐలాండ్స్' పుట్టుకొస్తున్నాయి. 'హైదరాబాద్ అర్బన్ ల్యాబ్స్' అనే స్వచ్ఛంద సంస్థ జరిపిన పరిశోధనలో ఇవి బయటపడ్డాయి. ఈ సంస్థకు చెందిన పరిశోధకులు శబరినాథ్, మేఘన ఈ ఏడాది మార్చిలో నమోదైన ఉష్ణోగ్రతలను లెక్కించి హీట్‌ఇండెక్స్‌ను రూపొందించారు. ల్యాండ్ సర్ఫేస్ టెంపరేచర్లను (భూమి ఉపరితలంపై 2-3 మీటర్ల ఎత్తులో నమోదయ్యే ఉష్ణోగ్రతలను) లెక్కించడం ద్వారా అర్బన్ హీట్ ఐలాండ్స్‌ను గుర్తించారు. ల్యాండ్ శాట్ శాటిలైట్ డాటా ఆధారంగా ఉష్ణోగ్రతలను లెక్కించి, వేడిమి అధికంగా ఉన్న 7 ప్రాంతాలను గూగుల్ ఎర్త్ ఇంజిన్ ద్వారా మార్క్ చేశారు. మైలార్‌దేవ్‌పల్లి, బీఎన్‌రెడ్డి నగర్, మన్సూరాబాద్, పటాన్‌చెరు, బండ్లగూడ, గచ్చిబౌలి, హయత్‌నగర్ ప్రాంతాలు హీట్ ఐలాండ్స్‌గా మారినట్టు గుర్తించారు. ఆ ప్రాంతాల్లో ల్యాండ్ సర్ఫేస్ టెంపరేచర్లు 48 నుంచి 49 సెల్సియస్ డిగ్రీల మేరకు నమోదవుతున్నట్టు వెల్లడించారు. వాతావరణ కాలుష్యంతోపాటు కాంక్రీట్ నిర్మాణాలు పెరగడం, చెట్లను నరికివేయడం ఇందుకు ప్రధాన కారణమని తేల్చారు. ఇండ్లలో వాడుతున్న ఏసీలు, ఫ్రిజ్‌ల వల్ల కూడా సర్ఫేస్ టెంపరేచర్లు పెరిగి హీట్ ఐలాండ్స్ పుట్టుకొస్తున్నట్టు తెలిపారు.

- **హైదరాబాదీ ఫొటోగ్రాఫర్ హరికి అరుదైన గౌరవం**



హైదరాబాదీ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ హరి కే పాటిబండకు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ పోటీల్లో అరుదైన 100 ఉత్తమ ఛాయ చిత్రాల్లో హరి తీసిన మచ్చల గుడ్లగూబను వేధిస్తున్న మంగళి పిట్ట (నల్లడ్రోంగో) ఫొటో ఎంపికైంది. 2015 నుంచి 35 ఫొటో.గ్రా సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం అంతర్జాతీయ ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీలకు విశ్వవ్యాప్తంగా 1.11 లక్షల మంది ఫొటోగ్రాఫర్ల నుంచి 1.15 లక్షల ఫొటోలు వచ్చాయి. ఈ పోటీలకు హరి 9 ఫొటోలు పంపించగా, అన్ని ఫొటోలు రెండో రౌండ్‌కు ఎంపికయ్యాయి. 35 అవార్డ్స్ ఈ ఫొటోగ్రాఫ్‌ల ర్యాంకులను ఈ నెల 11 అధికారికంగా ప్రకటించనున్నది.
–హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ)

- **మోదీజీ.. ఇది కుటుంబ పాలనా కాదా?**



ఓటమిని అంగీకరించిన కాంగ్రెస్

- **దేశంలో ఎన్డీయే కూటమిదే విజయం**
- **రాజమండ్రి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ**

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): దేశంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న అన్ని రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమే విజయం సాధిస్తుందని, కాంగ్రెస్ ఇప్పటికే ఓటమిని అంగీకరించిందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎద్దేవా చేశారు. ఎన్డీయే కూటమి తరుపున ప్రధాని మోదీ రాజమండ్రిలోని వేమగిరిలో భారీ బహిరంగసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. మే 13న ఏపీ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలవుతుందని చెప్పారు. వైసీపీ పాలనలో ఏపీ అప్పుల్లో కూరుకుపోయిందని విమర్శించారు. ఐదేళ్లలో ఏపీలో ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా నడుస్తుందని ఆరోపించారు. వైసీపీకి ఆర్థిక క్రమశిక్షణ లేదన్నారు. మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామన్న వైసీపీ.. ఐదేళ్లలో ఒక్క రాజధాని కూడా ఏర్పాటు చేయలేదని తప్పుబట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ అభివృద్ధి అనే పట్టాలపై పరిగెత్తిందన్న మోదీ.. వైసీపీ హయాంలో ఏపీలో అభివృద్ధి పట్టాలు తప్పిందని విమర్శించారు.



పెద్దపల్లిలో జరిగిన జనసభలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

సభలో నుంచి వెళ్లిపోవద్దు ప్లీజ్

బౌన్సర్లను ఏర్పాటు చేసి ప్రజలను అడ్డుకున్న బీజేపీ శ్రేణులు

పెద్దపల్లి, మే 6 (నమస్తే తెలంగాణ)/నీలగిరి/నల్లగొండ రూరల్/చౌటుప్పల్ : నల్లగొండలో బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి మద్దతుగా సోమవారం సాయంత్రం ఆ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. స్థానిక మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా పాల్గొన్నారు. ఈ సభకు 3 వేల నుంచి 4 వేల మందికి మించి రాలేదు. దీంతో సభకు వచ్చిన వారు బయటకు వెళ్లిపోకుండా బీజేపీ కార్యకర్తలు బౌన్సర్లను ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. చౌటుప్పల్‌లోని తంగడపల్లి సభ, పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని సభలో కూడా జనం లేక కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.

‘గల్ఫ్ కార్మిక ద్రోహి.. గప్పాల అరవింద్: ఎన్నారై సెల్

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ గత ఎన్నికల్లో మాయమాటలు చెప్పి గల్ఫ్ కార్మికులను మోసం చేసి నిజామాబాద్ నుంచి ఎంపీగా గెలిచారని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎన్నారై సెల్ నాయకులు ఆరోపించారు. ఈసారి ఎన్నికల్లో మళ్లీ మోసపోవద్దని ఓటర్లను అప్రమత్తం చేస్తూ ‘గల్ఫ్ కార్మిక ద్రోహి.. గప్పాల అరవింద్‘ అంటూ సోమవారం గాంధీభవన్‌లో చార్జిషీట్‌ను విడుదల చేశారు. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, టీపీసీసీ ఎన్నారై సెల్ నాయకులు మంద భీంరెడ్డి, నంగి దేవేందర్‌రెడ్డి, కేరళ ప్రవాసీ కాంగ్రెస్ నేత మునీర్ చార్జిషీట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చార్జిషీట్‌లో తాము చేసిన అభియోగాలకు సమాధానం చెప్పకుండా.. గల్ఫ్ కార్మికుల ఓట్లు అడిగే నైతిక అర్హత అరవింద్‌కు లేదని గుర్తు చేశారు.

అరవింద్‌పై చార్జిషీట్‌లో అభియోగాలు ఇలా ఉన్నాయి

- 2020 సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల పొట్టగొడుతూ.. కనీస వేతనాలను 30 నుంచి 50 శాతం వరకు తగ్గిస్తూ సర్క్యులర్లు జారీ చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వానికి కనీసం వినతిపత్రం కూడా ఇవ్వడం చేతకాని అసమర్థుడు అరవింద్.
- ‘ప్రవాసీ భారతీయ బీమా యోజన’లో సహజ మరణాన్ని చేర్చాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా తప్పించుకు తిరిగిన 'గల్ఫ్ ద్రోహి' అరవింద్.
- హైదరాబాద్‌లో సౌదీ అరేబియా, కువైట్ దేశాల కాన్సులేట్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి కనీసం లేఖ కూడా రాయటం చేతకాని అజ్ఞాని అరవింద్.
- కరోనా కష్టకాలంలో.. గల్ఫ్ దేశాల నుంచి ఇండియాకు వచ్చిన పేద కార్మికుల రక్తం పిండి రెండింతలు, మూడింతలు విమాన చార్జీలు వసూలు చేసింది బీజేపీ ప్రభుత్వం. ఉచితంగా దేశానికి తీసుకురావాల్సిన కేంద్రం.. అధిక చార్జీలు వసూలు చేయడాన్ని ప్రశ్నించలేని అసమర్థ అరవింద్ ఎంపీ పదవికి అనర్హుడు.

ఏ అధికారంతో ఢిల్లీ పోలీసులు వచ్చారు?: రేణుకాచౌదరి

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): ఏ అధికారంతో ఢిల్లీ పోలీసులు తెలంగాణలో దిగారు? ఏ హక్కుతో గాంధీభవన్‌కు వచ్చి మా వాళ్లపై కేసులు పెడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వానికి దమ్ముంటే ప్రజ్వల్ రేవణ్ణను పట్టుకోవాలని సవాల్ విసిరారు. సోమవారం ఆమె గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. నీరవ్‌మోదీ, చోక్సీ పారిపోయినట్టే, ప్రజ్వల్ కూడా విదేశాలకు పారిపోవడానికి అవకాశం కల్పించింది ఎవరని ప్రశ్నించారు. ప్రజ్వల్‌ను బలపరిస్తే తనను బలపరిచినట్టేనని మోదీ సిగ్గు లేకుండా మాట్లాడారని మండిపడ్డారు.

రేవంత్ లక్కీ డిప్ సీఎం: డీకే అరుణ

మహబూబ్‌నగర్ అర్బన్, మే 6: ‘రేవంత్‌రెడ్డి లక్కీ డిప్ ముఖ్యమంత్రి. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన దొంగ. బూతులు మాట్లాడే సీఎం మన జిల్లా వాసి అంటే సిగ్గుగా ఉంది. మోదీని తిట్టడం అంటే ఆకాశం మీద ఉమ్మేసినట్టే’ అంటూ బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ మండిపడ్డారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆమె మీడియాతో మాట్లాడారు. దమ్ముంటే పాలమూరుకు జూరాల నుంచి నీళ్లు తీసుకొచ్చేలా అనుమతులు ఇప్పించని సవాల్ విసిరారు.

రేవంత్‌రెడ్డిపై బీజేపీ నాయకుల ఫిర్యాదు

కొత్తగూడెం క్రైం, మే 6: కేంద్రమంత్రి అమిత్‌షాపై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేశారని బీజేపీ నాయకులు సోమవారం కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎం కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. ‘బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తారని’ కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా అన్నట్టు ఈ నెల 4న కొత్తగూడెం కాంగ్రెస్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేసినట్టు తెలిపారు.

ఢిల్లీ కంటే ముందే షా వీడియో మార్ఫింగ్ కేసు



హైదరాబాద్ సిటీబ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వీడియో మార్ఫింగ్ కేసు ఢిల్లీ కంటే ముందే హైదరాబాద్‌లో నమోదైందని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఒకే నేరంపై రెండు చోట్ల కేసులు అవసరం లేదని, ఇద్దరు దర్యాప్తు చేస్తే గందరగోళానికి కారణం అవుతుందని అభిప్రాయపడ్డారు. సీసీఎస్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఈ కేసు గురించి ఆయన మాట్లాడుతూ.. ఐటీ యాక్ట్ కావడంతో దేశంలో ఎక్కడైనా కేసు నమోదు చేయవచ్చని, అయితే ఒకే నేరంపై రెండు చోట్ల కేసులు అనవసరమని ఇటీవల ఢిల్లీ స్పెషల్ డీసీపీ వచ్చి తనను కలిసినప్పుడు చెప్పానని వెల్లడించారు. డీసీపీ అడిగిన వివరాలు కూడా అందించామని చెప్పారు. గత నెల 26న బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారని, ఫిర్యాదుతోపాటు వీడియో కావాలని కోరామని తెలిపారు. మరుసటి రోజు పెన్‌డ్రైవ్‌లో తెచ్చి ఇవ్వడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. ఎక్స్(ట్విట్టర్)ను సంప్రదించి వివరాలు కోరగా 72 గంటల్లో ఇస్తామన్నారని, ఆ తరువాత మరికొంత సమయం పట్టిందని, ట్విట్టర్‌కు లెటర్ రాసి ఎక్కడి నుంచి అది పోస్ట్ అయ్యిందో గుర్తించి ఐదుగురిని అరెస్టు చేశామని పేర్కొన్నారు.

ఆ వైద్యుల వివరాలివ్వండి

కోడ్ ఉల్లంఘనపై కలెక్టర్ సీరియస్ • నమస్తే తెలంగాణ కథనానికి స్పందన

నిజామాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వైద్యాధికారుల తీరుపై నిజామాబాద్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు సీరియసయ్యారు. ప్రభుత్వ వైద్యుల కోడ్ ఉల్లంఘన శీర్షికన ‘నమస్తే తెలంగాణ’లో వచ్చిన వార్తపై ఆయన సోమవారం స్పందించారు. నివేదిక సమర్పించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి సుదర్శనం, ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌ను ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ విభాగం ఉన్నతాధికారులు సైతం లెటర్ పంపినట్టు సమాచారం. నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.





సిద్దిపేటలో జిల్లా ములుగు రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, హరీశ్‌రావు. చిత్రంలో మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు, ములుగు రోడ్‌షోకు హాజరైన జనం

కేసీఆర్‌ను తిడితే తెలంగాణను తిట్టినట్టే

- కాంగ్రెస్ మోసం.. నాలుగు నెలలకే తెలంగాణ ఆగం
- గ్యారెంటీలు అమలైన గ్రామాల్లో మేం ఓట్లు అడగం
- అమలుకాని గ్రామాల్లో హస్తం పార్టీ ఓట్లు అడగొద్దు
- కేసీఆర్ దెబ్బకు రైతుబంధు, పంటనష్టం పైసలిస్తున్నరు
- రాష్ట్రంలో హీట్ వేవ్.. బీఆర్‌ఎస్ వేవ్ నడుస్తున్నయ్
- రేవంత్ ఐదు అంటే.. రాహుల్ ఆరు అంటుండు
- కాంగ్రెస్‌కు రేవంత్‌తో అపాయం పొంచి ఉన్నది
- కాంగ్రెస్, బీజేపీ అబద్ధాలకు పుట్టిన కవలలు: హరీశ్

గజ్వేల్, నర్సాపూర్, మే 6: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను తిడితే, తెలంగాణను తిట్టినట్టేనని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మీడియాతో, బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా సిద్దిపేట జిల్లా ములుగు, కుకునూర్‌పల్లి, కొండపాకలో రోడ్‌షోల్లో పాల్గొని మాట్లాడారు. ‘తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను తిట్టడం రేవంత్‌రెడ్డికి మంచిదా? కేసీఆర్ వయసెంత? నీ వయసెంత? కేసీఆర్ లేకుంటే నువ్వు సీఎం అయ్యేవాడివా? ఆంధ్రా నాయకుల అడుగులకు మడుగులు ఒత్తే నువ్వు బీఆర్‌ఎస్‌ను విమర్శించటమా?’ అని రేవంత్‌పై ధ్వజమెత్తారు. మెదక్ జిల్లా కీర్తిని ఆకాశానికి ఎత్తిన కేసీఆర్‌ను తిట్టడం సరికాదని, పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలను కేసీఆర్ ఏర్పాటు చేస్తే, ఆ జిల్లాలను రద్దు చేస్తామనటం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు. జిల్లాల రద్దును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు రైతుబంధు ఇస్తావా? చస్తావా? అని కేసీఆర్ బస్ వేసుకొని తిరుగుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దెబ్బకు ఇప్పుడు రైతుబంధు వేస్తున్నరని, పంట నష్టం ఇస్తున్నరని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రెండు వేవ్‌లు నడుస్తున్నాయని, ఒకటి హీట్ వేవ్ కాగా.. మరోటి బీఆర్‌ఎస్ వేవ్ అని అన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ విజయం ఖాయమైపోయిందని ధీమా వ్యక్తం చేశారు. మట్టి పనికైనా, ఇంటి పనికైనా మనోడు ఉండాలని, అందుకు మనకు కేసీఆర్ రక్ష అని అన్నారు.

నాలుగు నెలలకే తెలంగాణ ఆగం

మాయమాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిందని, నాలుగు నెలల్లోనే తెలంగాణను ఆగం చేసిందని హరీశ్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఐదు హామీలు అమలు చేశామంటే, రాహుల్‌గాంధీ ఆరు చేశామంటూ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలను అమలు చేశామని రాహుల్‌గాంధీ ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో చెప్పారని, ఏ గ్రామంలో అమలైందో చెప్పాలని ప్రశ్నించారు. ఏ గ్రామంలో అయినా ఆరు గ్యారెంటీలు అమలైతే బీఆర్‌ఎస్ ఓట్లు అడగదని, ఆరు గ్యారెంటీలు అమలుకాని ఊళ్లలో కాంగ్రెస్ ఓట్లు అడగవద్దని సవాల్ విసిరారు. రాష్ట్రంలో ప్రజలకిచ్చిన హామీలను ఎక్కడ అమలు చేశారో రాహుల్ గాంధీ చూపించాలని డిమాండ్ చేశారు. హస్తం పార్టీ రాకతో దొంగ కరెంట్ మొదలైందని, ఆ పార్టీ వచ్చుడేమో కానీ ఉన్న కల్యాణ లక్ష్మి రావటం లేదని, తులం బంగారం లేదని, చూస్తుంటే బంగారం ధర కొండెక్కిందని విమర్శించారు. ఈ గవర్నమెంట్ అంతా రివర్స్ గేర్‌లా ఉన్నదని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ తప్పుచేస్తే రాహుల్ సరిదిద్దాలని, రాహులే తప్పు చేస్తే ఎవరు సరిదిద్దుతారని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీకి రేవంత్‌రెడ్డితో అపాయం పొంచి ఉన్నదని వ్యాఖ్యానించారు. ఈ తప్పులను సరిదిద్దే బాధ్యత తెలంగాణ ఓటర్లపై ఉన్నదని, కేసీఆర్ నిలబెట్టిన వెంకట్రామిరెడ్డిని గెలిపించుకొందామని పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్, బీజేపీ అబద్ధాలు

బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్, బీజేపీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని, ఆ పార్టీలు అబద్ధాలకు పుట్టిన కవల పిల్లలు అని హరీశ్ మండిపడ్డారు. హామీలు నెరవేర్చకుండా సెంటిమెంట్ రగిలించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. పదేండ్లలో బీజేపీ, ఐదు నెలల్లో కాంగ్రెస్ ప్రజలకు ఏం చేశాయో చెప్పలేక పోతున్నాయని, అందుకే మతాలు, రాజ్యాంగం, రిజర్వేషన్లు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని దుయ్యబట్టారు. ఓవైపు ఎండలు మండుతుంటే, మరోవైపు కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలతో ప్రజల గుండెలు మండుతున్నాయని వెల్లడించారు. ఎన్నికల కోసం బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు బీఆర్‌ఎస్ అభ్యర్థిపై సోషల్ మీడియాలో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీకి ఓటు వేస్తే పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టేనని అన్నారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, మాదాసు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు గోపి, సత్యంగౌడ్, వెంకట్‌రెడ్డి, శివకుమార్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పులు ఎక్కడ?

- **90 శాతం వరకు పంపిణీ జరిగిందంటున్న ఈసీ**
- **తమకింతవరకూ అందలేదంటూ ఓటర్ల ఫిర్యాదు**
- **హెల్ప్‌లైన్ యాప్ ద్వారా డౌన్‌లోడ్‌కూ అవకాశం**

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఓటరు స్లిప్పుల పంపిణీలో ఎన్నికల అధికారులు చెప్తున్న లెక్కలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన కుదరడం లేదు. ఇప్పటికే 90 శాతానికి పైగా ఓటరు స్లిప్పుల పంపిణీ జరిగినట్టు అధికారులు చెప్తుండగా.. అనేక ప్రాంతాలు, గ్రామాల్లో నేటి వరకు కూడా అందలేదని ఓటర్లు ఫిర్యాదు చేస్తున్నారు. రాష్ట్రంలో 3.32 కోట్ల మంది ఓటర్లుండగా ఇప్పటికే మూడు కోట్ల స్లిప్పుల పంపిణీ జరిగిందని లెక్కలు చెప్తున్నారు. ఈనెల 4నాటికే జీహెచ్‌ఎంసీ పరిధిలోని చేవెళ్ల లోక్‌సభ పరిధిలో 90 శాతం, మల్కాజిగిరి, సికింద్రాబాద్‌లో 80 శాతం, హైదరాబాద్‌లో 79 శాతం ఓటరు స్లిప్పులు పంపిణీ చేసినట్టు చెబుతున్నారు. కానీ వీటిలో సగం మంది ఇండ్లకు కూడా ఓటరు స్లిప్పులు రాలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. నగరాలు, పట్టణాల్లో మున్సిపల్ సిబ్బంది, బీఎల్‌వోల ఆధ్వర్యంలో, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్, రెవెన్యూ సిబ్బంది ఓటరు స్లిప్పుల పంపిణీ చేసే బాధ్యతను అప్పగిస్తారు. పోలింగ్ తేదీకి ఐదు రోజుల ముందుగానే ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ అధికారులు ఆదేశించారు.

ఇలా డౌన్‌లోడ్ చేసుకోండి

ఓటరు స్లిప్పులు పంపిణీ కాకపోవడంతో ఇతర మార్గాల్లో వాటిని ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలనే దానిపై ఓటర్లు దృష్టి పెడుతున్నారు. సాంకేతికంగా కొంత అవగాహన ఉన్న వారు ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే వెసులుబాటు ఉంది. గుగూల్ ప్లేస్టోర్‌లో ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఓటరు సర్వీసెస్ ఆప్షన్ క్లిక్ చేసి, ఆపై సెర్చ్ ఆప్షన్ మీద క్లిక్ చేయాల్సి ఉంటుంది. అక్కడ మీ మొబైల్ నెంబర్, ఓటరు కార్డు నంబర్, ఓటరు వివరాలు ఏదైనా ఒక దాని వివరాలు ఎంటర్ చేసి మన ఓటరు స్లిప్పును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఓటు వేసేటప్పుడు ఈ స్లిప్పుతో పాటుగా ఆధార్‌కార్డు, ఓటరు కార్డు సహ 12 రకాల గుర్తింపుకార్డుల్లో ఏదైనా ఒకటి చూపించాల్సి ఉంటుంది.

బూర నర్సయ్య.. ప్లాట్లను తిరిగివ్వాలి

ఆందోళనకు దిగిన యజమానులు

పెద్దఅంబర్‌పేట, మే 6: భువనగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ తమ ప్లాట్లు కబ్జా చేశారంటూ యజమానులు ఆందోళనకు దిగారు. సోమవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పసుమాముల గ్రామ రెవెన్యూ పరిధిలో ప్లాట్ల యజమానులు ఆందోళన చేపట్టారు. పసుమాములలోని 106/2 సర్వే నంబర్‌లో బూర నర్సయ్యగౌడ్ మరొకరితో కలిసి గతంలో కొంత భూమి కొనుగోలు చేశారని, దీని పక్కనే ఉన్న 87, 88 సర్వే నంబర్లలో 24 ప్లాట్లను కూడా వారు ఆధీనంలోకి తీసుకొన్నారని యజమానులు ఆరోపించారు. దీనిపై కోర్టుకు వెళ్లడంతో తమను పిలిపించి మాట్లాడారని తెలిపారు. 12 ప్లాట్లను తిరిగి ఇచ్చేస్తామని హామీ ఇచ్చారని, కానీ అప్పుడు.. ఇప్పుడూ అంటూ కాలం గడుపుతూ మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. బూర నర్సయ్య గౌడ్ ఇప్పటికైనా తమకు ప్లాట్లు తిరిగిచ్చి మాట నిలబెట్టుకోవాలని కోరారు.



గాంధీభవన్‌లో పరస్పరం దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ శ్రేణులు

కొట్టుకున్న కాంగ్రెసోళ్లు

గాంధీభవన్‌లో రసాభాస

కార్వాన్, మే 6: గాంధీభవన్‌లో సోమవారం నిర్వహించిన హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమావేశం రసాభాసగా జరిగింది. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి, ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్‌అలీ పార్టీ అభ్యర్థి, నాయకులతో గాంధీభవన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్వాన్ నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడు మాట్లాడేందుకు యత్నించగా వాగ్వాదం చోటు చేసుకున్నది. ఈ సమయంలో తోపులాట జరిగి స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. ఐతే కార్వాన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ అల్ హజారీ తన కుమారుడిని వారించి అందరినీ సముదాయించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

రేవంత్ సర్కార్ కరెంటు కాపలా!

నాలుగు రోజుల కిందట మహేశ్వరం నియోజకవర్గంలోని నందిహిల్స్ చౌరస్తాలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాత్రి వరకు జరిగిన ప్రచారంలో జనంతో పాటు స్థానిక విద్యుత్తు శాఖ సిబ్బంది సైతం అక్కడే ఉన్నారు. కారణం?! కరెంటు ఎప్పుడు పోతుందోనన్న ఆందోళన సాధారణ జనాన్ని మాత్రమే కాదు.. చివరకు విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బందిని సైతం వెంటాడుతున్నది. అందుకే కరెంటు పోగానే వెంటనే పునరుద్ధరించేందుకు నలుగురైదుగురు సిబ్బంది కాపలాగా ఉన్నారు. ‘పాపం.. పార్టీల సభకు పోలీసులు మాత్రమే ఉండేవాళ్లు. ఇప్పుడు కరెంటోళ్లు కూడా ఉంటున్నారు. ఎప్పుడు కరెంటు పోతుందో! కరెంటు పోతే ఎక్కడ మా ఉద్యోగం పోతుందో! అన్న భయంతో కరెంటోళ్లు తమ డ్యూటీ టైం ముగిసినా రాత్రి వరకు ఇక్కడే ఉన్నారు’ అని సబితా ఇంద్రారెడ్డి వ్యాఖ్యానించారు.

రెండు రోజుల కిందట మాజీ మంత్రి హరీశ్‌రావు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీట్‌ది ప్రెస్‌కు హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన వెంటనే బయటికొస్తుండగా ఆయనకు పోలీసులతో పాటు విద్యుత్తుశాఖ యంత్రాంగం కనిపించింది. ‘మేం ఉద్యమంలో ఉన్నపుడు మా వెంట పోలీసోళ్లు కనిపెట్టుకుని ఉండేవాళ్లు. ఇప్పుడేమో విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బంది కూడా ఉంటున్నారు. ఇదెక్కడి విచిత్రం’ అని హరీశ్‌రావు అన్నారు.

- **కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా విచిత్ర పరిస్థితులు**
- **సభలు, రోడ్‌షోల దగ్గర విద్యుత్తు సిబ్బంది మోహరింపు**
- **పోలీసుశాఖకు దీటుగా ప్రచారంలో విద్యుత్తు శాఖ గస్తీ**
- **ఇప్పటికే పలు సభల్లో పవర్‌కట్‌తో సర్కారుకు తలవంపులు**
- **రాష్ట్రంలో కోతలు లేవంటూనే విద్యుత్తుశాఖకు తాఖీదులు**



బడంగ్‌పేటలో కరెంట్ సమస్యలు తలెత్తకుండా కేటీఆర్ మీటింగ్ జరిగే ప్రాంతంలో వేచి ఉన్న విద్యుత్ సిబ్బంది

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 6 (నమస్తే తెలంగాణ): ప్రముఖులు పాల్గొనే సభల్లో సీఆర్పీఎఫ్, పోలీసులు, ఇతర భద్రతాసిబ్బంది పహారా కాస్తుంటారు. కానీ, విచిత్రంగా బీఆర్‌ఎస్ పాల్గొన్న సభల్లో కరెంటు అధికారులు కాపలా కాస్తున్నారు. ఎందుకంటే.. స్వయంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కరెంటు కోతల ప్రభావానికి గురవటం, మంత్రి సీతక్క సమావేశంలో కరెంటు పోవటం, మాజీ మంత్రి మల్లారెడ్డి మీటింగ్‌లో విద్యుత్తు కోతలు ఎదురవటం లాంటి అనేక ఘటనలను ‘నమస్తే తెలంగాణ’ ఫొటోలతో సహా ప్రముఖంగా ప్రచురించింది. కరెంటు కోతలే లేవని చెప్తామనుకున్న సీఎం, మంత్రులకు నమస్తే తెలంగాణ ఆధారాలతో సహా బయటపెట్టేసరికి ఏం మాట్లాడాలో అర్థం కావటం లేదు. దీంతో ఫొటోల వల్ల సమస్య వస్తున్నదని, కరెంటు పోతే వెంటనే సరిచేసేందుకు, ఫొటోలు తీసే అవకాశం ఇవ్వకుండా విద్యుత్తు సిబ్బందిని రంగంలోకి దించింది కాంగ్రెస్ సర్కారు. మొదట్లో ఎస్పీడీసీఎల్ సిబ్బందిని నేరుగా సభలు, రోడ్‌షోల వద్ద ఉంచగా, వాళ్ల ఐడెంటిటీ బయటపడుతున్నదన్న ఉద్దేశంతో వారిని సివిల్ డ్రెస్సుల్లో కాపలా ఉంచుతున్నది. మొత్తానికి కరెంటుకే కాపలా పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లింది. ముఖ్యంగా కరెంటు సరఫరాలో అంతరాయాలు సాధారణంగా మారటంతో విద్యుత్తుశాఖ కాపలా బాధ్యతను భుజాన వేసుకొన్నది. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా అన్ని రాజకీయ పార్టీలు ముమ్మరంగా ప్రచారాన్ని నిర్వహిస్తుండటంతో ఎక్కడ సభలు, సమావేశాలు, రోడ్‌షోలు జరిగినా అక్కడ పోలీసుశాఖ కంటే ముందుగానే విద్యుత్తు సిబ్బంది ప్రత్యక్షమవుతున్నారు. కార్యక్రమాలు ముగిసే వరకు కరెంటు పోకుండా చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరాయంగా, నాణ్యమైన కరెంటును ఇస్తామని చెప్తున్నా, క్షేత్రస్థాయిలో విద్యుత్తుశాఖ అధికారులు పడుతున్న పాట్లు చూస్తుంటే సర్కారు మాటలు నీటిమూటలేనని స్పష్టమవుతున్నది. వేసవిలో ఒకవైపు కరెంటు కోతలు, ఇంకోవైపు నీటి కొరత జనాన్ని వేధిస్తున్నాయి. కానీ ప్రభుత్వం మాత్రం అదేమీ లేదంటూ నిత్యం బుకాయిస్తున్నది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మొదలు.. కాంగ్రెస్ నేతల వరకు కరెంటు కోతలకు బాధితులుగానే మిగిలారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రెప్పపాటు కూడా కరెంటు పోకుండా ఉంటే, ఇప్పుడేమో పరిస్థితి ఇలా ఉందంటూ ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో సర్కారుపై వ్యతిరేకత వచ్చింది. దీనిని కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వ పెద్దలు ఉన్నతాధికారులపై సీరియస్ కావటం, ఆ ప్రభావం కిందిస్థాయి సిబ్బంది వరకు పడింది. కొన్నిరోజుల కిందట మాజీ మంత్రి మల్లారెడ్డి దమ్మాయిగూడలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తుండగా కరెంటు పోవటం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేసి ఏకంగా డీఈఈని సస్పెండ్ చేయటంతో పాటు ఏఈఈకి మెమో జారీ చేశారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల కోసం అన్ని పార్టీలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి. ఎండ తీవ్రత దృష్ట్యా సాయంత్రం నుంచి రాత్రి పది గంటల వరకు ఎక్కువగా సమావేశాలు, రోడ్‌షోలు నిర్వహిస్తున్నాయి. దీంతో ఈ కార్యక్రమాలు ఉన్న చోట విద్యుత్తుశాఖ తమ సిబ్బందికి అదనపు డ్యూటీలు వేస్తున్నది.

ఎమ్మెల్యే కారు ఢీకొని ఒకరి మృతి

- **మరొకరి పరిస్థితి విషమం**
- **ఎమ్మెల్యే కసిరెడ్డికి స్వల్ప గాయం**
- **రంగారెడ్డి జిల్లాలో ఘటన**

కడ్తాల్, (తలకొండపల్లి) మే 6 : కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రయాణిస్తున్న కారును బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నది. తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం... ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం తలకొండపల్లి మండలంలోని వెల్జాల్‌లో కార్నర్ మీటింగ్ ముగించుకొని మిడ్జిల్ మండలం వైపు బయల్దేరారు. ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారు తలకొండపల్లి-మిడ్జిల్ రహదారిపై వెల్జాల్ శివారులోని రామాసిపల్లి మైసమ్మ ఆలయం వద్దకు రాగానే, ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొన్నది. బైక్‌పై ఉన్న తలకొండపల్లి మండలం వెంకటాపూర్‌కు చెందిన పబ్బతి నరేశ్(25) మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన బైరవ పరశురాములు పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. కారులోని ఎయిర్ బెలూన్‌లు తెరచుకోవడంతో ఎమ్మెల్యే, డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. ఎమ్మెల్యే కాలికి గాయమవడంతో కల్వకుర్తిపీహెచ్‌సీలో చికిత్స పొంది, అనంతరం హైదరాబాద్ బయలుదేరారు.

క్షతగాత్రుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పరుశరాములును మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరామర్శించారు. బాధితుడి భార్య మంజులకు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధితుడికి మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తరలించేందుకు చేయూతనందించారు.



మూడు గంటల్లోగా నకిలీ కంటెంట్ తొలగించాలి

రాజకీయ పార్టీలకు ఈసీ ఆదేశం

న్యూఢిల్లీ, మే 6: రాజకీయ పార్టీలకు వారి సోషల్ మీడియా వేదికల్లోని నకిలీ కంటెంట్ గురించి సమాచారం ఇచ్చిన మూడు గంటల్లోగా ఆ కంటెంట్‌ను తొలగించాలని కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఆదేశించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించి కొందరు ప్రముఖ నాయకులు, సెలబ్రిటీల డీప్‌ఫేక్ వీడియోలను వైరల్ చేస్తున్న నేపథ్యంలో ఈసీ ఈ మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన అందరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించింది. కృత్రిమ మేధ(ఏఐ) టూల్స్‌ను దుర్వినియోగం చేయొద్దని హెచ్చరించింది. ఎన్నికల ప్రక్రియ సమగ్రతను కాపాడాలని హితవు పలికింది.

జార్ఖండ్‌లో నోట్ల గుట్టలు

- కాంగ్రెస్ మంత్రి పీఏ పనిమనిషి ఇంట్లో భారీగా డబ్బు స్వాధీనం
- 35 కోట్లు సీజ్ చేసామన్న ఈడీ
- లోక్‌సభ ఎన్నికల వేళ కలకలం

రాంచీ, మే 6: లోక్‌సభ ఎన్నికల వేళ జార్ఖండ్‌లో పెద్దమొత్తంలో నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, కాంగ్రెస్ నేత ఆలంగీర్ ఆలం వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్ లాల్ ఇంట్లో పనిచేసే ఓ వ్యక్తి నివాసంలో సుమారు రూ.35 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వర్గాలు సోమవారం వెల్లడించాయి. రాంచీలోని గడిఖానా చౌక్ ఏరియాలోని మంత్రి పీఏ పనిమనిషి నివాసంలో డబ్బు కట్టలు ఉన్న బ్యాగులను సీజ్ చేశామని పేర్కొన్నది. గ్రామీణాభివృద్ధి శాఖ మాజీ ఇంజినీర్ వీరేంద్ర కుమార్ రామ్‌పై నమోదైన మనీ లాండరింగ్ కేసులో భాగంగా ఈ సోదాలు చేసినట్టు ఈడీ అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై వీరేంద్ర రామ్‌ను ఈడీ గత ఏడాది అరెస్టు చేసింది.

తనకు సమాచారం లేదన్న మంత్రి

తాజా సోదాలపై మంత్రి ఆలంగీర్ ఆలం ను వార్తా సంస్థ పీటీఐ సంప్రదించగా.. దీనిపై తనకు ఎలాంటి అధికారిక సమాచారం లేదని పేర్కొన్నారు. ఈడీ దర్యాప్తు పూర్తి చేసే వరకు ఎవరూ ఎలాంటి నిర్ధారణకు రావొద్దన్నారు. సంజీవ్ లాల్ గతంలో ఇద్దరు మాజీ మంత్రులకు కూడా కార్యదర్శిగా చేశారని పేర్కొన్నారు. హస్తం పార్టీలో కీలక నేతగా ఉన్న ఆలంగీర్ ఆలం ప్రస్తుతం పకూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాగా, పెద్దమొత్తంలో దొరికిన నోట్ల కట్టలను లెక్కించేందుకు ఈడీ అధికారులు తీవ్రంగా శ్రమించారు. ఎనిమిది క్యాష్ కౌంటింగ్ మెషీన్లను ఉపయోగించి 17 గంటల పాటు లెక్కింపు చేపట్టారు. తాజా ఆపరేషన్‌లో భాగంగా ఈడీ మొత్తం ఆరుచోట్ల దాడులు చేసింది. వీటిల్లో రెండు చోట్ల జరిపిన సోదాల్లో రూ.2.93 కోట్లు, రూ.10 లక్షల చొప్పున ఏజెన్సీ రికవరీ చేసింది. కొంత బంగారాన్ని కూడా సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. జార్ఖండ్‌లో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న వేళ తాజా పరిణామం రాజకీయ దుమారం రేపింది. సోదాల్లో దొరికిన సొమ్ముతో కాంగ్రెస్ మంత్రికి ఉన్న సంబంధాలపై బీజేపీ ప్రశ్నలు లేవనెత్తింది. ఆలంగీర్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బాబులాల్ డిమాండ్ చేశారు.

అవినీతిపరులు దోచుకున్న సొమ్ము పేదలకే

న్యాయ సలహా తీసుకుంటున్నా: మోదీ

రాజమహేంద్రవరం: అవినీతిపరులు దోచుకున్న సొమ్మును తిరిగి పేదలకు ఇవ్వడం కోసం న్యాయ సలహా తీసుకుంటున్నానని ప్రధాని మోదీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని వేమగిరిలో జరిగిన ఎన్డీయే ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, జార్ఖండ్‌లోని ఓ వ్యక్తి ఇంటి నుంచి భారీగా నగదును ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. జార్ఖండ్ మంత్రి వద్ద పని చేస్తున్న కార్యదర్శికి పని మనిషి ఇంట్లో ఈ నగదు దొరికింది. ఇటువంటి వ్యక్తులు కాంగ్రెస్ పార్టీలోని ప్రథమ కుటుంబం (గాంధీలు)తో ఎందుకు సన్నిహితంగా ఉంటున్నారోనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కొండంత కరెన్సీ కట్టలు దొరుకుతున్నాయని, వాటిని లెక్కపెట్టలేక కరెన్సీ కౌంటింగ్ యంత్రాలు అలసిపోతున్నాయని అన్నారు. వర్ధన్ల ఇళ్లను నల్లధనాన్ని దాచుకునే గోదాములుగా మార్చారని దుయ్యబట్టారు. ఇప్పటి వరకు ఈడీ రూ.1.25 లక్షల కోట్ల జప్తు చేసిందని, మిగిలిన కేంద్ర దర్యాప్తు సంస్థలు స్వాధీనం చేసుకున్న సొమ్మును కలిపితే ఇది మరింత పెరుగుతుందని చెప్పారు. ఈ సొమ్మును ఎవరి నుంచి దోచుకున్నారో వారికి తిరిగి ఎలా ఇవ్వాలనే అంశంపై న్యాయ సలహా తీసుకుంటున్నానని చెప్పారు. ఇప్పటికే రూ.17,000 కోట్లను నిజమైన యజమానులకు తిరిగి ఇచ్చామన్నారు.

మోదీ.. హామీల అమలేదీ?

లోక్‌సభ ఎన్నికల వేళ ప్రధాని మోదీ సహా బీజేపీ నేతలు 'మోదీ కీ గ్యారెంటీ' అంటూ ప్రచారాన్ని అందుకొన్నారు. అయితే 2014, 2019 ఎన్నికల సమయంతోపాటు అధికారం చేపట్టిన తర్వాత మోదీ ఇచ్చిన హామీలను చాలా వరకు గాలికొదిలేశారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు, రైతుల ఆదాయం రెట్టింపు, పంటలకు కనీస మద్దతు ధర, నల్లధనం వెనక్కి తదితర హామీలు బుట్టి మాటలుగానే మిగిలిపోయాయి. ఇప్పుడు 'మోదీ కీ గ్యారెంటీ' అంటున్న బీజేపీకి.. గతంలో ఇచ్చిన హామీల సంగతేంటి? అని ప్రజల నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపయిందా?
ఏడాదికి 2 కోట్ల చొప్పున ఉద్యోగాలు ఇచ్చారా?
ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో 15 లక్షలు పడ్డాయా?
అందరికీ ఇండ్లు, 24 గంటల విద్యుత్తు ఎక్కడ?
అమలుకు నోచుకోని ఏ ఒక్క వాగ్దానం
ఇప్పుడు 'మోదీ గ్యారెంటీ'లు అంటూ మళ్లీ ప్రచారం



న్యూఢిల్లీ, మే 6: గత రెండు లోక్‌సభ ఎన్నికల సమయంలో, అధికారం చేపట్టిన తర్వాత పలు సందర్భాల్లో కేంద్రంలోని బీజేపీ అనేక హామీలు ఇచ్చింది. ప్రధానంగా 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించింది. దేశంలో నిరుద్యోగ యువతకు ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని గొప్పగా చెప్పింది. విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని దేశానికి వెనక్కి తీసుకొచ్చి, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని ప్రధాని మోదీ ప్రచార సభల్లో ఊదరగొట్టారు. వీటిల్లో ఒక్కటి కూడా అమలు చేసిన పరిస్థితి లేదు.

ఆదాయం కాదు.. ఆత్మహత్యలు రెట్టింపు

ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ హయాంలో వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయింది. 2022 నాటికి దేశంలోని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని 2016 ఫిబ్రవరిలో ప్రధాని హామీ ఇచ్చారు. అయితే ఆదాయం పెరుగుదల విషయం అటుంచితే, దేశంలో అన్నదాతల ఆత్మహత్యలు పెరిగాయి. 2014 నుంచి 2023 వరకు దాదాపు లక్షా 12 వేల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకొన్నారని ఎన్సీఆర్బీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పైగా అన్నదాతల నడ్డివిరిచేలా వివాదాస్పద వ్యవసాయ చట్టాలను మోదీ సర్కార్ తీసుకొచ్చింది. వీటిపై దేశవ్యాప్తంగా రైతులు ఉద్యమం చేపట్టడంతో వాటిని ఉపసంహరించుకున్నది.

మోదీ సర్కార్ ఉపాధి కల్పన తీరు

పదేండ్లలో భర్తీ చేస్తామన్న ఉద్యోగాలు- 20 కోట్లు
ఇప్పటి వరకు భర్తీ చేసిన ప్రభుత్వ ఉద్యోగాలు- 7 లక్షలు
హామీలో భర్తీ చేసిన వాటా- 0.35%

20 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా?

ఏడాదికి 2 కోట్ల చొప్పున ఉద్యోగాలు కల్పిస్తామని 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి పదేండ్లు గడిచినా ఆ హామీ ని నిలబెట్టుకోలేదు. దేశంలో నిరుద్యోగం తారాస్థాయికి చేరింది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువకుల్లో దాదాపు సగం మంది ఉపాధి కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొన్నది.

నల్లధనం వెనక్కు తెచ్చారా?

విదేశీ బ్యాంకుల్లో భారతీయుల నల్లధనం భారీగా మూలుగుతున్నదని, దాన్ని వెనక్కు తీసుకొచ్చి దేశ ప్రజలకు పంచుతామని, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. అయితే ఒక్కరి ఖాతాలో కూడా రూపాయైనా జమ కాలేదు. ఇది బీజేపీ చెప్పిన మరొక ఝూటా మాట అని చెప్పొచ్చు.

బుల్లెట్ రైలు పరుగులు ఎక్కడ?

దేశంలో 2022 నాటికి బుల్లెట్ రైలును అందుబాటులోకి తీసుకొస్తామని 2018 ఫిబ్రవరిలో ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. జపాన్ సహకారంతో ముంబై-అహ్మదాబాద్ మధ్య ఈ రైలును నడుపుతామని ఆర్భాటంగా ప్రకటించారు. అయితే బుల్లెట్ రైలు ఇప్పటికీ పట్టాలెక్కలేదు. గడువును ప్రభుత్వం ఏటికేడు పొడిగించుకుంటూ పోతున్నది. 2026నాటికి బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తుందని ఇటీవల రైల్వే మంత్రి పేర్కొన్నారు.

దారుణంగా దెబ్బతిన్న ఆర్థికం!

2022 నాటికి దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని మోదీ చెప్పుకొచ్చారు. అయితే కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ దారుణంగా తయారైందనే విమర్శలు వస్తున్నాయి. ద్రవ్యోల్బణంతో సామాన్యుడు అతలాకుతలం అవుతున్నాడు. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావం ఇతర వస్తువులపై పడుతున్నది. మరోవైపు అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఎన్నడూ లేని విధంగా అధఃపాతాళానికి పడిపోయింది.

అందరికీ ఇండ్లు.. అందని ద్రాక్షేనా?

2022 నాటికి దేశంలో ప్రతి ఒక్కరి సొంతింటి కల సాకారం అవుతుందని 2018 జూలైలో ప్రధాని మోదీ ప్రకటించారు. అయితే పీఎం ఆవాస్ యోజన కింద ఇండ్ల నిర్మాణం నత్తనడకన సాగుతున్నది. ఈ పథకం కింద 1.2 కోట్ల ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకొన్న కేంద్ర ప్రభుత్వం.. అందులో విఫలమైంది. దీంతో గడువును మరోసారి పెంచింది.

24 గంటల విద్యుత్తు.. పగటి కలే

2022 నాటికి ప్రతి ఇంటికి నిరంతర విద్యుత్తు అందిస్తామని, దేశంలో చీకట్లు పారద్రోలుతామని ప్రధాని మోదీ గతంలో ప్రకటించారు. అయితే ఇచ్చిన హామీ పెండింగ్‌లోనే ఉండిపోయింది. దేశంలో ఇంకా చాలా ఇండ్లకు విద్యుత్తు కనెక్షన్లు లేవు.

నామినేషన్ విత్‌డ్రాకు బీజేపీ ఒత్తిడి

ఆరెస్సెస్ మాజీ ప్రచారక్ ఆరోపణలు

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని తనపై బీజేపీ నేతలు ఒత్తిడి తెచ్చారని ఆరెస్సెస్ మాజీ ప్రచారక్ అభయ్ జైన్ సోమవారం ఆరోపించారు. ఆయన సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, ధన బలం, కండ బలంతో కూడిన రాజకీయాలు లేని ఇండోర్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తాను ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యేలు కైలాశ్ విజయవర్గీయ, రమేశ్ మెండోలా సహా నలుగురు బీజేపీ నేతలు ఏప్రిల్ 27న తనను కలిశారని చెప్పారు. తాను ఎన్నికల్లో పోటీ చేయడాన్ని చూడలేకపోతున్నామని, తిరిగి ప్రచారక్‌గా పని చేయాలని కోరారని చెప్పారు. తాను అందుకు తిరస్కరించానన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి గోవింద్ మలు స్పందిస్తూ ప్రచారం కోసమే ఆయన ఈ విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆరెస్సెస్ మాజీ ప్రచారక్‌లు ఏర్పాటు చేసిన జనహిత్ పార్టీకి గుర్తింపు లభించకపోవడంతో, అభయ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

రెండు గంటలకోసారి పోలింగ్ శాతం వెల్లడి

న్యూఢిల్లీ: లోక్ సభ ఎన్నికల్లో పోలైన ఓట్ల వివరాలను పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు ఒకసారి ప్రకటించనున్నట్లు ఎన్నికల కమిషన్ (ఈసీ) తెలిపింది. దీనికోసం ఈసీకి చెందిన ఓటర్ టర్నవుట్ యాప్‌లో కొత్త ఫీచర్‌ను జత చేసినట్లు పేర్కొంది. ఆ రోజు రాత్రి 7 గంటల వరకు ఈ విధంగా చేయనున్నట్లు వివరించింది. రాత్రి 7 గంటల తర్వాత ఈ కాల పరిమితిని తొలగించి, పోలింగ్ పార్టీలు రావడాన్ని బట్టి నిరంతరం పోలింగ్ సమాచారాన్ని అప్‌లోడ్ చేయనున్నట్లు చెప్పింది.

జ్వలిస్తున్న కర్ణాటక

- రాష్ట్రంలో ప్రకంపనలు రేపుతున్న ప్రజ్వల్ సెక్స్ స్కాండల్ వ్యవహారం
- వీడియోలు బయటకు రావడంతో ఇండ్లు విడిచి వెళ్తున్న బాధితులు
- హెల్ప్‌లైన్ ఏర్పాటుచేసిన ప్రభుత్వం
- బీజేపీ, జేడీఎస్‌పై తీవ్ర వ్యతిరేకత
- లోక్‌సభ ఎన్నికల్లో ప్రభావం



ఇటీవల ఓ ఎన్నికల ప్రచార సభలో ప్రజ్వల్‌తో కలిసి పాల్గొన్న ప్రధాని మోదీ

బెంగళూరు, హసన్, మే 6: జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్ వ్యవహారం కర్ణాటకలో రాజకీయ దుమారం రేపుతున్నది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం మొత్తం సెక్స్ స్కాండల్ చుట్టూనే తిరిగింది. మూడో విడతలో భాగంగా రాష్ట్రంలోని తక్కిన 14 స్థానాలకు సోమవారం ఎన్నికలు జరుగనున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ సీట్లన్నిటినీ బీజేపీ కైవసం చేసుకున్నది. అయితే ప్రజ్వల్ వ్యవహారం నేపథ్యంలో ఈసారి బీజేపీ సీట్లకు భారీగా కోత పడే అవకాశం ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు. సెక్స్ వీడియోల గురించి బీజేపీకి ముందే తెలిసినా జేడీఎస్‌తో పొత్తు కుదుర్చుకోవడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఇది లోక్‌సభ ఎన్నికల్లో ప్రభావం చూపుతుందని కమలనాథులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్రమోదీ సోమవారం ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ప్రజ్వల్ వంటి వారిని ఉపేక్షించే అవకాశమే లేదని చెప్పుకొచ్చారు. ప్రజ్వల్ దేశం విడిచి వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని కాంగ్రెస్ సర్కారును విమర్శించారు. ఇది శాంతిభద్రతలకు సంబంధించిన విషయం అయినందున, దీనిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపైనే ఉంటుందన్నారు.

మాయమవుతున్న బాధితులు

వీడియోల్లో కనిపించిన పలువురు బాధిత మహిళలు ఇండ్ల నుంచి మాయం అవుతున్నారు. కొందరి ఇండ్లకు గత కొన్ని రోజులుగా తాళాలు వేసి కనిపిస్తున్నాయి. తమ గుర్తింపు బయటపడటంతో బాధితులు భయంతో, తమకు కళంకం వస్తుందనే ఆందోళనతో ఇల్లు విడిచి వెళ్లిపోతున్నట్టు తెలుస్తున్నది. దీనిపై హసన్‌కు సమీపంలోని ఓ దుకాణాదారుడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌తో మాట్లాడారు. 'జిల్లా మొత్తం రేవణ్ణ చేతుల్లో ఉంది. వాళ్ల గురించి చెడుగా మాట్లాడితే వారికి వెంటనే తెలిసిపోతుంది. వాళ్ల కుటుంబానికి, పార్టీకి ఇక్కడ చాలా మంది మద్దతుదారులున్నారు' అని అతడు తెలిపారు. ప్రజ్వల్‌పై ఫిర్యాదు చేసిన జెడ్పీ మాజీ సభ్యురాలు ప్రస్తుతం కనిపించకుండా పోయారని ఆమె గ్రామస్థులు చెప్పారు. జేడీ(ఎస్)లో చురుగ్గా పనిచేసిన మహిళా కార్యకర్తలు తాము ప్రజ్వల్‌తో తీసుకున్న ఫొటోలను సోషల్ మీడియా నుంచి తొలగిస్తున్నారు. వారి భర్తలు ప్రజ్వల్‌తో తమ భార్యలకు ఉన్న సంబంధాల గురించి ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో చాలా మంది మహిళల జీవితాలను సెక్స్ స్కాండల్ వీడియోలు అభద్రతలో పడేశాయి' అని జేడీఎస్ స్థానిక నాయకుడు ఒకరు చెప్పారు. రేవణ్ణ కుటుంబంతో ఒక కేసులో పోరాడుతూ హసన్‌లో బతకడం అసాధ్యమని ఒక దుకాణదారుడు వ్యాఖ్యానించారు.

రేవణ్ణ ఇంట్లో తనిఖీలు

ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) బెంగళూరులోని బసవనగుడిలో గల మాజీ ఎమ్మెల్యే, ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ ఇంట్లో సోమవారం తనిఖీలు నిర్వహించి కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకొంది. తనిఖీల సమయంలో తనను ఇంట్లోకి అనుమతించకపోవడంపై రేవణ్ణ తరపు న్యాయవాది గోపాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తనిఖీలు ఏక పక్షంగా సాగాయని విమర్శించారు. మరోవైపు ప్రజ్వల్ స్వదేశానికి త్వరలో తిరిగి రావొచ్చనే అంచనాల నేపథ్యంలో బెంగళూరు విమానాశ్రయం వద్ద భద్రత సిబ్బంది అప్రమత్తం అయ్యారు.

హెల్ప్‌లైన్ ప్రారంభించిన సిట్

హసన్ ఎంపీ ప్రజ్వల్ లైంగిక దాడి కేసులో బాధితుల కోసం హెల్ప్ లైన్(6360938947) ప్రారంభించినట్టు సిట్ అధిపతి బీకే సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు తమ ఆఫీసుకు రావాల్సిన అవసరం లేదని.. తామే వ్యక్తిగతంగా వారిని కలుస్తామని స్పష్టం చేశారు. ప్రజ్వల్ కొందరు మహిళను లైంగికంగా వేధిస్తున్న వీడియోలను ప్రజలెవరూ షేర్ చేయొద్దని ఆయన హెచ్చరించారు. ఇలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీడియోలు షేర్ చేయడం వల్ల బాధితుల పరువు, గౌరవం దెబ్బ తింటాయని తెలిపారు.

సూరత్ అభ్యర్థిని బలపరచినవారిపై కాంగ్రెస్ ఫిర్యాదు

సూరత్, మే 6: గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌ను బలపరచినవారిపై ఆ పార్టీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ అభ్యర్థి నీలేష్ కుంభనిని బలపరుస్తూ ముగ్గురు వ్యక్తులు ఆయన నామినేషన్‌పై సంతకాలు చేశారు. అయితే ఆ సంతకాలు తమవి కాదని, తమ సంతకాలను ఫోర్జరీ చేశారని వీరు ఆరోపించడంతో నీలేష్ నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. ఈ నేపథ్యంలో సూరత్ కాంగ్రెస్ లీగల్ సెల్ సోమవారం సూరత్ పోలీస్ కమిషనర్ అనుపమ్ సింగ్ గహ్లోత్‌కు ఫిర్యాదు చేసింది. రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ సౌరభ్ పర్ధిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరింది. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నామని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడం, మిగిలిన అభ్యర్థులు నామినేషన్లు విత్‌డ్రా చేసుకోవడంతో సూరత్‌లో బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే.

నేడే మూడో విడత

- 11 రాష్ట్రాల్లోని 93 స్థానాలకు పోలింగ్
- బీజేపీకి ప్రతిష్ఠాత్మకంగా మారిన ఎన్నికలు
- గత ఎన్నికల్లో ఇవే స్థానాల్లో మెజార్టీ సీట్లు కైవసం
- ప్రజ్వల్ వ్యవహారం, రాజ్‌పుత్‌ల వ్యతిరేకతతో ఈ సారి భారీగా సీట్లకు కోతపడే అవకాశం



బెంగాల్‌లో ట్రాక్టర్‌పై ఎన్నికల సామగ్రి తరలింపు

అహ్మదాబాద్/బెంగళూరు, మే 6: మూడో విడత లోక్‌సభ ఎన్నికల సంగ్రామానికి సర్వం సిద్ధమైంది. 11 రాష్ట్రాల్లోని 93 నియోజకవర్గాలకు మంగళవారం ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తం 1300 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, జ్యోతిరాదిత్య సింధియా, మన్సుఖ్ మాండవీయ, పురుషోత్తం రూపాలా, ప్రహ్లాద్ జోషీతోపాటు అఖిలేశ్‌యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్, శివరాజ్‌సింగ్ చౌహాన్, దిగ్విజయ్ సింగ్, సుప్రియాసూలే తదితర ప్రముఖుల భవితవ్యాన్ని ఓటర్లు నిర్దేశించనున్నారు. గుజరాత్‌లో ఇండోర్ స్థానాన్ని బీజేపీ ఏకగ్రీవం చేసుకోగా, తక్కిన 25 స్థానాలకు ఈ విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. అలాగే మహారాష్ట్రలో 11, యూపీ 10, కర్ణాటక 14, మధ్యప్రదేశ్ 9, ఛత్తీస్‌గఢ్ 7, బీహార్ 5, అస్సాం, పశ్చిమబెంగాల్‌లో నాలుగు చొప్పున, గోవా 2, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూలో ఒక్కో స్థానం చొప్పున స్థానాలకు ఈ దశలో పోలింగ్ జరుగనున్నది. మూడో దశ తర్వాత మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు గానూ 283 స్థానాలకు ఓటింగ్ పూర్తవుతుంది.

బీజేపీకి పరీక్ష

మూడో విడత ఎన్నికలు బీజేపీకి కీలకంగా మారనున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ మెజార్టీ సీట్లు సాధించిన గుజరాత్, కర్ణాటక, బీహార్, మధ్యప్రదేశ్ లోక్‌సభ స్థానాలకు ఈ దశలోనే ఎన్నికలు జరుగనున్నాయి. ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్‌స్కాండల్ ఆరోపణలు, గుజరాత్‌లో బీజేపీపై రాజ్‌పుత్‌ల ఆగ్రహం నేపథ్యంలో బీజేపీకి ఈ దశ ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగలే అవకాశం ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు. కర్ణాటకలో ఈ విడత ఎన్నికలు జరిగే 14 సీట్లనూ గత ఎన్నికల్లో బీజేపీ కైవసం చేసుకున్నది. అయితే ప్రజ్వల్ వ్యవహారం నేపథ్యంలో ఈసారి సీట్లకు భారీ కోత పడే అవకాశం ఉన్నది. గత ఎన్నికల్లో గుజరాత్‌లో బీజేపీ క్లీన్‌స్వీప్ చేయగా, ఈసారి రాజ్‌పుత్‌ల వ్యతిరేకత ఆ పార్టీ విజయావకాశాలను దెబ్బతీయొచ్చని విశ్లేషకులు అంటున్నారు.

బీజేపీ అభ్యర్థులకు రైతుల సెగ

- పంజాబ్‌లో ప్రచారాన్ని అడ్డుకుంటున్న అన్నదాతలు
- డిమాండ్లపై ఎక్కడికక్కడ నిలదీత
- జోక్యం చేసుకోవాలని ఈసీకి బీజేపీ ఫిర్యాదు



అజ్నాలాలో బీజేపీ అభ్యర్థికి నిరసన తెలుపుతున్న రైతు సంఘాల సభ్యులు(ఫైల్)

పటియాలా, మే 6: పంజాబ్‌లో బీజేపీ అభ్యర్థులకు, నాయకులకు రైతుల నుంచి పెద్ద ఎత్తున నిరసన సెగ ఎదురవుతున్నది. బీజేపీ ఎన్నికల ప్రచారం ఎక్కడ ఉంటే.. అక్కడ నల్ల జెండాలతో రైతులు నిరసనకు దిగుతున్నారు. తమ డిమాండ్లపై బీజేపీ అభ్యర్థుల్ని అన్నదాతలు నిలదీస్తున్నారు. అయితే.. రైతుల పేరుతో ఆప్, ఎస్ఏడీ (శిరోమణి అకాలీదళ్), కాంగ్రెస్ పార్టీలు బీజేపీ ప్రచారాన్ని అడ్డుకుంటున్నాయని, తమ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని పంజాబ్ బీజేపీ చీఫ్ సునీల్ జాఖర్ ఆరోపిస్తున్నారు. దీనిపై బీజేపీ నాయకుల బృందం సోమవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసింది. స్వేచ్ఛగా ప్రచారం చేసుకునే తమ హక్కును కాలరాస్తున్నారని ఈసీకి ఒక మెమోరాండం సమర్పించింది. ఆప్ సహా ఇతర ప్రతిపక్ష పార్టీలు ఒక్కటై బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని బలవంతంగా నిలిపివేస్తున్నారని జాఖర్ ఆరోపించారు. బలవంతంగా తమ ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకోవటం ఘర్షణలు, హింసకు దారితీస్తున్నదని తెలిపారు. ఈ అంశంపై ఈసీ జోక్యం చేసుకోవాలని కోరారు.

పటియాలాలో రైతు హత్య.. బీజేపీ నేతపై ఎఫ్ఐఆర్

పటియాలా లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి ప్రణీత్ కౌర్‌కు వ్యతిరేకంగా నిరసన దిగటాన్ని సహించలేని కొంతమంది ఓ రైతు ప్రాణాల్ని బలితీసుకున్నారు. మే 4న జరిగిన ఈ ఘటనలో పోలీసులు అక్కడి బీజేపీ నేత హర్విందర్ సింగ్ హర్పాల్‌పూర్‌పై కేసు నమోదుచేశారు. ఈ ఘటనపై స్పందించిన 'కిసాన్ మజ్దూర్ మోర్చా', బీజేపీ నేత హర్పాల్‌పూర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. లేదంటే బుధవారం ప్రణీత్ కౌర్ ఇంటి ముందు రైతులు నిరసనకు దిగుతారని హెచ్చరించింది.

సీఎం కేజ్రీవాల్‌పై ఎన్ఐఏ కేసు!

మొదటిపేజీ తరువాయి...

సోమవారం వెల్లడించాయి. లోక్‌సభ ఎన్నివేళ మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే అంశాన్ని మంగళవారం పరిగణనలోకి తీసుకొంటామని సుప్రీంకోర్టు గత వారం చెప్పిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. దేవేంద్ర పాల్ భుల్లార్‌ను విడుదల చేయడంలో సహకరించేందుకుగానూ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీకి తీవ్రవాద ఖలిస్థానీ గ్రూపుల నుంచి రూ.133 కోట్ల మేర ఫండింగ్ వచ్చిందనే ఫిర్యాదు గవర్నర్‌కు అందిందని లేఖలో పేర్కొన్నారు. ఫిర్యాదుదారు సమర్పించిన ఎలక్ట్రానిక్ ఆధారాలపై ఫోరెన్సిక్ పరీక్షతోపాటు దర్యాప్తు జరుపాలని సక్సేనా లేఖలో కోరినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

రూ.133 కోట్ల ఫండింగ్ ఆరోపణలు

వరల్డ్ హిందూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి అశూ మోంగియా నుంచి ఏప్రిల్ 1న సక్సేనాకు ఫిర్యాదు అందిందని హోంశాఖకు రాసిన లేఖలో ఎల్జీ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. 2014-2022 మధ్య ఖలిస్థాన్ గ్రూపుల నుంచి ఆప్ రూ.133 కోట్ల నిధులు అందుకొన్నదని ఆరోపిస్తూ ఖలిస్థాన్ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ విడుదల చేసిన ఓ వీడియోను ఫిర్యాదుదారు ప్రస్తావించారని తెలిపారు. ఫిర్యాదుదారు ఆరోపణల తీవ్రత నేపథ్యంలో ఈ అంశంపై ఎన్ఐఏతో సమగ్ర దర్యాప్తునకు ఎల్జీ సిఫారసు చేశారని అందులో పేర్కొన్నారు. 2014 కెనడా, అమెరికా పర్యటన సమయాల్లో కేజ్రీవాల్ పలువురు ఖలిస్థానీ నేతలతో అంతర్గత చర్చలు జరిపారని, ఆ సమావేశాల్లో భుల్లార్‌ను విడుదలయ్యేలా చూస్తామని వాళ్లకు హామీ ఇచ్చారని ఎల్జీకి చేసిన ఫిర్యాదులో ఆరోపించారు.



ఎవరీ దేవేంద్ర భుల్లార్?

1993లో జరిగిన ఢిల్లీ బాంబు పేలుడులో తొమ్మిది మంది మృతి చెందిన కేసులో దోషిగా తేలిన భుల్లార్ ప్రస్తుతం అమృత్‌సర్ సెంట్రల్ జైల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. భుల్లార్‌ను ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా 2015 జూన్‌లో తీహార్ జైలు నుంచి అమృత్‌సర్ సెంట్రల్ జైలుకు మార్చారు. 2023 డిసెంబర్‌లో భుల్లార్ ముందస్తు విడుదలను ఢిల్లీ ప్రభుత్వ శిక్షా సమీక్షా బోర్డు తిరస్కరించింది. భుల్లార్ కేసు ముందస్తు విడుదలకు అర్హమైనది కాదని, అలాంటి వ్యక్తి విడుదల అయితే దేశ సమగ్రత, సార్వభౌమాధికారానికి భంగం కలుగుతుందని బోర్డు అభిప్రాయపడినట్టు మీటింగ్ మినిట్స్ పేర్కొన్నది.

బీజేపీకి ఓటమి భయం: ఆప్

తాజా పరిణామాలపై ఆప్ తీవ్రంగా స్పందించింది. బీజేపీ సూచన మేరకు కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా మరో కుట్ర జరుగుతున్నదని ఆ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. 'వాళ్లకు(బీజేపీ) లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకొన్నది. ఢిల్లీలోని ఏడు సీట్లలో పరాజయం ఖరారైంది' అని అన్నారు. ఎల్జీ సక్సేనా అధికార బీజేపీకి ఏజెంట్‌గా మారారని తీవ్ర విమర్శలు చేశారు. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ బీజేపీ ఈ విధమైన కుట్ర పన్నిందని పేర్కొన్నారు. 'ఎన్నికల వేళ వార్తల్లో హెడ్‌లైన్స్ సృష్టించాలని ఎల్జీ సాబ్ ప్రయత్నిస్తున్నారు. రాజ్యాంగబద్ధమైన గవర్నర్ కార్యాలయాన్ని ఇది దుర్వినియోగం చేయడమే. ఇదే విషయంలో ఉన్నత స్థాయి జరిపించాలని కోరుతూ దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు రెండేండ్ల క్రితం కొట్టివేసింది. జగదీశ్ శర్మ అనే వ్యక్తి వేసిన పిల్ పూర్తిగా పనికిమాలినదని న్యాయమూర్తులు స్పష్టం చేశారు' అని భరద్వాజ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

మధ్యంతర బెయిల్‌పై నేడు నిర్ణయం!

మద్యం పాలసీ కేసులో అరెస్టయిన కేజ్రీవాల్‌కు లోక్‌సభ ఎన్నికల వేళ మధ్యంతర బెయిల్ మంజూరుపై సుప్రీంకోర్టు మంగళవారం నిర్ణయం తీసుకోనున్నది. మిగతా దశల లోక్‌సభ ఎన్నికల్లో కేజ్రీవాల్ పాల్గొంటారా? లేదా? అనేది న్యాయస్థానం తీర్పుపై ఆధారపడి ఉన్నది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై ఉత్తర్వులు జారీ చేయనున్నది.

‘విక్టోరియా హోం’పై సీఎంవో నజర్!

- ‘నమస్తే తెలంగాణ’ కథనాలపై ఆరా..
- పూర్వ విద్యార్థుల ఫిర్యాదుపై విచారణకు ఆదేశాలు
- అంశాల వారీగా ఎంక్వయిరీ చేయాలని హుకుం
- నేడు హోమ్‌కు విచ్చేయనున్న అధికారుల బృందం
- సీఎంవోనుంచి సందర్శించిన హానరరీ సెక్రటరీ



నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, మే6 (నమస్తే తెలంగాణ): విక్టోరియా మెమోరియల్ హోమ్ రెసిడెన్షియల్ స్కూల్ సూపరింటెండెంట్‌పై వెల్లువెత్తుతున్న ఆరోపణలపై ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేక దృష్టి సారించింది. సంపూర్ణ విచారణకు స్కూల్ ఉన్నతాధికారులకు సీఎంవో కార్యాలయ అధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని సమాచారం. విద్యార్హతలు లేకున్నా ప్రమోషన్లను పొంది, 35 ఏళ్లుగా ఒకే చోట విధులు నిర్వర్తిస్తూ, అనుమతులేకుండా విదేశీ పర్యటనలు చేస్తుండడమేగాక, హోంలోని నిజాం సంపదను పక్కదారి పట్టిస్తున్నారని హోం సూపరింటెండెంట్‌పై 20 రోజుల క్రితమే పూర్వవిద్యార్థులు సీఎంవో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై ‘నమస్తే తెలంగాణ’లో ‘విక్టోరియా హోంలో నయా రూల్’ పేరిట ప్రత్యేక కథనాలను ప్రచురించింది. ఈ నేపథ్యంలో సీఎంవో ప్రత్యేక దృష్టిని సారించి సమగ్ర విచారణ జరపాలని నిర్ణయించినట్టు విశ్వసనీయ సమాచారం.

ప్రతీ అంశంపై ఎంక్వయిరీ!

వీఎం హోమ్ సూపరింటెండెంట్‌పై పూర్వ విద్యార్థులు చేసిన ఆరోపణలపై విచారణ చేయాలని సీఎంవో హోం ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. హోమ్ సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి ఉద్యోగ అర్హతలు, పాస్‌పోర్ట్ తనిఖీ, పదోన్నతులు? వాటికి అధికారికంగా అనుమతులున్నాయా? లేవా? హోంలోని నిజాంసంపద తదితర అంశాలపై ఆరా తీయాలని ఉన్నతాధికారులకు సీఎంవో ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. సెలవులో ఉన్న సూపరింటెండెంట్‌ను కూడా హుటాహుటిన రావాలని ఆదేశించినట్టు సమాచారం. నేడు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా హోమ్‌కు వచ్చి విచారణ చేపట్టనున్నట్టు తెలిసింది.

హోమ్‌ను సందర్శించిన హానరరీ సెక్రటరీ

పూర్వ విద్యార్థుల ఫిర్యాదు, పత్రికల్లో కథనాల నేపథ్యంలో వీఎం హోం రెసిడెన్షియల్ స్కూల్ హానరరీ సెక్రటరీ కిషన్ సోమవారం ఉదయం హోంను సందర్శించారు. హోం సూపరింటెండెంట్ సెలవులో ఉండటంతో హోం ప్రిన్సిపాల్‌తో పాటు, ఇతర సిబ్బందితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. లాకర్స్, రిజిస్టర్‌పై సిబ్బంది మధ్య కొనసాగుతున్న వాదనలపై ఆరా తీశారు. పర్మనెంట్ రిజిస్టర్ ఎవరి వద్ద ఉంది? తదితర అంశాలపై విచారించగా సిబ్బంది తమకేమీ సంబంధం లేదని తప్పించుకునే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. పూర్తిస్థాయి వివరాలను అందించాలని ఆదేశించినట్టు సమాచారం.



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం ఏఎంసీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ధాన్యం కొంటలేరని రైతుల ఆందోళన

కేసముద్రం మార్కెట్‌లో ఘటన

కేసముద్రం, మే 6: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఆరు బయట ఉన్న ధాన్యం, మక్కజొన్న కొనుగోలు చేయడం లేదని రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. యాసంగిలో సాగుచేసిన ధాన్యం చేతికంది వస్తుండటంతో విక్రయానికి తీసుకొచ్చి మార్కెట్లోని షెడ్లలో, ఆరు బయట మక్కజొన్న, ధాన్యాన్ని రాశులుగా పోశారు. వ్యాపారులు షెడ్డులో ఉన్న ఉత్పత్తులకే ఈ నామ్ టెండర్ వేసి, మిగిలిన వాటికి వేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు ఏఎంసీ ఎదుట ఆందోళనకు దిగారు. ఆరు బయట ఉన్న వాటిని ముందుగా కొనుగోలు చేయాల్సిన వ్యాపారులు షెడ్లలో ఉన్న వాటిని కొనుగోలు చేయడమేంటని ప్రశ్నించారు. మార్కెట్ కార్యదర్శి అమరలింగేశ్వరరావు స్పందిస్తూ, రేపు ఆరు బయట ఉన్న వాటికి టెండర్ వేయిస్తామని తెలుపడంతో రైతులు ఆందోళన విరమించారు.

గాంధీలో 11 ఏండ్ల బాలికకు అరుదైన చికిత్స

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ): ప్రపంచవ్యాప్తంగా ఐదు లక్షల మందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధికి హైదరాబాద్ గాంధీ దవాఖాన వైద్యులు చికిత్స చేసి ఓ బాలిక ప్రాణాలను రక్షించారు. సూపరింటెండెంట్ రాజారావు, పీడియాట్రిక్ విభాగాధిపతి నాగార్జున సోమవారం ఈ వివరాలను వెల్లడించారు. కర్ణాటకలోని నాందేడ్‌కు చెందిన 11 ఏండ్ల బాలిక కొంతకాలంగా నియంత్రణలోకి రాని రక్తపోటు, తలనొప్పి, మైకం,వాంతులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు ఇటీవల గాంధీ దవాఖానకు తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు ఆమె ‘బైలేటరల్ అడ్రినల్ ఫియోక్రోమోసైటోమా’అనే వ్యాధితో బాధపడుతున్నట్టు నిర్ధారించారు. ఇది బాల్యం నుంచే ‘అడ్రినల్ మెడుల్లా’ నుంచి ఉత్పన్నమయ్యే అసాధారణ కణితి అని తెలిపారు. ల్యాప్రోస్కోపిక్ ద్వారా కణితిని విజయవంతంగా తొలగించినట్టు తెలిపారు. చికిత్సకు కార్పొరేట్‌లో రూ.15 లక్షలవరకు ఖర్చవుతుందన్నారు.

ఈ నెల 13, జూన్ 4న పెయిడ్ హాలీడేస్:సీఎస్

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికలు, కంటోన్మెంట్ ఉపఎన్నిక నేపథ్యంలో ఈ నెల 13న ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు, ఫలితాల విడుదల రోజైన జూన్ 4న కౌంటింగ్ విధుల్లో ఉన్న సిబ్బందికి, కౌంటింగ్ నిర్వహిస్తున్న విద్యాలయాలు, కాలేజీల సిబ్బందికి వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం వెల్లడించారు. ఈ మేరకు కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సమాచారహక్కు అధికారుల మార్పు

హైదరాబాద్, మే 6(నమస్తే తెలంగాణ): రోడ్డు రవాణా, భవనాల(ఆర్‌అండ్‌బీ) శాఖలోని సమాచారహక్కు అధికారుల్లో స్వల్ప మార్పులు చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కొత్త నియామకాల ప్రకారం ఆర్‌అండ్‌బీ శాఖ సంయుక్త కార్యదర్శి ఎస్ హరీశ్, అదనపు కార్యదర్శి టీ రామస్వామి, ఉప కార్యదర్శి వై శోభారాణి మొదటి అప్పిలేట్ అథారిటీగా వ్యవహరిస్తారు. వీరితో పాటు ఆర్ శ్రీనివాస్, కే నాగేశ్వరరావు, పీ ప్రసన్నలక్ష్మి, ఆర్ శోభన్‌బాబు, ఎం సంధ్యారాణి పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లుగా, మరో 17 మందిని సహాయక పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులుగా నియమించారు.

51% ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇవ్వాలి

- సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలుచేయాలి
- పీఆర్సీ కమిటీతో భేటీలో టీఎన్జీవో నేతలు



బీఆర్కేభవన్‌లో పీఆర్సీ కమిటీ చైర్మన్ ఎన్ శివశంకర్, సభ్యుడు రామయ్యతో టీఎన్జీవో నేతలు

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ) : వేతన సవరణలో భాగంగా 51శాతం ఫిట్‌మెంట్‌తో నూతన పీఆర్సీని ప్రకటించాలని టీఎన్జీవో కేంద్రం సంఘం కోరింది. 2023 జూలై 1 నుంచి నూతన పీఆర్సీని అమలుచేయాలని, 33.67 శాతం కరువుభత్యంతో కలిపి అందజేయాలని విజ్ఞప్తి చేసింది. పీఆర్సీ కమిటీ ఆహ్వానం మేరకు టీఎన్జీవో కేంద్రం సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం బీఆర్కేభవన్‌లో పీఆర్సీ కమిటీ చైర్మన్ ఎన్ శివశంకర్, సభ్యుడు రామయ్యతో చర్చించింది. ఉద్యోగుల కనీసం వేతనం రూ. 35వేలు, గరిష్ఠ వేతనం రూ. 2,99,100గా ఖరారు చేయాలని టీఎన్జీవో నేతలు కోరారు. సీపీఎస్‌ను రద్దుచేసి, పాత పింఛను విధానం(ఓపీఎస్)ను కొనసాగించాలని విజ్ఞప్తిచేశారు. హెచ్‌ఆర్‌ఏ జీహెచ్‌ఎంసీలో 27శాతం, 2లక్షలకు పైగా జనాభా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్లలో 18.5శాతం, 50వేల కంటే ఎక్కువగా ఉంటే 14శాతం, మిగతా ప్రాంతాల్లో 11.5శాతం చెల్లించాలని, ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీంను 5,10,15,20,25 ఏండ్లకు ఇవ్వాలని, కనీస పెన్షన్‌ను రూ.9,500 నుంచి రూ. 17,500లకు పెంచాలని, రిటైర్మెంట్ గ్రాట్యుటీ రూ.116 లక్షల నుంచి రూ.24 లక్షలకు పెంచాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లు చనిపోతే దహనఖర్చుల కింద రూ. 75 వేలు ఇవ్వాలని, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ స్కేళ్లను ధరల ఆధారంగా పెంచాలని పలు ప్రతిపాదనలను పీఆర్సీ కమిటీ ముందుంచారు. ఈ భేటీలో టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ముజీబ్ హుస్సేని, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కొండల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు.



రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న రైల్వే లైన్ భూనిర్వాసితులు

భూ నిర్వాసితులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

వేములవాడలో ప్లకార్డులతో నిరసన

వేములవాడ, మే 6: కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్‌లో భూములు కోల్పోతున్న కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు నిత్యాన్న సత్రం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. రాజన్న ఆలయానికి అర కిలోమీటర్ దూరంలో రైల్వేస్టేషన్ ఏర్పాటు, రైల్వే లైన్ పోతుండడంతో 178 ఎకరాల స్థలాన్ని అధికారులు సేకరిస్తురని చెప్పారు. ఎకరానికి రూ.34లక్షలు ఇస్తే తాము నష్టపోతామని వాపోయారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ ప్రధానికి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

వైద్యసిబ్బందిపై దాడి హేయం

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): కోరుట్ల ప్రభుత్వ దవాఖానలో వైద్యులు, సిబ్బందిపై రోగి బంధువులు దాడి చేయడంపై పలు వైద్య సంఘాలు, నర్సింగ్ అసోసియేషన్లు ఖండించాయి. హెల్త్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం కోరుట్ల దవాఖానను సందర్శించి వైద్యసిబ్బందిని పరామర్శించారు. ఈ నెల 8న ‘చలో కోరుట్ల’ నిర్వహించనున్నట్టు తెలిపారు. నిందితులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు టీజీజీడీఏ, ఈఎస్‌ఐ వైద్యుల సంఘాలు తెలిపాయి. ఇలాంటి ఘటనల వల్ల వైద్యులు, వైద్య సిబ్బంది ఆత్మస్థైర్యం దెబ్బతింటుందని తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరింది.

బడికి డుమ్మా కుదరదిక

మొదటిపేజీ తరువాయి...

రోజు నుంచే ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని అమలుచేయనున్నది. స్మార్ట్‌ఫోన్, ట్యాబ్‌లలో యాప్ ను ఇన్‌స్టాల్ చేసి, కెమెరా ఆధారంగా స్కాన్ చేయగానే హాజరు నమోదు చేయడం దీని ప్రత్యేకత. గతంలో టీచర్లకు నిరుడు 19,200 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఇటీవలే 4జీ జియో సిమ్‌కార్డులను కూడా అందజేశారు. ఆయా సిమ్‌కార్డులను ట్యాబ్‌లలో యాక్టివేట్ చేయాలని ఆదేశాలిచ్చారు.

సంతకాలు పెట్టడం కుదరదిక..

ఒక విద్యార్థి ఒకట్రెండు రోజులు బడికి రాకపోతేనే ఎందుకురాలేదని అడిగే రోజులివి. కానీ ఇలా అడగాల్సిన కొంత మంది టీచర్లు ఇష్టానుసారంగా విధులకు డుమ్మా కొడుతున్నారు. నిరుడు జగిత్యాల జిల్లాలో ఓ టీచర్ ఏకంగా 20 ఏండ్ల పాటు విధులకు డుమ్మాకొట్టిన ఘటన వెలుగుచూసింది. ఇక 2021లో 153 మంది టీచర్లు ఏడాది నుంచి 8 ఏండ్లు పత్తాలేకుండా పోయినట్టు తెలిసింది. హైదరాబాద్‌లోని కొందరు టీచర్లు దుబాయ్, సౌదీ వంటి దేశాల్లో టీచర్లుగా పనిచేస్తున్నట్టు అధికారుల విచారణలో తేలినట్టు సమాచారం. ఇక మారుమూల ప్రాంతాల్లోని బడుల్లో ఇద్దరు టీచర్లు ఉంటే రోజుకు ఒకరు చొప్పున వంతులేసుకున్న ఘటనలు వెలుగుచూశాయి. తాజా హాజరు విధానంతో ఇలాంటి వాటికి చెక్‌పెట్టవచ్చని అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. టీచర్ల హాజరు నమోదుకు ఇంతకాలం రిజిష్టర్లు వాడేవారు. కొందరు టీచర్లు విధులకు హాజరుకాకున్న తాపీగా మరుసటి రోజు వచ్చి సంతకాలు పెట్టేవారు. కానిప్పుడు ఇలాంటివి ఈ విధానంతో కుదరడం కష్టమేనన్న స్పష్టంగా తెలుస్తున్నది.

అమలు ఇలా..

- స్కూళ్లకు అందజేసిన ట్యాబ్ / స్మార్ట్‌ఫోన్లల్లో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్‌ఆర్‌ఎస్)ను ఇన్‌స్టాల్ చేస్తారు.
- మొదట బడుల వారీగా టీచర్ల రిజిస్ట్రేషన్‌ను చేపడుతారు. ఇందులోభాగంగా వ్యక్తిగత చిత్రాలు (ఫొటోలను) యాప్‌లో లోడ్‌చేస్తారు.
- టీచర్ స్మార్ట్‌ఫోన్/ ట్యాబ్ కెమెరాను తెరిచి, స్కాన్ చేయగానే ఎఫ్‌ఆర్‌ఎస్ అప్లికేషన్, కాగ్నిటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించి, డాటాబేస్‌లో ఉన్న చిత్రాలతో పోల్చుకుంటుంది.
- ఆయా ముఖాల (చిత్రాల) ఆధారంగా ఆ రోజు ఎంత మంది హాజరయ్యారో, ఎంత మంది గైర్హాజరయ్యారో అప్పటికప్పుడే తేల్చేస్తుంది.
- ఇది జియోగ్రాఫికల్ లోకేషన్ కూడా గ్రహిస్తుంది. టీచర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంది.

పురిటిలోనే పసికందు మృతి

- డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమంటూ బాధితుల నిరసన

గద్వాల అర్బన్, మే 6: పురిటిలోనే పసికందు మృతి చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చోటు చేసుకున్నది. బాధితుల కథనం మేరకు.. గట్టు మండలం బోయాలగూడెంకు చెందిన సుజాత పురిటి నొప్పులు రావడంతో సోమవారం ప్రభుత్వ దవాఖానకు తీసుకురాగా ప్రసవ సమయంలో పసికందు మృతి చెందింది. దీంతో బంధువులు వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ దవాఖాన ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ‘ఈ నెల 1న దవాఖానకు వస్తే ఇంకా నొప్పులు రాలేదు కదా.. ఇప్పుడే ఎందుకు వచ్చావ్.. స్కానింగ్ తీసుకుని రావాలి అని చెప్పి పంపించారు. మళ్లీ 3వ తేదీన వస్తే పట్టించుకోలేదు. ఇప్పుడు ప్రసవ సమయంలో మృతి చెందిందని చేతులు దులుపుకుంటున్నారు’ అని వాపోయారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దవాఖానకు చేరుకొని వైద్యులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళకు రక్తపోటు అధికంగా ఉండడడంతో పురిటిలోనే శిశువు మృతి చెందిందని దవాఖాన సూపరింటెండెంట్ కిశోర్ కుమార్ వెల్లడించారు.



జన్నారం చెత్తకుప్పలో దొరికిన పసిపాప

ఎవరిదీ ‘పాప’ం

చెత్తకుప్పలో దొరికిన పసికందు

జన్నారం, మే 6: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొనకల్‌లోని శ్రీలంక కాలనీలోగల చెత్తకుప్పలో ఓ పసికందు కనిపించింది. సోమవారం సాయంత్రం 6 గంటలకు చెత్తకుప్పలో నుంచి పాప ఏడుపులు వినిపించాయి. అదే కాలనీకి చెందిన ఓ యువకుడు గుర్తించి వెంటనే పోలీసుకు సమాచారం అందించాడు. పోలీసులు అక్కడికి చేరుకొని పాపను స్థానిక పిల్లల దవాఖానకు తరలించి వైద్యం అందించారు. ప్రస్తుతం పాప పరిస్థితి బాగానే ఉన్నట్లు డాక్టర్ తెలిపారు. లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్‌ఐ రాజవర్ధన్ సూచన మేరకు పాపను మంచిర్యాలలోని సమగ్ర శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. చెత్తకుప్పలో పసికందు లభ్యమవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పుట్టిన బిడ్డను చూసుకోకుండానే..

తీవ్ర రక్తస్రావంతో బాలింత మృతి

మంచిర్యాల ఏసీసీ, మే 6 : నవమాసాలు మోసిన ఆ తల్లి తనకు పుట్టిన బిడ్డను కన్నులారా చూసుకోకముందే కాటికి చేరింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన బొల్లు వెంకటేశ్.. భార్య రవళిక (26) తొమ్మిది నెలల గర్భిణి. పురిటినొప్పులు రావడంతో సోమవారం మంచిర్యాలలోని నందిని నర్సింగ్ హోంకు తీసుకువచ్చారు. వైద్యురాలు పరీక్షించి ఉదయం 11 గంటలకు నార్మల్ డెలివరీ చేసింది. రవళికకు రక్తం తక్కువగా ఉందని, వెంటనే రక్తం ఎక్కించాలని కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారు బయటకు వెళ్లారు. రక్తస్రావం ఎక్కువ కావడంతో వైద్యులు మెడిలైఫ్‌కు తరలించగా చికిత్స పొందుతూ రవళిక మృతి చెందింది. దీంతో వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బాలింత మృతి చెందిందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. పట్టణ సీఐ బన్సీలాల్ సిబ్బందితో చేరుకొని రవళిక కుటుంబ సభ్యులను సముదాయించి ఆందోళనను విరమింపజేశారు. బాబు పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు.

ఎక్స్ ప్రెస్ పాస్‌తో డీలక్స్‌ల్లోనూ ప్రయాణం

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): ఎక్స్‌ప్రెస్ మంత్లీ సీజన్ పాస్ దారులకు డీలక్స్ బస్సుల్లోనూ ప్రయాణించే వెసులుబాటును టీఎస్ ఆర్టీసీ కల్పించింది. రూ.20 కాంబినేషన్ టికెట్ తీసుకొని డీలక్స్ బస్సుల్లోనూ ప్రయాణించవచ్చని, ఈ సదుపాయం ఎక్స్‌ప్రెస్ పాస్ దారులకు మాత్రమేనని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ట్వీట్ చేశారు. వంద కిలోమీటర్ల పరిధిలో జారీచేసే ఈపాస్ స్థానిక బస్‌పాస్ కౌంటర్లలో లభ్యమవుతుందని ఎండీ సూచించారు.

కోర్టు ముందుకు క్రిశాంక్

- బెయిల్ పిటిషన్‌పై వాదనలు నేటికి వాయిదా

నాంపల్లి కోర్టులు, మే 6 (నమస్తే తెలంగాణ)/ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ సెలవులకు సంబంధించిన నకిలీ సర్క్యులర్ కేసులో బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ ఒక్కరోజు కస్టడీ ముగియడంతో సోమవారం నాంపల్లిలోని 4వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట పోలీసులు హాజరుపర్చారు. ఈ నెల 13 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌ను కొనసాగిస్తూ ఇన్‌చార్జి కోర్టు మెజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడి తరపున దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌కు పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. దర్యాప్తు కొనసాగుతున్న తరుణంలో సాక్షాధారాలు, సాక్షులను తారుమారు చేసే అవకాశమున్నదని, బెయిల్ మంజూరు చేయవద్దని పోలీసులు కౌంటర్ పిటిషన్‌లో పేర్కొన్నారు. వాదనల కోసం కోర్టు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై రెండో నిందితుడికి వెసులుబాటు లభించింది. రిమాండ్ రిపోర్టులో రెండో నిందితుడిగా చేర్చిన బీఆర్‌ఎస్ నేత నాగేందర్‌కు 41-ఏ నోటీసులు జారీ చేయాలని, అరెస్టు చేయవద్దని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది.

నేడు విచారణకు క్రిశాంక్ బెయిల్ పిటిషన్

4వ సెషన్ కోర్టు జడ్జి అందుబాటులో లేకపోవడంతో కేసును 6వ సెషన్ కోర్టు జడ్జికి బదిలీ చేశారు. ఆయనకు అనారోగ్యంగా ఉండటంతో ఈ కేసును 3వ సెషన్ కోర్టు జడ్జికి బదిలీ చేశారు. 3వ సెషన్ కోర్టు జడ్జి సెలవుపై వెళ్తుండటంతో ఈ కేసును 7వ సెషన్ కోర్టుకు బదిలీ చేశారు. మంగళవారం దీనిపై విచారణ జరుగనున్నది.

కవిత బెయిల్ పిటిషన్ల తిరస్కరణ

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం విధానం కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం తిరస్కరించింది. రౌస్ ఎవెన్యూ కోర్టులో సోమవారం జరిగిన విచారణ సందర్భంగా కవిత తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. లోక్‌సభ ఎన్నికలున్నాయని, పార్టీ తరపున స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్నారని, దీంతోపాటు పీఎంఎల్‌ఏ సెక్షన్ 45 ప్రకారం కవిత బెయిల్‌కు అర్హురాలని చెప్పారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే అరెస్టు చేశారని, ఈడీ కస్టడీలో ఉన్నపుడే సీబీఐ ఎందుకు అరెస్టు చేసిందని ప్రశ్నించారు. ఏడేండ్లలోపు శిక్షపడే కేసుల్లో అరెస్టు అవసరం లేదన్నారు. కవితకు బెయిల్ ఇవ్వవద్దని, బెయిల్ ఇస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తారని ఈడీ, సీబీఐ తరపు న్యాయవాదులు చెప్పారు. దీంతో కోర్టు బెయిల్ పిటిషన్లు తిరస్కరించారు.

కోర్టులో నేరుగా హాజరుపరిచేందుకు అనుమతి..

తనను వీడియో కాన్ఫరెన్స్ పద్ధతిలో కాకుండా నేరుగా న్యాయస్థానంలోనే విచారించాలని కవిత వేసిన పిటిషన్‌ను కోర్టు అనుమతించింది. మంగళవారంతో కవిత జ్యుడీషియల్ కస్టడీ ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఆమెను మధ్యాహ్నంకోర్టు ముందు ప్రత్యక్షంగా హాజరుపర్చనున్నారు.

హాస్టళ్లలోని సౌకర్యాలను నివేదించండి: హై కోర్టు

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని హాస్టళ్లలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై జూన్ 10లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు సరిగా లేవంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్ కుమార్ ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. హాస్టళ్లలో కలుషిత ఆహారం తిని 60 రోజుల్లో ముగ్గురు విద్యార్థులు మరణించడంతోపాటు 100 మంది అనారోగ్యానికి గురయ్యారని పిటిషనర్ల తరపు న్యాయవాది ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 2,800 హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో 7.58 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ఉన్నారని, ఆయా హాస్టళ్లు, పాఠశాలల్లో 52 వేల మరుగుదొడ్లు, 30 వేలకుపైగా బాత్‌రూములు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. హాస్టళ్లలో వసతుల కొరత ఉన్నమాట వాస్తవమేనని రాష్ట్ర ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ అంగీకరించారు. వేసవి సెలవులు ముగిసేలోగా ఈ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని హామీ ఇవ్వడంతో విచారణ జూన్ 10కి వాయిదా పడింది.

ఆ రైతులను భూముల నుంచి ఖాళీ చేయించొద్దు

మెదక్, సిద్దిపేట జిల్లాల రైతుల కేసులో హైకోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్‌ఆర్) నిర్మాణం కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియలో భాగంగా మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌లోని 9.03 ఎకరాలు, సిద్దిపేట జిల్లా గజ్వేల్ న్యూ డివిజన్ పాములపర్తిలోని 14 ఎకరాల యజమానులను ఖాళీ చేయించరాదని హైకోర్టు మధ్యంతర ఆదేశాలు ఇచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు తమ భూములను సేకరించారంటూ జీ శ్రీరాంరెడ్డి, ఆర్ అరులప్ప హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేయడంతో జస్టిస్ కే శరత్ ఇటీవల ఈ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను జూన్ 14కి వాయిదా వేశారు.

మధ్యంతర పిటిషన్ పరిష్కరించాకే తుది తీర్పు

పైగా భూముల కేసులో హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): పైగా భూముల వివాదంపై మధ్యంతర పిటిషన్‌ను పరిష్కరించకుండా ఆ భూముల దస్తావేజును రద్దుచేస్తూ సివిల్ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు రద్దు చేసింది. మధ్యంతర పిటిషన్‌ను పరిష్కరించాకే తుది తీర్పు ఇవ్వాలని సివిల్ కోర్టును ఆదేశించింది. అందుకోసం ఈ వివాదాన్ని మళ్లీ సివిల్ కోర్టుకే పంపుతూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్ కుమార్ ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. పైగా భూముల్లో కొంత భాగాన్ని నిజాం పేరుతో 1966లో చేసిన విక్రయ దస్తావేజును రద్దు చేయాలని కోరుతూ బుగ్లేద్ జాహీ పైగా వారసురాలిగా హమీదున్నీసా బేగం వేసిన వ్యాజ్యాన్ని గతంలో 12వ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొట్టివేయడంతో ఆమె 11వ అదనపు చీఫ్ సివిల్ జడ్జిని ఆశ్రయించారు. దీంతో నిజాంకు హమీదున్నీసా బేగం చేసిన దస్తావేజుతోపాటు, సైరస్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్‌కు నిజాం చేసిన దస్తావేజులను రద్దు చేస్తూ తీర్పు వెలువడింది. అనంతరం మధ్యంతర పిటిషన్‌పై నిర్ణయం తీసుకోకుండా తుది ఉత్తర్వులు ఇవ్వడంపై సైరస్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ రెండు అప్పీళ్లను దాఖలు చేయడంతో హైకోర్టు పై తీర్పును వెలువరించింది.

జగన్, చంద్రబాబుకు ఈసీ మందలింపు

హైదరాబాద్, మే 6(నమస్తే తెలంగాణ): ఏపీ సీఎం జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ప్రచారంలో వినియోగిస్తున్న భాష, చేస్తున్న విమర్శలపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఘాటుగా స్పందించింది. వ్యక్తిగత అంశాలపై, ఆధారాలు లేని అంశాలపై మాట్లాడొద్దని హెచ్చరించింది. జగన్‌పై టీడీపీ చేసిన ఫిర్యాదులు, చంద్రబాబుపై వైసీపీ చేసిన ఫిర్యాదులను పరిశీలించిన ఎన్నికల సంఘం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని మాట్లాడాలని సూచించింది.



కాళేశ్వరాన్ని విస్మరిస్తే..

కరువు కాటేసే!

రాజకీయ క్రీడలో బలి పశువుగా తెలంగాణ రైతు

- ప్రాణహితను చేజేతులా కడలి పాలు చేసిన సర్కారు
- 40 టీఎంసీలకుపైగా జనవరి, ఫిబ్రవరిలో మేడిగడ్డ మీదుగా దిగువకు
- కేవలం 20 టీఎంసీలు ఇస్తే ఎస్సారెస్పీ ఆయకట్టులో ధాన్యపు సిరులు
- మరో పది టీఎంసీలతో మండుటెండల్లోనూ వేలాది చెరువుల మత్తళ్లు దుంకే అవకాశం
- మూడు నెలల ముందుగానే హెచ్చరించిన 'నమస్తే తెలంగాణ'
- కేసీఆర్‌ను బదనాం చేయాలనే ఎజెండాతో కరువు ముప్పు
- 20 లక్షల ఎకరాలకుపైగా ఎండిపోయిన పంటలు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 6 (నమస్తే తెలంగాణ): 2023 జనవరి 10 నాటికి గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలు 173.36 టీఎంసీలు. 2024, జనవరి 10 నాటికి ఇవే ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలు 167.24 టీఎంసీలు. గత సంవత్సరంతో పోలిస్తే వర్షాలు పడనిదెక్కడ? ప్రాజెక్టుల్లో నీళ్లు లేనిదెక్కడ? నిరుడు ఇదే గోదావరి బేసిన్‌లో అన్నదాతలు ధాన్యపు సిరులు ఎలా పండించగలిగారు? ఇప్పుడు లక్షల ఎకరాలకు సాగునీరు అందక పంటలు ఎందుకు ఎండిపోతున్నాయి? గత సంవత్సరంతో పోలిస్తే గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు 6.12 టీఎంసీలు మాత్రమే తక్కువగా ఉన్నాయి. గత సంవత్సరం పంటలకు నీళ్లు ఇవ్వడమే కాదు, నిండు వేసవిలోనూ చెరువులు మత్తళ్లు దుంకాయి. ఇప్పుడు ఆ జలసిరుల జాడ లేదు. ధాన్యపు రాశుల గలగలలు లేవు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ దుర్భిక్షం ప్రకృతి శాపం కాదు.. మానవ వైఫల్యం.. ప్రభుత్వ వైఫల్యం!

గత సంవత్సరం కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల్లో నీటి నిల్వలకు తోడు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నుంచి 25.97 టీఎంసీల ప్రాణహిత జలాలను ఎత్తిపోసింది. లక్ష కోట్ల ప్రాజెక్టు నుంచి గీ.. 25.97 టీఎంసీలు ఎత్తిపోసి గొప్పలు చెప్పుకుంటారా అంటే?! కాళేశ్వరం అనేది అక్షయపాత్ర లాంటిది. ఎంత ఆకలైతే అంతమేర కడుపు నింపుతది. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన 2019 నుంచి ఈ నీటి సంవత్సరం వరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఆశాజనకమైన వరద వచ్చింది. అందుకే, కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోయాల్సిన నీటి పరిమాణం తగ్గింది. అయితే, గత సంవత్సరం కాళేశ్వరం నుంచి ఎత్తిపోసిన ఆ 25.97 టీఎంసీలే కోట్ల టన్నుల ధాన్యపు రాశులకు ప్రాణాధారం అయ్యాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ క్రీడలోకి లాగి, ఉద్దేశపూర్వకంగా విస్మరించినందునే కేవలం 30 టీఎంసీలు తక్కువయ్యాయి. ప్రాజెక్టుల్లో ఉన్న 167 టీఎంసీలను వినియోగించినా చివరి తడులకు సాగునీరు లేక లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. నిన్నటిదాకా ధాన్యాగారంగా విరాజిల్లిన తెలంగాణ ఇప్పుడు కరువు కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నది. ఇది కాలం తెచ్చిన కరువా? కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను బదనాం చేయాలనే రాజకీయ దురుద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్టును విస్మరించడంతో వచ్చిన కరువా?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన డిసెంబర్ నెలను వదిలేసినా, ఆ తరువాత జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే మేడిగడ్డ మీదుగా 40 టీఎంసీల వరకు ప్రాణహిత జలాలు దిగువకు పోయి సముద్రంలో కలిశాయి. అందులో 25-30 టీఎంసీలను ఎత్తిపోసుకున్నా గోదావరి బేసిన్‌లో పంటలు ఎండిపోయేవి కావు.


గత సంవత్సరం, ఈ ఏడాది యాసంగి సమయంలో (జనవరిలో) గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు దాదాపుగా సమానంగానే ఉన్నాయి. కేవలం ఆరు టీఎంసీల వరకు మాత్రమే తేడా ఉన్నది. కాళేశ్వరం నుంచి ఎత్తిపోసిన నీళ్లు తోడవడంతో చెరువులు నిండుగా ఉండి భూగర్భజలాలు ఎప్పటికప్పుడు రీచార్జ్ అయ్యాయి. ఇప్పుడు ఆ కాళేశ్వరం నుంచి వచ్చే నీళ్లు లోటుగా మారడంతోనే కరువు ఛాయలు అలుముకున్నాయి. ఇందుకు ఎస్సారెస్పీ ఆయకట్టే ఒక ఉదాహరణ. ఎస్సారెస్పీ, మిడ్‌మానేరు, ఎల్ఎండీ, ఎల్లంపల్లిలో అందుబాటులో ఉన్న నీటి నిల్వల్లో తాగునీటి అవసరాలను అంచనా వేసి, మిగతా నీటిని యాసంగి సాగునీటి అవసరాలకు కేటాయించడం ఆనవాయితీ. ఈ ఏడాది సైతం ఎస్సారెస్పీ స్టేజ్-1 కింద 9,65,013 ఎకరాలు ఉండగా, 8,28,297 ఎకరాలకు (3.87 లక్షల ఎకరాలకు ఆరుతడి పంటలకు, 4.41 లక్షల ఎకరాలకు తరి పంటలకు) సాగునీరు ఇవ్వాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దాదాపు లక్ష ఎకరాల ఆయకట్టును తగ్గించింది. ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద 3,71,691 ఎకరాలు ఉండగా దాదాపు 2 లక్షల ఎకరాలకు తగ్గించింది. కడెంతోపాటు, సదర్‌మాట్ కింద క్రాప్ హాలిడేలను ప్రకటించింది. సింగూరు ప్రాజెక్టు కింద ఆయకట్టును కూడా కొంత మేర తగ్గించింది. నిజాంసాగర్, అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టును పరిమితం చేసింది. అయినప్పటికీ, ఈ ఏడాది ప్రతిపాదించిన ఆయకట్టుకు సైతం ప్రభుత్వం సాగునీటిని అందించలేకపోయింది. కాకతీయ కెనాల్ పూర్తిస్థాయి నీటి ప్రవాహ సామర్థ్యం ఎనిమిది వేల క్యూసెక్కులు. నిరుడు యాసంగి పొడవునా నిండు గర్భిణిలా కాల్వ పారింది.



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల మండలం నవాబుపేట శివారు చలివాగులో సాగునీరు అందక తవ్విన బావి

కానీ, ఈ ఏడాది దాదాపు 15 రోజులు మాత్రమే ఏడు వేల క్యూసెక్కులను విడుదల చేయగా, మిగతా సీజన్ మొత్తంగా గరిష్ఠంగా ఆరువేల క్యూసెక్కుల పారకం మించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

చర్చించుకుంటున్నారు. దీంతో యాసంగి అంచనాలన్నీ తలకిందులయ్యాయి. కాళేశ్వరం నుంచి 10-20 టీఎంసీలను ఎత్తిపోసినా ఈ పరిస్థితి వచ్చేది కాదని అధికారులు ప్రైవేట్ సంభాషణల్లో అంగీకరిస్తున్నారు.



జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల సరిహద్దుల్లో నుంచి ప్రవహించే మానేరు నది జనవరి చివరి నుంచే వెలవెలబోతున్న దృశ్యం

ప్రభుత్వ ఉద్దేశంతోనే అధికారులు వెనక్కి!

కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన తరువాత ఎస్సారెస్పీ జలాలను సరస్వతి, లక్ష్మీ కెనాల్, ఎల్ఎండీ ఎగువన ఉన్న ఆయకట్టుకు మాత్రమే పరిమితం చేశారు. ఎల్ఎండీ దిగువన ఉన్న ఆయకట్టు మొత్తానికి దాదాపుగా కాళేశ్వరం నుంచి ఎత్తిపోసిన జలాలనే తరలిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా ఎస్సారెస్పీ ఆయకట్టుకు దాదాపు 10 నుంచి 15 టీఎంసీలు అదనంగా అవసరమవుతాయని అధికారులు యాసంగి ఆయకట్టు ప్రతిపాదనల సందర్భంగానే అంచనా వేశారు. కాళేశ్వరం నుంచి ఎత్తిపోసుకునే వెసులుబాటు ఉన్నదనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ఆయకట్టును ప్రతిపాదించారు. కానీ, ఆచరణలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశం మరో రకంగా ఉండటంతో అధికారులు వెనక్కి తగ్గారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు ఉత్సాహం చూపారేగానీ ఎలాగైనా యాసంగిలో రైతులను గట్టెక్కిద్దాం అనే కోణంలో ఆలోచించి అధికారులకు ఆదేశాలు ఇవ్వలేదు. పాలకుల ఉద్దేశాన్ని అర్థం చేసుకున్న అధికారులు ముందున్న ముప్పును అంచనా వేసినప్పటికీ మిన్నకుండిపోయారు. కాంగ్రెస్ సర్కార్ ఈ ప్రాజెక్టుపై అనుసరించిన దుందుడుకు వ్యవహారంతో నీటి ఎత్తిపోతల అంశాన్నేకాదు ఆ ప్రాజెక్టు పేరును ఎత్తేందుకు కూడా ఎవరూ సాహసించలేదని అధికారులు బాహాటంగానే

రైతును ఆదుకోవాలనే సంకల్పం ఉంటే..

రాజకీయాలు వేరు, పాలన వేరు. తెలంగాణ రైతులను ఆదుకునేందుకు పాలకులు ఎవరైనా సరే, పదడుగులు ముందుకు వేయవచ్చు.ఈ నేపథ్యంలో గత డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ఎజెండాలు ఎన్నైనా ఎంచుకోవచ్చు. కానీ, తెలంగాణ రైతును ఎలా కాపాడుకోవాలనే దిశగా చిన్న ఆలోచన చేసినా వ్యవసాయం ఇంత సంక్షోభంలో పడేది కాదు. 'యాసంగిలో రైతులను గట్టెక్కిద్దాం' అని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంకల్పం తీసుకుని ఉంటే, కచ్చితంగా ప్రాణహిత జలాలను ఎలాగైనా ఎత్తిపోసుకునేవాళ్లు.

ఆ 8.5 టీఎంసీలు ఎత్తిపోసుకుంటే..

'మేడిగడ్డ వద్ద లోపాలున్నాయి. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ చెప్తే కానీ మేం నీటిని ఎత్తిపోయం' అని కాంగ్రెస్ ప్రభుత్వం భీష్మించుకు కూర్చున్నది. ఈ ఏడాది జనవరిలో అన్నారం బరాజ్‌లో 7.52 టీఎంసీలు, సుందిల్ల బరాజ్‌లో 5.78 టీఎంసీలు ఈ రెండింటిలో కలిపి 13.3 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఈ రెండు బరాజ్‌ల్లో కలిపి సుమారు 8.50 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునేందుకు సాంకేతికంగా అవకాశం ఉన్నదని ఇంజినీర్లు చెప్తున్నారు. ఒకవేళ ఎనిమిదిన్నర టీఎంసీలను ఎల్లంపల్లికి తరలించుకుని, వరదకాల్వ పొడవునా ఒకటిన్నర టీఎంసీల మేర నిల్వ చేసి ఉంటే వేలాది బోర్లకు జీవం వచ్చి లక్షలాది ఎకరాల పంట గట్టున పడేది. హైదరాబాద్ తాగునీటి కోసం ఎమర్జెన్సీ మోటర్ల అవసరం ఉండేది కాదు. కేసీఆర్‌ను, కాళేశ్వరం ప్రాజెక్టును బదనాం చేయాలనే యావ తప్ప రైతులను ఆదుకుందామన్న ధ్యాస లేకపోవడం వల్లనే నేడు ఈ దుస్థితి.

తల్లడిల్లుతున్న భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి, (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవడానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఒక ఉదాహరణగా నిలుస్తున్నది. జిల్లాలోని భీంఘణపూర్ చెరువు, గణపసముద్రం చెరువులతోపాటు కొన్ని చెరువులు మాత్రమే రైతులకు కొంత భరోసానిస్తున్నాయి. జిల్లాలో భూగర్భజల నీటి మట్టం ప్రస్తుతం 9.30 మీటర్లకు పడిపోవడం రైతాంగాన్ని కలవరపెడుతున్నది. కాటారం మండలంలో అత్యధికంగా 19.21 మీటర్లకు జలం అడుగంటిపోయింది. మహదేవ్‌పూర్ మండలంలో 13.23 మీటర్లు, మల్హర్ మండలంలో 10.01 మీటర్లకు నీటిమట్టం తగ్గిపోయింది. ఈ మూడు మండలాలు అటు మానేరుకు, కాళేశ్వరం ప్రాజెక్టుకు సమీప మండలాలే. గోదావరికి పక్కనే ఉన్న పలిమెల మండలంలో సైతం 8.88 మీటర్ల లోతుకు జలం అడుగంటింది. దీనిని బట్టి కాళేశ్వరం ప్రాజెక్టు ఆవశ్యకత అవగతమవుతున్నది.

ఆందోళనలో రైతులు

వర్షాలు లేకపోవడం, మానేరు ఎండిపోవడం, డీబీఎం-38 కాల్వలో నీరు రాకపోవడం, బోర్లు, బావుల్లో నీరు అడుగంటిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండిన పంటలపై ఇటీవల రేగొండ, శాయంపేట మండలాల రైతులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. రేగొండలో మండలంలోని రేగొండ, రంగయ్యపల్లి, జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్, కొడవటంచ, వెంకటేశ్వర్లపల్లి, దామరంచ, తిరుమలగిరి తదితర గ్రామాల్లో పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.నూతనంగా 18 బోర్లు వేశారు. 54 బావుల్లో పూటిక తీస్తున్నారు. చిట్యాల మండలం, మొగుళ్లపల్లి మండలాల్లో చలివాగు ఎండిపోవడంతో సాగునీటి సమస్య జఠిలమైంది. పక్కనే మానేరు ఎండిపోవడంతో మల్హర్, టేకుమట్ల మండల రైతులు సాగునీటికి తల్లడిల్లుతున్నారు. కాటారం, మహదేవ్‌పూర్ మండలాల్లోనూ సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి.

కాళేశ్వరం అంటేనే అది...

కాళేశ్వరం ప్రాజెక్టును ఎందుకు చేపడుతున్నామనే అంశం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) మొదట్లోనే స్పష్టంగా ఉన్నది. ప్రధాన గోదావరి అంటే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు తద్వారా దిగువకు ఇన్‌ఫ్లోలు లేకపోవడం వల్ల తీవ్ర దుర్భిక్షం నెలకొంటుందని, అదే సమయంలో ప్రాణహిత నుంచి ఏడాది పొడవునా ఇన్‌ఫ్లో ఉంటున్నందునే ఈ ప్రాజెక్టు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు 2019లో అందుబాటులోకి వచ్చింది. అప్పుడే కాదు, అంతకు ముందు రెండు, మూడు సంవత్సరాల నుంచి కూడా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లోలు బాగా ఉన్నాయి. అందుకే ఎక్కువ మేర కాళేశ్వరం ప్రాజెక్టు అవసరం పడలేదు. ఇన్‌ఫ్లోలు ఉన్నప్పుడు కూడా ఎత్తిపోయడమనేది అవివేకం. అందుకే కేసీఆర్ ప్రభుత్వం ఎప్పుడు నీళ్లు అవసరమైతే అప్పుడు మాత్రమే కాళేశ్వరాన్ని వినియోగించింది. 2019 నుంచి గత సంవత్సరం వరకు ఒక్కో సంవత్సరం అవసరం మేరకు 25.97 నుంచి 61.66 టీఎంసీల వరకు నీటిని ఎత్తిపోశారు. ఈ ఏడాది అది జరగకపోవడంతోనే 90% నీటి నిల్వలు ఉన్నా, కీలకమైన 10% నీటినిల్వలు లేక చేతికొచ్చిన పంటలు ఆగమయ్యాయి.

హెచ్చరికలను పెడచెవిన పెట్టిన సర్కారు

కాళేశ్వరం ప్రాజెక్టును విస్మరిస్తే కరువు ముప్పు పొంచి ఉంటుందని, జనవరిలోనే 'నమస్తే తెలంగాణ' ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసే ప్రయత్నం చేసింది. పంటలు ఎండే ప్రమాదం ఉన్నదని, సాగునీరు అందని పరిస్థితి నెలకొన్నదని వివరిస్తూ కథనం ప్రచురించింది. ముఖ్యంగా... 'కాళేశ్వరం ప్రాజెక్టును, కేసీఆర్‌ను బదనాం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రాణహిత జలాలను ఎత్తిపోయడం లేదు. ఈ నిర్ణయం వల్ల లక్షలాది రైతులు గోసపడతారనే చిన్న లాజిక్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మిస్సవుతున్నది' అని అప్రమత్తం చేసినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. పైపెచ్చు అంతా అవాస్తవం. కాళేశ్వరం లేకున్నా ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు సాగునీరిస్తామంటూ ప్రగల్బాలు పలికింది. తీరా నీళ్లు ఇవ్వలేక లక్షల ఎకరాలను ఎండబెట్టింది. ఒక్క ఎస్సారెస్పీ కాలువలు, దాని కమాండ్ ఏరియాలోనే దాదాపు 10 లక్షల ఎకరాలకు సాగునీరందని పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వ అనాలోచిత చర్యలతో సాగునీటికే కాదు, తాగునీటికీ కటకట దాపురించింది.

నేడు మేడిగడ్డకు జస్టిస్ చంద్రఘోష్



- 'కాళేశ్వరం'పై న్యాయవిచారణ ప్రారంభం
- కమిషన్ మెంబర్ సెక్రటరీగా మురళీధర్?

హైదరాబాద్/జయశంకర్ భూపాలపల్లి, మే 6(నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో ఏర్పాటైన కమిషన్, సోమవారం నుంచి న్యాయవిచారణ ప్రారంభించింది. ఇందులో భాగంగా జస్టిస్ ఘోష్ నేడు మేడిగడ్డను పరిశీలించనున్నారు. కలకత్తా నుంచి సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్న ఆయన, సాయంత్రం 5 గంటలకు ఇరిగేషన్‌శాఖ సెక్రటరీ రాహుల్‌బొజ్జా, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇతర ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. 9న బీఆర్కే భవన్‌లో ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులతో మరోసారి సమావేశం కానున్నారు. న్యాయవిచారణ కమిషన్ మెంబర్ సెక్రటరీగా హైకోర్టు విశ్రాంత రిజిస్ట్రార్ మురళీధర్‌ను నియమించాలని నిర్ణయించినట్టు తెలిసింది. విచారణలో టెక్నికల్ సాయం కోసం ప్రాజెక్టుతో సంబంధం లేని ఇద్దరిని సైతం తీసుకున్నట్లు సమాచారం. వారిలో నాగర్‌కర్నూల్ సీఈ విజయభాస్కర్, పీఅండ్ఎం ఎస్ఈ శ్రీనివాస్ ఉన్నట్లు తెలుస్తున్నది. జస్టిస్ ఘోష్ మంగళవారం వరంగల్ చేరుకుని అక్కడి నుంచి మేడిగడ్డకు వెళ్తారు. మధ్యాహ్నం వరకు మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలించి అధికారులతో సమావేశమవుతారు. భోజనం తర్వాత కాళేశ్వరం ఆలయంలో పూజలు చేసి రాత్రికి రామగుండం ఎన్టీపీసీ అతిథి గృహంలో బస చేస్తారు. మరుసటి రోజు సిద్దిపేటకు వెళ్లి అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకుంటారు.

జనవరి మొదటి వారంలో గోదావరి బేసిన్‌లో నీటినిల్వలు (టీఎంసీల్లో)

ప్రాజెక్టు	పూర్తినిల్వమట్టం	నిరుడు	ఈ ఏడాది
శ్రీరాంసాగర్	90	72.91	63.19
శ్రీరాజరాజేశ్వర జలాశయం	27.50	24.78	16.34
లోయర్ మానేర్‌డ్యాం	24	16.34	24.78
ఎల్లంపల్లి	20	14.05	18.93
సింగూరు	29.17	24.55	26.76
నిజాంసాగర్	17.80	14.59	13.34
కడెం	7.60	6.14	3.9
మొత్తం	216.07	173.36	167.24



వేసవిలోనూ పుష్కలంగా నీళ్లుండేవి



కాళేశ్వరం ప్రాజెక్టు పుణ్యమా అని మా మండలంలో వేసవిలోనూ నీళ్లుండేవి. అన్నారం, మేడిగడ్డ బరాజ్‌ల్లో నీళ్లు స్టోర్ చేయడం వల్ల వ్యవసాయ బావులు, బోర్లలో పుష్కలంగా నీళ్లుండేవి. మేం ఎక్కువగా మిర్చి పంటలే వేస్తాం. మిర్చి పంటలకు నీళ్లు ఎక్కువగా అవసరం. కేసీఆర్ హయాంలో ఏనాడూ నీటి సమస్య రాలేదు. మేడిగడ్డ బరాజ్ కుంగడంతో నీళ్లు బయటికి పంపుతున్నారు. మాకు కష్టాలు మొదలయ్యాయి. త్వరగా రిపేరు చేసి నీళ్లు స్టోరేజీ చేస్తే బాగుండు. నాకు 5 ఎకరాల భూమి ఉన్నది. మిర్చి పంట వేసిన. నీళ్లకు ఇప్పటిదాక ఇబ్బంది రాలే. బోరులో నీరు అడుగంటుతుంది. పంటకు నీళ్లు సరిపోవడంలేదు. **-తుంగల సమ్మయ్య, రైతు, మహదేవ్‌పూర్**

కాఫర్‌డ్యాంలు, మట్టికట్టలు ఇవేవీ కావు. తక్కువ ఖర్చుతో తాత్కాలికమైన 'గాబ్రియన్స్' (ఇనుప వలలో బండరాళ్లు వేసి నదికి అడ్డంగా వేసేవి) వేసి జనవరి, ఫిబ్రవరి నెలల్లో ప్రాణహిత జలాలను ఎత్తిపోసుకొని ఉంటే మునుపటిలాగే తెలంగాణ పచ్చగా ఉండేది. దేవాదుల ప్రాజెక్టు విషయంలో ఇన్‌టేక్ లెవల్‌కు నీటి లభ్యత కోసం ఇదే గాబ్రియన్స్ కోసం అంచనాలు రూపొందించిన సందర్భం ఉన్నది. మనసుంటే మార్గం ఉంటుంది. మేడిగడ్డ లోపాలు, ఇతరత్రా అంశాల జోలికి వెళ్లడం లేదు. కేవలం రైతులకు సాగునీరు ఇవ్వాలనే కోణంలో ఆలోచిస్తే మాత్రం రెండు నెలలపాటు దిగువకు పోయిన నీటిలో సగం ఎత్తిపోసుకున్నా రైతుల గోస ఇలా ఉండేది కాదు. **-ఒక రిటైర్డ్ సీనియర్ ఇంజినీర్ వ్యాఖ్య**

ఎండలు మండే.. వానలు కురిసే!

- రాష్ట్రంలో భిన్న వాతావరణం
- బలహీనపడిన ఉపరితల ఆవర్తనం
- కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే చాన్స్
- రాష్ట్రంలో మరో ఐదురోజులు వర్షాలు కురిసే అవకాశం
- పలుచోట్ల 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా భిన్న వాతావరణం నెలకొన్నది. కొన్ని జిల్లాల్లో పగలు ఎండలు మండుతుంటే.. సాయంత్రం వేళ ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తున్నది. ఆదివారం కురిసిన వర్షానికి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలతో సాధారణ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు తగ్గినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల ఐదు రోజులపాటు అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. సోమవారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో వడగాలులు వీచాయి. మరికొన్ని చోట్ల అక్కడక్కడా వర్షాలు కురిశాయి. మంగళవారం రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా ఈదురుగాలతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని ఐఎండీ తెలిపింది. దీంతో వివిధ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉపరితల ఆవర్తనం బలహీనపడినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి తెలిపారు.

మామిడాలలో అత్యధిక వర్షపాతం

నెలరోజులుగా రికార్డు స్థాయి ఎండలతో అట్టుడికిన వివిధ జిల్లాల్లో ఆది, సోమవారాల్లో కురిసిన వానతో వాతావరణం కాస్త చల్లబడింది. కొన్నిచోట్ల వడగండ్ల వాన కురిసింది. అత్యధికంగా నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాలలో 6.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సూర్యాపేట జిల్లా ఆత్మకూరులో 4.7 సెంటీమీటర్ల వర్షం పడింది. సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రాష్ట్రంలోని సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్‌లో 177.5 మి.మీ, నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో 10.8 మి.మీ, కల్వకుర్తి మండలం ఎల్లికల్‌లో 3.8 మి.మీ, సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో 3.5 మి.మీ, నల్లగొండ జిల్లా గుండ్లపల్లి మండలం సింగరాజ్‌పల్లిలో 3.3 మి.మీ, ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతలలో 2.0 మి.మీ వర్షపాతం నమోదైనట్టు తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ వెల్లడించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రాగల ఐదురోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.



సోమవారం ఎండ తీవ్రతను తట్టుకోలేక హైదరాబాద్‌లో జలకాలాటలాడుతున్న చిన్నారులు

కొనసాగుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో సోమవారం కూడా రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వివిధ ప్రాంతాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. జగిత్యాల జిల్లా గుల్లకోట, అల్లీపూర్‌లో 46.8 డిగ్రీలు, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.4, సుగ్లాంపల్లి, జగిత్యాల జిల్లా కోల్వాయిలో46.3, కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 46.2, జగిత్యాల జిల్లా గోదూరులో 46.1, కుమ్రంభీం జిల్లా తిర్యాణీ, మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో 46, వెల్గనూర్‌లో 45.9 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు పేర్కొన్నది.

కలెక్టర్లను అనవసరంగా వేధించొద్దు

ఇసుక అక్రమ మైనింగ్ కేసులో ఈడీకి సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: తమిళనాడులో అక్రమ మైనింగ్ కేసులో జిల్లా కలెక్టర్లను అనవసరంగా వేధించొద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కు సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దర్యాప్తు పేరుతో కలెక్టర్లను ఈడీ కార్యాలయంలోనే రాత్రి 8.30 వరకు కూర్చోబెడుతున్నారని రాష్ట్రప్రభుత్వం ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కోర్టు ఈ ఆదేశాలు జారీచేసింది. ఈ కేసులో ఐదుగురు కలెక్టర్లను ఏప్రిల్ 25లోగా హాజరుకావాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు వారు ఈడీ ముందు హాజరయ్యారని ప్రభుత్వ తరఫు న్యాయవాది కపిల్ సిబల్ కోర్టుకు తెలిపారు. ఈ సందర్భంగా ఈడీ తరఫు న్యాయవాది మాట్లాడుతూ.. వారు ఈడీ ముందు హాజరయ్యారని, అయితే ఎలాంటి డాక్యుమెంట్లు కానీ, వివరాలు కానీ ఈడీకి అందజేయలేదని చెప్పారు. దీనికి సిబల్ స్పందిస్తూ.. ఈడీ సమన్లలో కోరిన వాటిని అందించినట్టు స్పష్టంచేశారు. ఏయే డాక్యుమెంట్లు ఇవ్వలేదో స్పష్టం చేయాలని ఈడీని ఈ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది. అనంతరం సిబల్ మాట్లాడుతూ.. కలెక్టర్లు 11 గంటలకు ఈడీకి ఆఫీసుకు వచ్చారని, వారిని రాత్రి 8.30 వరకు కార్యాలయంలోనే కూర్చోబెట్టారని పేర్కొన్నారు. దీనిపై కోర్టు స్పందిస్తూ కలెక్టర్లను అనవసరంగా వేధించొద్దని ఈడీకి స్పష్టంచేసింది. తదుపరి విచారణను జూలైకి వాయిదా వేసింది.

సీఐఎస్‌సీఈ 10, 12 బోర్డు పరీక్షల్లో బాలికలదే హవా

ఈ ఏడాది నుంచి మెరిట్ జాబితాకు స్వస్తి

న్యూఢిల్లీ, మే 6: సీఐఎస్‌సీఈ 10, 12 తరగతుల బోర్డ్ పరీక్షల్లో బాలికలు మరోసారి సత్తా చాటారు. పదో తరగతిలో 99.65 శాతం మంది, 12వ తరగతిలో 98.12 శాతం మంది బాలికలు ఉత్తీర్ణత సాధించగా, బాలురు 10లో 99.13 శాతం, 12వ తరగతిలో 97.53శాతం ఉత్తీర్ణత పొందారు. బోర్డ్ ఎగ్జామ్స్ ఫలితాల్ని సీఐఎస్‌సీఈ సోమవారం విడుదల చేసింది. గత ఏడాదితో పోల్చితే ఈసారి ఉత్తీర్ణత శాతం పెరిగిందని తెలిపింది. విద్యార్థుల మధ్య అనారోగ్యకరమైన పోటీకి దారితీస్తున్నదని మెరిట్ జాబితాను విడుదల చేయటం ఈ ఏడాది నుంచి నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నది. పదో తరగతి బోర్డ్ ఎగ్జామ్స్‌లో 100 శాతం ఉత్తీర్ణతతో ఇండోనేషియా, సింగపూర్, దుబాయ్‌లోని స్కూల్స్ అత్యుత్తమ పనితీరును కనబర్చాయి.

ప్లీజ్.. మాల్దీవులకు రండి!

భారతీయులను కోరిన పర్యాటక మంత్రి ఫైజల్

దుబాయ్: భారతీయులు మాల్దీవులకు రావాలని, పర్యాటకంపైనే ఆధారపడిన తమ దేశ ఆర్థిక వ్యవస్థకు సహకరించాలని మాల్దీవుల టూరిజం శాఖ మంత్రి ఇబ్రహీం ఫైజల్ అభ్యర్థించారు. ఆయన సోమవారం పీటీఐతో మాట్లాడుతూ భారత్, మాల్దీవులు మధ్య చారిత్రక సంబంధాలు ఉన్నాయని అన్నారు. కొత్తగా ఎన్నికైన తమ దేశ ప్రభుత్వం భారత్‌లో కలిసి పనిచేయాలని అనుకొంటున్నదని, తాము ఎల్లప్పుడూ శాంతియుత, స్నేహపూర్వక వాతావరణాన్ని కోరుకుంటామని చెప్పారు. మాల్దీవుల అధ్యక్షుడిగా ముయిజ్జు బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు క్షీణించాయి. భారత్‌పై పలువురు మంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో మాల్దీవులకు వెళ్లే భారత పర్యాటకుల సంఖ్య భారీగా తగ్గింది.

మూడోసారి రోదసిలోకి సునీతా విలియమ్స్

బోయింగ్ 'స్టార్‌లైనర్' ద్వారా నేడు నింగిలోకి



వాషింగ్టన్, మే 6: భారత సంతతికి చెందిన అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్ ముచ్చటగా మూడోసారి రోదసి యాత్రకు వెళ్లనున్నారు. బోయింగ్ సంస్థకు చెందిన 'స్టార్‌లైనర్' వ్యోమనౌకలో ఆమె మరో వ్యోమగామి బచ్ విల్మోర్‌తో కలసి అంతరిక్షయానం చేయనున్నారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 8 గంటల 4 నిమిషాలకు ఫ్లోరిడాలోని కేప్ కెనవరాల్ లాంచింగ్ స్టేషన్ నుంచి ఈ వ్యోమనౌక నింగిలోకి దూసుకెళ్లనున్నది. ఇందులో మిషన్ పైలట్‌గా వ్యవహరించనున్న సునీతా విలియమ్స్ (58).. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకుని అక్కడ వారం రోజులపాటు గడపనున్నారు. ఈ రోదసి యాత్రకు తాము సిద్ధంగా ఉన్నామని, మూడోసారి అంతరిక్షయాత్రలో పాల్గొనడం సంతోషంగా ఉన్నదని సునీతా విలియమ్స్ తెలిపారు. ఈ యాత్ర విజయవంతమైతే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి సిబ్బందిని తీసుకెళ్లి, తీసుకొచ్చిన రెండవ ప్రైవేట్ సంస్థగా బోయింగ్ ఆవిర్భవిస్తుంది.

ఆస్ట్రేలియా వీసాలకు టోఫెల్

- తిరిగి పరిగణనలోకి
- వెల్లడించిన ఈటీఎస్

న్యూఢిల్లీ, మే 6: ఆస్ట్రేలియా వీసాలకు టోఫెల్ స్కోరును తిరిగి పరిగణనలోకి తీసుకోనున్నారు. ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ (ఈటీఎస్) సోమవారం ఈ విషయం వెల్లడించింది. ఆంగ్ల భాషా సామర్థ్యాన్ని తెలిపే 'టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఏ ఫారెన్ లాంగ్వేజ్' (టోఫెల్)ను ప్రిన్స్‌టన్‌కు చెందిన ఏజెన్సీ ఈటీఎస్ నిర్వహిస్తున్నది. 2024 మే 5 తర్వాత టోఫెల్ పరీక్షల స్కోర్ ఆస్ట్రేలియాలో అన్ని రకాల వీసాలకు లెక్కలోకి వస్తుందని ఈటీఎస్ తెలిపింది. టోఫెల్ స్కోర్‌పై గత ఏడాది జూలైలో ఆస్ట్రేలియా సమీక్ష చేపట్టింది. వీసా జారీలో ఈ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోబోమని తెలిపింది. దీంతో 60 ఏండ్లుగా కొనసాగుతున్న టోఫెల్ టెస్ట్‌లో ఈటీఎస్ కొన్ని మార్పులు చేపట్టింది. 'టోఫెల్ ఐబీటీ' అనేది తీసుకురాగా, దీనిపై సమీక్ష జరిపిన ఆస్ట్రేలియా హోం శాఖ (డీహెచ్‌ఏ) సంతృప్తి వ్యక్తం చేసింది. 'మరింత మెరుగుపర్చిన టోఫెల్ పరీక్ష.. వీసా దరఖాస్తుదారుల ఆంగ్ల భాష సామర్థ్యానికి కొలమానంగా డీహెచ్‌ఏ భావిస్తున్నది' అని ఈటీఎస్ ఇండియా, దక్షిణాసియా కంట్రీ మేనేజర్ సచిన్ జైన్ చెప్పారు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బ్రిటన్.. ప్రపంచంలోని అనేక దేశాల్లో 12,500కిపైగా విద్యా సంస్థలు టోఫెల్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

స్టూడెంట్ వీసా నిబంధనలు కఠినతరం



స్టూడెంట్ వీసా నిబంధనల్ని ఆస్ట్రేలియా కఠినతరం చేస్తున్నది. 2025 నాటికి వలసల్ని సగానికి తగ్గించే ప్రయత్నంలో భాగంగా, భారత్ వంటి దేశాలకు చెందిన విద్యార్థుల వీసాలను ఆలస్యం చేయటం, తిరస్కరించటం వంటి చర్యలను ఆస్ట్రేలియా చేపడుతున్నది. దీంతో ఆ దేశంలోని పలు విశ్వవిద్యాలయాలు భారతీయ విద్యార్థులను చేర్చుకోవటం లేదు. ప్రధాని ఆంథోనీ అల్బనీస్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా ప్రభుత్వం విద్యార్థుల వీసా నిబంధనల్ని కఠినతరం చేసింది. ఐఈఎల్‌టీఎస్ అర్హత స్కోర్ పెంచటం, ఆర్థికపరంగా అర్హత ప్రమాణాల్ని పెంచటం వంటివి ప్రస్తుత ప్రభుత్వం చేపట్టింది. దీంతో 2022 డిసెంబర్–2023 డిసెంబర్ మధ్యకాలంలో ఆస్ట్రేలియా వీసా దక్కిన భారతీయ విద్యార్థుల సంఖ్య 48శాతం తగ్గినట్టు ఓ నివేదిక పేర్కొన్నది. వీసా తిరస్కరణపై కాన్‌బెర్రాలోని భారత హై కమిషన్ కార్యాలయం స్పందించింది. ఆస్ట్రేలియాకు వస్తున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో రెండో అతిపెద్ద దేశం భారత్ కావటమే దీనికి కారణమని అభిప్రాయపడింది. 2023 జనవరి–సెప్టెంబర్ మధ్య కాలంలో ఆస్ట్రేలియాలో 1.22 లక్షల మంది భారతీయ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ఆస్ట్రేలియాలో భారత విద్యార్థి హత్య

నవ్‌జీత్ సంధూ (22) అనే ఎంటెక్ విద్యార్థి ఆస్ట్రేలియాలో మరో భారతీయ విద్యార్థి చేతిలో హత్యకు గురయ్యాడు. ఇంటి అద్దె విషయమై కొందరు భారత విద్యార్థుల మధ్య జరుగుతున్న గొడవను పరిష్కరించేందుకు నవ్‌జీత్ ప్రయత్నించినప్పుడు ఈ దారుణం చోటు చేసుకొంది. హర్యానాలోని కర్నాల్‌కు చెందిన మృతుడి మామ యశ్‌వీర్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది. 'నవ్‌జీత్‌ను అతడి స్నేహితుడొకరు కొన్ని సామాన్లు తెచ్చేందుకు కారు కావాలని అడిగారు. అతడి ఇంటికి నవ్‌జీత్ తన కారు తీసుకెళ్లాడు. అక్కడ కొందరు భారత విద్యార్థులు అద్దె విషయమై గొడవ పడుతున్నారు. గొడవ పడకండని నవ్‌జీత్ వారికి సర్ది చెప్పే ప్రయ్నతం చేశారు. దీంతో కోపోద్రిక్తుడైన ఒక విద్యార్థి కత్తితో నవ్‌జీత్‌ను పొడిచి చంపాడు' అని యశ్‌వీర్ తెలిపారు. నిందితుడు కూడా కర్నాల్ ప్రాంతానికి చెందినవాడేనని చెప్పారు. నవ్‌జీత్ తెలివైన విద్యార్థి అని.. జూలైలో సెలవుల సమయంలో అతడు స్వదేశానికి రావాల్సి ఉందని యశ్‌వీర్ వాపోయారు. నిందితులైన ఇద్దరు భారత విద్యార్థులు అభిజిత్, రాబిన్ గార్టన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రఫాను ఖాళీ చేయండి

- పాలస్తీనియన్లకు ఇజ్రాయెల్ ఆదేశం
- నగరంపై సైన్యం దాడులు మొదలు

జెరూసలెం: గాజా స్ట్రిప్‌లోని రఫా నగరం నుంచి సురక్షిత ప్రాంతానికి వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం సుమారు ఒక లక్ష మంది ప్రజలను ఆదేశించింది. దీంతో క్షేత్ర స్థాయిలో యుద్ధం సమీపంలోనే ఉందనే సంకేతాలు వస్తున్నాయి. రఫాపై దాడి చేస్తే కాల్పుల విరమణ ఒప్పందం కోసం జరుగుతున్న ప్రయత్నాలు పట్టాలు తప్పుతాయని హమాస్, ఖతార్ తెలిపాయి. ఈ ఒప్పందం కోసం ఖతార్ మధ్యవర్తిత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే హమాస్‌కు ప్రాబల్యం గల ప్రాంతాల్లో రఫా ఒకటి అని, ఇస్లామిక్ మిలిటెంట్ గ్రూప్ హమాస్‌ను మట్టికరిపించాలంటే ఇక్కడ క్షేత్ర స్థాయిలో యుద్ధం చేయవలసిన అవసరం ఉందని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. సోమవారం రఫాపై ఇజ్రాయెల్ దాడులు చేసినట్లు స్థానికులు తెలిపారు. కాగా, ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ నడవ్ షోషని మాట్లాడుతూ పరిమిత స్థాయిలో ఆపరేషన్‌కు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

కాల్పుల విరమణకు హమాస్ అంగీకారం

గాజాలో ఇజ్రాయెల్‌తో జరుగుతున్న యుద్ధానికి తెర దించేందుకు హమాస్ అంగీకరించింది. ఈ యుద్ధంలో కాల్పుల విరమణకు ఈజిప్ట్, ఖతార్ మధ్యవర్తులు చేసిన ప్రతిపాదనలను అంగీకరించినట్లు హమాస్ సోమవారం ప్రకటించింది. రఫా నగరం నుంచి దాదాపు లక్ష మంది వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం ఆదేశించిన తరుణంలో హమాస్ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే దీనిపై ఇజ్రాయెల్ నుంచి స్పందన రాలేదు.

కొలంబియా వర్సిటీ గ్రాడ్యుయేషన్ వేడుక రద్దు

వాషింగ్టన్: పాలస్తీనా అనుకూల నిరసనల నేపథ్యంలో ఈ నెల 15న నిర్వహించాలనుకున్న గ్రాడ్యుయేషన్ వేడుకను రద్దు చేస్తున్నట్టు అమెరికాలోని కొలంబియా వర్సిటీ ప్రకటించింది. గడచిన కొద్ది వారాలు తమకు చాలా కష్ట కాలమని తెలిపింది. క్లాస్ డేస్, స్కూల్ లెవెల్ కార్యక్రమాలను ప్రముఖంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. వీటిలో విద్యార్థులను వారి సహ విద్యార్థుల సమక్షంలో వ్యక్తిగతంగా గౌరవించనున్నట్లు తెలిపింది.

అణ్వాయుధాల విన్యాసాలకు పుతిన్ ఆదేశం



మాస్కో: అణ్వాయుధాల విన్యాసాలను నిర్వహించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆ దేశ సైన్యాన్ని ఆదేశించారు. నావికా దళం, వాయుసేన, పదాతి దళం కూడా వీటిలో పాల్గొనాలని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ సమీపంలోని దళాలు కూడా వీటిలో పాల్గొంటాయి. ఉక్రెయిన్‌తో రెండేళ్ల నుంచి యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ఫిబ్రవరిలో ఆయన జాతిని ఉద్దేశించి మాట్లాడుతూ, అణ్వాయుధ యుద్ధం జరిగే ముప్పు ఉందని హెచ్చరించిన సంగతి తెలిసిందే. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, వ్యూహాత్మకం కానటువంటి అణ్వాయుధాలను వినియోగించడం, సమాయత్తం చేయడం కోసం కొన్ని చర్యలు తీసుకుంటారు. రష్యా భౌగోళిక సమగ్రతను కాపాడుకోవడం కోసం త్వరలోనే ఈ విన్యాసాలు జరుగుతాయి. కొందరు పాశ్చాత్య దేశాల నేతల హెచ్చరికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

అన్ని కరోనా వైరస్‌లకు ఒకే వ్యాక్సిన్!



లండన్, మే 6: అన్ని రకాల కరోనా వైరస్‌ల నుంచి రక్షణ కల్పించే ఆల్ ఇన్ వన్ వ్యాక్సిన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాత యూనివర్సిటీలకు చెందిన పరిశోధకుల బృందం దీనిని అభివృద్ధి చేసింది. భవిష్యత్తులో పుట్టుకొచ్చే కొత్త కరోనా వైరస్‌లను సైతం ఈ టీకా ఎదుర్కొనగలదని వారు వెల్లడించారు. 'ప్రోయాక్టివ్ వ్యాక్సినాలజీ' అనే కొత్త విధానం ద్వారా సైంటిస్టులు ఈ టీకాను అభివృద్ధి చేశారు. ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో మంచి ఫలితాలు వచ్చినట్టు వారు తెలిపారు. కొవిడ్ 19ను కలుగజేసే సార్స్‌కోవ్2తోపాటు ప్రస్తుతం గబ్బిలాల్లో వ్యాప్తి చెందుతున్న కరోనావైరస్‌లలోని నిర్దిష్ట ప్రాంతాల్ని రోగ నిరోధక శక్తి గుర్తించగలిగేలా ఈ కొత్త వ్యాక్సిన్ పనిచేస్తుంది.

శబరిమలలో స్పాట్ బుకింగ్ రద్దు

వచ్చే సీజన్ నుంచి రోజుకు 80 వేల మందికే దర్శనం

తిరువనంతపురం, మే 6: కేరళలోని శబరిమల అయ్యప్ప దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు తాజాగా కీలక నిర్ణయం తీసుకొన్నది. దర్శనానికి ఇచ్చే స్పాట్ బుకింగ్‌లను రద్దు చేసింది. వచ్చే మండల, మకరవిళక్కు సీజన్ నుంచి దేవస్థానం అధికారిక వెబ్‌సైట్‌లో వర్చువల్ క్యూ ద్వారా బుకింగ్ చేసుకొన్న వారినే అయ్యప్ప దర్శనానికి అనుమతించనున్నారు. రోజుకు 80 వేల మంది మాత్రమే అయ్యప్పను దర్శించుకొనేలా ఆన్‌లైన్ బుకింగ్‌పై పరిమితి విధిస్తామని అధికారులు తెలిపారు. ఇప్పుడు మూడు నెలల ముందుగానే వర్చువల్ క్యూ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు.

10న తెరుచుకోనున్న కేదార్‌నాథ్ ధామ్

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ధామ్‌లో కేదరనాథునికి ఆదివారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులకు ఈ నెల 10 నుంచి దర్శనానికి అనుమతి ఇస్తారు. ఉఖిమత్‌లోని ఓంకారేశ్వర దేవాలయంలో భైరవనాథునికి ఆదివారం సాయంత్రం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పంచముఖి భోగమూర్తి పల్లకి యాత్ర సోమవారం ఉఖిమత్‌లోని ఓంకారేశ్వర దేవాలయం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 9న కేదార్‌నాథ్ ధామ్‌కు చేరుకుంటుంది. ఈ నెల 10న ఉదయం 7 గంటలకు కేదార్‌నాథ్ ధామ్ తలుపులు భక్తుల పూజల కోసం తెరుచుకుంటాయి.

వాటర్ బ్యాటరీస్!

బీజింగ్: చైనాకు చెందిన పరిశోధకులు సరికొత్త వాటర్ బ్యాటరీలను అభివృద్ధి చేశారు. సంప్రదాయ లిథియం బ్యాటరీలతో పోలిస్తే, ఇవి రెట్టింపు స్థాయిలో శక్తిని నిల్వ చేసుకుంటాయని పరిశోధకులు చెబుతున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల్లో ఈ బ్యాటరీలను వినియోగించేందుకు ఈ సాంకేతికత కీలకం కానున్నదని పేర్కొన్నారు. ఇతర బ్యాటరీలతో పోలిస్తే ఈ వాటర్ బ్యాటరీలు ఎంతో సురక్షితమైనవని వెల్లడించారు.



ఇండియన్ సినిమా రూపురేఖలు మార్చే 'కల్కి'

ప్రభాస్ 'కల్కి 2989 ఏడీ'లో తాను నటిస్తున్నట్టు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని తేల్చి చెప్పేశారు టాలీవుడ్ హల్క్ రానా. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ భారీ పాన్‌ఇండియా సినిమాలో అమితాబ్, కమల్‌హాసన్, దీపికా పదుకొణే, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. వీళ్లతోపాటు రానా కూడా ఇందులో ముఖ్యభూమిక పోషిస్తున్నట్లు కొన్నాళ్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. వీటిపై తన తాజా ఇంటర్వ్యూలో వివరణ ఇచ్చారు రానా. 'నేనూ, డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఇద్దరం ఒకటో తరగతి నుంచీ ఫ్రెండ్స్. పైగా తను నా తొలి సినిమా 'లీడర్'కి శేఖర్ కమ్ముల దగ్గర అసిస్టెంట్‌గా పనిచేశాడు. మా ఇద్దరి అనుబంధం ఈనాటిది కాదు. అందుకే విదేశాల్లో జరిగిన 'కల్కి' ప్రమోషన్స్‌లో పాల్గొన్నాను. దాంతో ఆ సినిమాలో నేనూ ఉన్నట్టు రాసేస్తున్నారు. నిజానికి 'కల్కి'లో నేను లేను. అయితే ఒక్కటి మాత్రం చెప్పగలను. 'కల్కి' సామాన్యమైన సినిమా కాదు. ఈ సినిమాతో ఇండియన్ సినిమా రూపురేఖలు మారనున్నాయి. 'ఎవెంజర్స్' స్థాయి సినిమా అవుతుంది' అని చెప్పారు రానా.

బాత్ పిక్ తెచ్చిన తంటా



మనకు పెద్దగా కనిపించని విషయం.. పక్కవాళ్లకు భూతద్దంలో కనిపించవచ్చు. అందుకే మన చర్యల పరిణామాలను ముందుగా పసిగట్టి జాగ్రత్త తీసుకోవాలి. ఈ విషయంలో కొందరు సినీ సెలబ్రిటీలు వీక్. తొందరపడి పోస్టులు పెట్టేయడం, తర్వాత నాలిక కరుచుకోవడం. చాలామంది విషయంలో ఇది పరిపాటైపోయింది. నిరంతరం వార్తలో ఉండే స్టార్ హీరోయిన్ సమంత.. టవల్ కట్టుకొని ఇన్ఫ్రారెడ్ ఆవిరి బాత్ చేస్తున్న పిక్ ఒకటి తాజాగా పోస్టు చేసింది. ఆ పోస్ట్‌లో ఈ బాత్ వల్ల కలిగే ప్రయోజనాలను కూడా రాసింది. ఏమనుకుందో ఏమో.. అంతలోనే పోస్ట్‌ను డిలీట్ చేసేసింది. అయితే ఈ కొద్ది సమయంలోనే ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. కొందరు ఆకతాయిలైతే సమంత పోస్ట్ చేసిన పిక్‌ను మార్ఫింగ్ చేసి, ఇబ్బందికరంగా చూపిస్తూ వైరల్ చేశారు. సామ్ అభిమానులేమో ఒరిజినల్ పిక్‌ను వైరల్ చేస్తున్నారు. ఏదేమైనా మొత్తంగా బూమరాంగ్ అయ్యింది. ఈ నేపథ్యంలో సమంత పరోక్షంగా స్పందిస్తూ.. 'మిమ్మల్ని మీరు సమర్థించుకోవాల్సిన అవసరం లేకుండా.. నిరూపించుకోవాల్సిన అవసరం రాకుండా జీవించడమే నిజమైన విజయం' అనే కొటేషన్‌ని పోస్ట్ చేసింది. ఈ పిక్‌పై జరుగుతున్న రాద్ధాంతానికి ఫుల్‌స్టాప్ పెట్టడానికే సామ్ ఈ క్యాప్షన్ షేర్ చేసిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

చిత్రం



అప్పుడు చరణ్‌తో.. ఇప్పుడు హృతిక్‌తో

తారక్, చరణ్ కలిసి 'నాటునాటు..' అంటూ స్టెప్పులేస్తే వారి ఆటపాట గురించి ప్రపంచం మాట్లాడుకుంది. ఇప్పుడు ఆ ఫీట్ మళ్లీ రిపీట్ కానుందని సమాచారం. కాకపోతే.. తారక్ అలాగే ఉన్నారు. చరణ్ ప్లేస్‌లోకి మాత్రం హృతిక్‌రోషన్ వచ్చి చేరారు. ప్రస్తుతం ముంబైలో 'వార్ 2' షూటింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తారక్, హృతిక్‌లపై ఓ సాంగ్‌ని తెరకెక్కిస్తున్నారు దర్శకుడు ఆయాన్ ముఖర్జీ. బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా కూడా ఈ పాటలో భాగమైంది. ఇదొక పబ్ సాంగ్. బ్యాగ్రౌండ్‌లో కొన్ని సీన్స్ జరుగుతూ ఉంటే ఈ పాట నడుస్తూ ఉంటుందట. కథలో కీలకమైన సందర్భంలో వచ్చే ఈ పాటలో తారక్, హృతిక్ పోటీపడి మరీ స్టెప్పులేయనున్నారట. ఈ పాట సినిమాకే హైలైట్ ఆవుతుందని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మోస్ట్ వాంటెడ్ పాన్ ఇండియా మల్టీస్టారర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హృతిక్ రోషన్ పాత్రకు దీటైన పాత్రను తారక్ పోషిస్తున్నారని తెలుస్తున్నది. ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

ఉత్తమ రాజకీయ వ్యంగ్యాత్మక చిత్రం

'భీమదేవరపల్లి బ్రాంచి'



దివంగత దిగ్దర్శకుడు, దర్శకరత్న దాసరి నారాయణ రావు పేరిట నెలకొల్పిన 'డీఎన్ఆర్ ఫిల్మ్ అవార్డ్స్' వేడుక ఆదివారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఘనంగా జరిగింది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో, మన యాస భాషలను ఆవిష్కరిస్తూ రూపొందించిన 'భీమదేవరపల్లి బ్రాంచి' చిత్రం ఉత్తమ పొలిటికల్ సెటైర్ మూవీగా పురస్కారాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత డాక్టర్ బత్తిని కీర్తిలత గౌడ్ మాట్లాడుతూ 'ఈ అవార్డును స్వీకరించడం గర్వంగా ఉంది. ఈ పురస్కారం సినీ ఇండస్ట్రీ పట్ల నాకున్న బాధ్యతను మరింతగా పెంచింది' అన్నారు. ఇక 'భీమదేవరపల్లి బ్రాంచి' కథాంశం విషయానికొస్తే.. మోదీ ప్రవేశపెట్టిన జన్‌ధన్ పథకంలో భాగంగా అందరూ బ్యాంక్ అకౌంట్స్ ఓపెన్ చేస్తారు. ఒకరి ఖాతాలో అనుకోకుండా 15లక్షలు పడతాయి. ఆ డబ్బులను ప్రభుత్వమే వేసిందని భావించిన సదరు యజమాని వాటిని మొత్తం ఖర్చు పెడతాడు. అయితే ఆ డబ్బులు జన్‌ధన్‌కు సంబంధించినవి కావని, బ్యాంకు తప్పిదం వల్ల అనుకోకుండా క్రెడిట్ అయ్యాయని, వాటిని తిరిగి కట్టాల్సిందేనని బ్యాంకు వాళ్లు ఒత్తిడి తీసుకొస్తారు. ఈ నేపథ్యంలో సదరు కుటుంబం ఎదుర్కొన్న కష్టాలు, మోదీ చేసిన మోసాన్ని కళ్లకుకట్టినట్లుగా ఈ సినిమాలో ఆవిష్కరించారు. తెలంగాణ గ్రామీణ వాతావరణంలో స్థానిక యాస, భాషలకు పట్టం కడుతూ ఈ సినిమా అందరిని మెప్పించింది.



మన మధ్య జరిగే కథ

రాజ్‌తరుణ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భలే ఉన్నాడే'. జే. శివసాయివర్ధన్ దర్శకుడు. ఎన్.వి.కిరణ్‌కుమార్ నిర్మాత. దర్శకుడు మారుతి ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. సోమవారం ఆయన టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ 'రాజ్‌తరుణ్‌తో మంచి సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. దర్శకుడు సాయికి ఈ పాయింట్ చెబితే తను బాగా డిజైన్ చేసుకొని తీసుకొచ్చాడు. ఇది కాన్సెప్ట్ బేస్డ్ ఫిల్మ్. మన మధ్యలో జరిగే కథలా ఉంటుంది. శేఖర్‌చంద్ర మంచి పాటలిచ్చారు' అన్నారు. మారుతితో సినిమా చేయాలనే కల ఈ ప్రాజెక్ట్‌తో నెరవేరిందని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని హీరో రాజ్‌తరుణ్ తెలిపారు. దర్శకుడిగా తనకిది మొదటి చిత్రమని, ఆద్యంతం నవ్విస్తుందని జె.శివసాయివర్ధన్ చెప్పారు. ఈ సినిమాలో కామెడీ కొత్త పంథాలో ఉంటుందని, పాటలు బాగా కుదిరాయని, సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: నగేష్ బానెల్లా, సమర్పణ: మారుతి టీమ్, ప్రొడక్షన్ డిజైనర్: శివకుమార్ మచ్చ, దర్శకత్వం: జె.శివసాయివర్ధన్.

'లాక్‌డౌన్'లో ఏం జరిగింది?



'టిల్లు స్క్వేర్' చిత్రంతో ఇటీవలే మంచి విజయాన్ని దక్కించుకుంది మలయాళీ సోయగం అనుపమ పరమేశ్వరన్. ప్రస్తుతం ఈ భామ విభిన్న కథాంశాలను ఎంచుకొని సినిమాలు చేస్తున్నది. తమిళంలో కూడా ఈ అమ్మడికి మంచి అవకాశాలొస్తున్నాయి. ఆమె తాజా తమిళ చిత్రం 'లాక్‌డౌన్' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.జీవా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ తెరకెక్కిస్తున్నది. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో అనుపమ పరమేశ్వరన్ భయంతో ఏడుస్తూ కనిపిస్తున్నది. లాక్‌డౌన్ నేపథ్యంలో నడిచే థ్రిల్లర్ కథాంశమిదని, స్క్రీన్‌ప్లే సరికొత్తగా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ సినిమాతో పాటు తమిళంలో అనుపమ పరమేశ్వరన్ 'బైసన్ కాలమాదన్' అనే తమిళ చిత్రంలో కూడా నటిస్తున్నది. ధృవ్ విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిస్తున్నారు. మారి సెల్వ రాజ్ దర్శకుడు. ప్రస్తుతం తెలుగులో 'పరదా' చిత్రంలో నటిస్తున్నది అనుపమ పరమేశ్వరన్.

కళ్లు లేకుండా జీవితాన్ని గెలిచిన విజేత



'దర్శకుడు తుషార్ హీరానందానీ 'శ్రీకాంత్' కథ చెప్పినప్పుడు షాక్ అయ్యాను. ఇలాంటి వ్యక్తి ఈ భూప్రపంచంలో ఉన్నాడా?! అనిపించింది.' అన్నారు జ్యోతిక. కళ్లు లేని దివ్యాంగుడైన తెలుగు పారిశ్రామికవేత్త శ్రీకాంత్ బొల్లా బయోపిక్‌గా తెరకెక్కిన బాలీవుడ్ చిత్రం 'శ్రీకాంత్'. ఇందులో శ్రీకాంత్‌గా రాజ్‌కుమార్‌రావ్ నటించగా, జ్యోతిక కథలో కీలకమైన పాత్ర పోషించారు. తుషార్ హిరానందానీ దర్శకుడు. భూషణ్‌కుమార్, కిషన్‌కుమార్, నిధి పర్మార్, హీరానందాని నిర్మాతలు. ఈ నెల 10న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా హైదరాబాద్‌లో జ్యోతిక విలేకరులతో ముచ్చటించారు.

సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అన్నారు. కళ్లు లేకుండా జీవితాన్ని గెలవడం చిన్న విషయం కాదు. అందుకే అలాంటి గొప్ప వ్యక్తి కథలో నటించడం గౌరవంగా భావించాను. శ్రీకాంత్ బొల్లాగా రాజ్‌కుమార్‌రావు నటన అద్భుతంగా ఉంటుంది. కళ్లు లేని దివ్యాంగుడిలా నెక్ట్స్ లెవల్లో నటించారాయన.

శ్రీకాంత్ బొల్లా కథలో చాలా కోణాలున్నాయి. ఆయన జీవితాన్ని ప్రభావితం చేసిన స్త్రీమూర్తులు చాలామంది ఉన్నారు. వారందరినీ కలిపి ఓ కేరక్టర్‌ని క్రియేట్ చేశారు దర్శకుడు తుషార్. నా పాత్ర అదే. ఈ సినిమాలో ఉపాధ్యాయురాలిగా కనిపిస్తా. శ్రీకాంత్‌ని ప్రభావితం చేసే పాత్ర అన్నమాట. మంచితనం, సామాజిక స్పృహ కలగలిసిన గొప్ప పాత్ర. విశేషమేంటంటే నేను టీచర్‌గా నటించిన మూడో సినిమా ఇది.

ప్రస్తుతానికి ఈ సినిమాతోపాటు ఒక వెబ్ సిరీస్ కూడా చేస్తున్నాను. కాస్త ఖాళీ దొరికితే పిల్లలతో సరిపోతుంది. సూర్య కూడా తన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తెలుగులో నటించి చాలాకాలం అయ్యింది. మంచి పాత్ర లభిస్తే తెలుగులో కూడా చేస్తాను.



సత్య.. ఓ టీనేజ్ లవ్‌స్టోరీ

హమరేశ్, ప్రార్థన సందీప్ జంటగా నటించిన టీనేజ్ ప్రేమకథ 'సత్య'. వాలీ మోహన్‌దాస్ దర్శకత్వంలో తమిళంలో రూపొందిన ఈ చిత్రాన్ని శివ మల్లాల తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 10న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. దర్శకులు సతీశ్ వేగేశ్న, మధుర శ్రీధర్, కృష్ణ చైతన్య, పవన్ సాధినేని, అర్జున్, సీనియర్ జర్నలిస్ట్ ప్రభు అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'ఒక జర్నలిస్ట్‌గా రివ్యూ ఇద్దామని సినిమా చూశా. దీన్ని తెలుగు ప్రేక్షకులకు కూడా చూపించాలి అనిపించి నిర్మాతగా మారాను' అని శివ మల్లాల అన్నారు. ఇంకా చిత్రబృందం మాట్లాడారు.